ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-12-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 326 పేజీలు: 8+16 వెల: 6.50


శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన బాలల సమ్మేళనంలో పాల్గొని వారితో మాట్లాడుతున్న ప్రధాని మోడీ

# కలలతో ఎదగండి

## 'రేపటి పౌరుల'తో ప్రధాని మోడీ

### దేశ అభివృద్ధి బాణాలు మీరే..

### జెన్‌జడ్, జెన్ అల్ఫా తరాలకు ప్రధాని పిలుపు

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** జెన్ జెడ్, జెన్ అల్ఫా తరాలు తమ కలలతో ఎదగాలని, సూత్రాలపై దృష్టి పెట్టాలని, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశ హోదా వైపు నడిపించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. యువతకు వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయనిఅన్నారు. వీర్ బల్ దివాస్ సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన బాలల సమ్మేళనంలో యువ భారతీయులనుద్దేశించి ప్రధాని నరేంద్రమోడీ >>2

# ఇక కీలక నేతల విచారణ!

## ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్తమలుపు

### కెటిఆర్, హరీష్‌రావు, మరికొందరిని ప్రశ్నించనున్న సిట్

### ఇంటెలిజెన్స్ బాస్‌గా ప్రభాకర్ రావు నియామకంపై కెసిఆర్‌నూ విచారించే అవకాశం





**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తొలి అంకం ముగియడంతో రెండవ అంకం మొదలు పెట్టేందుకు సిట్ సన్నద్ధమవుతోంది. ఈ కేసులో మొదటి నిందితుడు నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు కస్టడీ విచారణ ముగియడంతో ఆయన వెల్లడించిన సమాచారం ఆధారంగా అప్పట్లో ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన బిఆర్ఎస్ ప్రముఖులను విచారించాలని సిట్ నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా మొదట కెటిఆర్, హరీష్ రావును విచారించి ఆ తరువాత మరికొందరి వాంగ్మూలం తీసుకోవాలని సిట్ భావిస్తున్నట్లు తెలిసింది. వీరితో పాటు అప్పట్లో బిఆర్ఎస్‌లో వుండి ఆ తరువాత ఇతర పార్టీలకు వెళ్లిన ఇంకొందరు ప్రజాప్రతినిధులను కూడా విచారించాలని సిట్ నిర్ణయించినట్లు సమాచారం. దీంతో పాటు అప్పట్లో ఇంటెలిజెన్స్ విభాగం మొత్తానికి విశ్రాంత ఐజిగావున్న ప్రభాకర్ రావును ఏ ప్రాతిపదికన నియమించారనే దానిపై కెసిఆర్‌ను విచారించాలని సిట్ భావిస్తు >>2

## పోలీసు కస్టడీనుంచి ప్రభాకర్‌రావు విడుదల

### రాజకీయ విశ్లేషకుడు ఆరామస్తాన్‌ను ప్రశ్నించిన సిట్

2లో



# హస్తినలో సిఎం రేవంత్

## నేడు సిడబ్ల్యుసికి హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీలో జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సిడబ్ల్యుసి) సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సమావేశం నూతనంగా నిర్మించిన ఎఐసిసి కార్యాలయం ఇందిరా భవన్‌లో శనివారం ఉదయం 10-30 గంటలకు నిర్వహించను న్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు >>2

# ఇంత వాయుకాలుష్యమా?



## సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** ఢిల్లీలో పెరిగిన వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అయితే సంబంధిత సంస్థలు దీనికి పరిష్కారం కనుగొంటాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ రాజధానిని పీడిస్తున్న ఈ సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ప్రయోజనాలు కలిగించే విధానాల కంటే దీర్ఘకాలిక పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. గోవాలో ఓ కార్యక్రమానికి హాజరైన జస్టిస్ సూర్యకాంత్ మీడియాతో మాట్లా >>2

# సాగుచేసే రైతులకే పెట్టుబడి సాయం

## అసెంబ్లీలో అధికారిక ప్రకటన చేసే అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:** తెలంగాణరైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించేందుకు సిద్ధమవుతోంది. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని సంక్రాంతి పండుగ కానుకగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. అయితే, ఈసారి పథకం అమలులో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. కేవలం పంటలు సాగు చేసే నిజమైన రైతులకే ప్రయో జనం చేకూరేలా పక్కా ప్రణాళికతో >>2

# అసెంబ్లీకి రానున్న కెసిఆర్!

- సమావేశాల తర్వాత బిఆర్ఎస్ బహిరంగ సభలు
- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల కార్యాచరణపై కసరత్తు
- కెటిఆర్, హరీష్ ప్రభృతులతో భేటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబరు 26:** బిఆర్ఎస్ అధినేత,మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఈనెల 29 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. శుక్రవారం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్గొండ, హైదరాబాద్ జిల్లాలకు చెందిన మాజీ మంత్రులతో ఆయన సమావేశం అయ్యారు. సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడంపై దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే ఆయన కూడా అసెంబ్లీకి వచ్చి సర్కార్‌ను ఇరుకున పెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో తదుపరి కార్యాచరణపై బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎర్రవెల్లిలో జరిగిన సమావేశంలో కెటిఆర్, హరీశ్‌రావు, మధుసూదనాచారి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, జగదీష్ >>2




True Value యాప్‌ను ఇక్కడ డౌన్‌లోడ్ చేసుకోండి

నమ్మకం
- ధృవీకరించబడిన కారు చరిత్ర**
- 3 ఉచిత సేవలు** పొందండి @ 5000++ మారుతి సుజుకీ సర్వీస్ స్టేషన్స్

నాణ్యత
- 376 నాణ్యతాపరమైన తనిఖీ పాయింట్స్
- 1 సంవత్సరం వరకు వారంటీ**

TRUE VALUE CERTIFIED

విచారణ కోసం కాల్ చేయండి 1800 102 1800 | సందర్శించండి www.marutisuzukitruevalue.com

**Karimnagar: Adarsha Autoworld:** 7337442380 | **Varun Motors**: 9640248417 | **Adarsha Automotives**: 7799784428 **Warangal: Adarsha Automotives, Hanamkonda** : 8886236633 | **Win Motors**: 8688827044 | **Adarsha Auto World**: 9133382182 | **Nalgonda: Pavan Motor**: 8790902165 | **Nizamabad: Varun Motor**: 9052901777 | **Mahabubnagar: Sri Jayarama Motors**: 9642826963.

*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి. వివరణాత్మక నిబంధనల కోసం దయచేసి సమీపంలోని డీలర్‌షిప్‌ను సందర్శించండి. **ధృవీకరించబడిన కారు చరిత్ర & వారంటీ True Value ధృవీకరించబడిన కార్లపై వర్తిస్తుంది. ఉచిత సర్వీస్ లేబర్ ఛార్జీలపై మాత్రమే వర్తిస్తుంది. ఉపయోగించిన చిత్రాలు దృష్టాంత ప్రయోజనాల కోసం మాత్రమే.



శుక్రవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము చేతులమీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న క్రికెటర్ సూర్యవంశీ

# కలలతో ఎదగండి

>> మాట్లాడుతూ, సాహిబ్జాదాస్- జోరావర్ సఇంగ్, ఫతేసింగ్‌ల అసమాన ధైర్యసాహసాలు, జాతీయ ఆదర్శాల నుండి ప్రేరణ పొందాలని యువతకు పిలుపునిచ్చారు. వయస్సుతో సంబంధం లేకుండా పెద్ద సవాళ్లను ఎదుర్కోవాలని మోడీ యువతకు సలహా ఇచ్చారు. సంస్కృతంలో ఒక శ్లోకాన్ని ఉటంకిస్తూ, "ఒక చిన్న పిల్లవాడు జ్ఞానం గురించి మాట్లాడితే, మనం దానిని స్వీకరించాలి" అని సూచించారు. "మీరు చిన్న వయసులోనే పెద్ద పనులు చేయగలరు. మీరు దాన్ని సాధించారు. కానీ ఈ విజయాలను భిన్నంగా చూడాలి. మీ కలలను ఆకాశానికి ఎత్తండి. దేశం దృఢ సంకల్పంతో మీతో ఉంది" అని ప్రధాని పేర్కొన్నారు. "గతంలో, యువత కలలు కనడానికి భయపడేవారు, ఎందుకంటే పాత వ్యవస్థ నిరాశా వాతావరణాన్ని కలిగించింది. కానీ ఇప్పుడు, దేశం ప్రతిభ కోసం వెతుకుతోంది. 140 కోట్ల మంది పౌరుల శక్తితో బలోపేతం చేయబడిన వేదికలను అందిస్తుంది" అని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా ఇంటర్నెట్, స్టార్టప్ మిషన్లు, కేంద్రీకృత వృద్ధికి వేదికల వంటి వనరులను ప్రస్తావించారు. నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్ షిప్‌లు, క్రీడా ప్రోత్సాహం, ఫిన్‌టెక్, తయారీ, యువ భారత్ వేదికల వంటి విధానాలకు యువత కేంద్రంగా ఉండటంతో, వ్యక్తిగత విజయం ఇతరులకు స్ఫూర్తినివ్వాలని అన్నారు. స్వల్పకాలిక ప్రజాదరణ (పాపులారిటీ) వల్ల యువత పరధ్యానానికి గురికావద్దని ప్రధాని మోడీ సలహా ఇచ్చారు. దేశ నిర్మాణానికి సహకరించిన మహానుభావుల నుంచి, గొప్పవ్యక్తులనుంచి ఆదర్శాలను, మంచి విషయాలను నేర్చుకోవాలని సూచించారు.



శుక్రవారం న్యూఢిల్లీలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను కలుసుకున్న దృశ్యం

# బాలల్లో నెలకొన్న ధైర్యసాహసాలను మరింత ప్రోత్సహించాలి

## బాలపురస్కారాల ప్రదానంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** వీర్‌బాల్ దినోత్సవ్ సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా ఎంపికచేసిన బాలలకు విజేత పురస్కారాలను పంపిణీచేసారు. రాష్ట్రపతిభవన్‌లోజరిగిన ఈకార్యక్రమంలో మొత్తం 20 మందికిపైగా బాలలకు పురస్కారాలు అందాయి. 320 ఏళ్లక్రితమే సిక్కు ఆరాధ్యదైవం గురుగోవింద్‌సింగ్‌జీ నలుగురు కుమారులు కూడా న్యాయం, వాస్తవాలకు మద్దతుగా జరిపిన పోరాటంలో ప్రాణత్యాగాలుచేసారు. పిన్నవయసు షాహిబ్‌జాదాలుగా పిలుచుకుంటామని, వారి త్యాగాలను భారత్; విదేశాలో కూడా ప్రశంసించారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గుర్తుచేసారు. దేశభక్తి, ఉన్నతస్థాయిల ఆలోచనలున్న బాలలను మరింత ప్రోత్సహిస్తే రాణిస్తారని ఆమె అన్నారు. ధైర్యసాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, సృజనాత్మకత, సైన్స్ టెక్నాలజీ, సామాజిక సేవ, క్రీడల్లో పలు సేవలందించిన వారికి ఈపురస్కారాలు అందుతున్నాయన్నారు. ఏడేళ్ల వాకా లక్ష్మీప్రాగ్నిక చెస్ పవర్‌హౌస్‌గా ప్రపంచవేదికపై నిలిచిందన్నారు. అజయ్‌రాజ్ మహ్మద్ సిదాన్ పి వంటి వారు వారి ప్రతిభ ధైర్యసాహసాలతో ముందున్నారన్నారు. తొమ్మిదేళ్ల బాలిక వ్యోమప్రియా, 11 ఏళ్ల బాలుడు కమలేష్‌కుమార్‌లు ఇతరులను రక్షించేక్రమంలో వారు ప్రాణాలు పోగొట్టుకుని తమ ధైర్యసాహసాలను ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. పదేళ్ల శ్రావణ్‌సింగ్ ఆపరేషన్‌సిందూర్‌లో సైనికులకు సేవలందించారని రాష్ట్రపతి గుర్తుచేసుకున్నారు. అదేవిధంగా శివాని హోసూరు ఉప్పర వంటి వారు ప్రపంచక్రీడల్లో భారత్‌కు గుర్తింపు తెచ్చారన్నారు. ఇక పిన్నవయసులోనే ఉన్నతస్థాయి క్రికెటర్‌గా అత్యంత పోటీతత్వంతో ఎదిగిన వైభవ్‌సూర్యవంశీ భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని రాష్ట్రపతి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మద్దికెర ప్రాంత పారా అథ్లెట్ శివాని, తెలంగాణ మమల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన పడకంటి విశ్వనాథ్ కార్తికేయలకు రాష్ట్రీయ బాల్‌పురస్కారాలు లభించాయి.

**క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి బాలపురస్కారం**

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాన్ని యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ అందుకున్నారు. అవార్డు స్వీకరించే క్రమంలో క్రికెటర్ వైభవ్ ఇవాళ మ్యాచ్‌కు దూరం అయ్యాడు. వాస్తవానికి బీహార్, మణిపూర్ మధ్య ఇవాళ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్ జరుగుతున్నది. కానీ ఆ మ్యాచ్‌లో వైభవ్ ఆడడం లేదు. 5 నుంచి 18 ఏళ్లు ఉన్నవారికి బాల్ పురస్కారాలు అందజేస్తారు. వైభవ్‌తో పాటు మొత్తం 19 మంది పిల్లలకు వివిధ రంగాల్లో అవార్డులను అందజేయనున్నారు. మీరు సాధించిన ఘనత యావత్ దేశానికి ప్రేరణగా నిలుస్తుందని, ఇవాళ గుర్తింపు పొందిన ప్రతి చిన్నారి చాలా ముఖ్యమైన, విలువైన వ్యక్తులు అని, అలాంటి నైపుణ్యం ఉన్న పిల్లల వల్లే ప్రపంచవ్యాప్తంగా దేశానికి గుర్తింపు వస్తున్నదని రాష్ట్రపతి ముర్ము అన్నారు.

**ఆపరేషన్ సింధూర్ బాలుడికి బాలపురస్కారం**

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పదేళ్ల బాలుడు తన వంతుగా సైనికులకు సేవలందించాడు. టీ, స్నాక్స్, పాలు, లస్సీ వంటివి వారికి అందజేశాడు. నాటి నుంచి ప్రశంసలు పొందిన ఆ బాలుడికి బాల పురస్కార్ అవార్డు దక్కింది. పంజాబ్ ఫిరోజ్‌పూర్ జిల్లాలోని సరిహద్దు ప్రాంతంలో నివసించే శ్రావణ్ సింగ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ ప్రదానం చేశారు. బాల పురస్కార్ అవార్డు తనకు రావడం చాలా సంతోషంగా ఉన్నదని శ్రావణ్ సింగ్ తెలిపాడు. తనకు ఈ అవార్డు దక్కుతుందని ఎప్పుడూ ఊహించలేదని చెప్పాడు. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా సైనికులకు చేసిన సేవల గురించి వివరించాడు. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైనప్పుడు సైనికులు మా గ్రామానికి వచ్చారు. వారికి సేవ చేయాలని నేను అనుకున్నా. నేను రోజూ వారికోసం పాలు, టీ, మజ్జిగ, ఐస్ తీసుకెళ్లేవాడినని తెలిపాడు.

# అసెంబ్లీకి రానున్న కెసిఆర్!

>> రెడ్డి, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొన్నారు. మాజీ మంత్రులతో సమావేశం సందర్భంగా పలు అంశాలపై కెసిఆర్ చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల అంశంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ ఎప్పుడూ ద్రోహమే చేస్తోందని,. బిఆర్‌ఎస్‌కు తప్ప మరే ఇతర పార్టీకి తెలంగాణపై పట్టింపు లేదని కెసిఆర్ అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టాల్సిందేనని వివరించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ప్రజల్లోకి వెళ్దాం ఉద్యమాన్ని నిర్మిద్దాం అని పార్టీ నేతలకు సూచించారు. నీటి హక్కులను పరిరక్షించుకునే బాధ్యత బిఆర్‌ఎస్‌పైనే ఉందని పేర్కొన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని అసెంబ్లీలో వివరిద్దామని పార్టీ నాయకులకు సూచించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ద్రోహాన్ని అసెంబ్లీ వేదికగా చెబుదామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై ప్రజల్లో అవగాహన పెంచేలా గ్రామస్థాయి నుంచి ఉద్యమ కార్యక్రమాలు చేపట్టాలన్న అంశంపై నేతలు చర్చించారు. అలాగే బహిరంగ సభల నిర్వహణ, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కూడా ఈ భేటీలో లోతైన చర్చ జరిగినట్లు సమాచారం. ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం వైఖరిపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలన్న దిశగా కేసీఆర్ కార్యాచరణ రూపొందిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల జరిగిన బీఆర్‌ఎస్ కార్యవర్గ సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కెసిఆర్ నిప్పులు చెరిగిన విషయం తెలిసిందే. సమైక్య రాష్ట్రంలో ఎక్కువ అన్యాయానికి గురైన జిల్లా పాలమూరేనని, 174 టీఎంసీల నీరు పాలమూరు జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టులకు రావాల్సి ఉందని మీడియా సమావేశంలో కేసీఆర్ అన్నారు. బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ముందు తాము చాలా వాదించి, ఉద్యమ సమయంలో పాలమూరుకు జరిగిన అన్యాయాన్ని వివరించినట్లుగా కేసీఆర్ తెలిపారు. రాష్ట్రాల మధ్య వివాదాలే పరిష్కరిస్తామని ట్రైబ్యునల్ చెప్పిందన్న కెసిఆర్ బచావత్ ట్రైబ్యునల్ పంపకాల్లో పాలమూరు గురించి స్పష్టంగా చెప్పారని ఇటీవల సమావేశంలో కెసిఆర్ పేర్కొన్నారు. 1974లో బచావత్ ట్రైబ్యునల్ 17టీఎంసీలు జూరాలకు సుమోటోగా కేటాయించినా దాన్ని పట్టించుకున్నవారే లేరని ఆయన ధ్వజమెత్తారు. పాలమూరుపై కేంద్రాన్ని ఎండగట్టి పెద్దఎత్తున ఉద్యమిస్తామని, భారీ బహిరంగ సభలు పెడుతున్నామని తాను సభలకు రానున్నట్లుగా వెల్లడించారు. ఇటీవల బిఆర్‌ఎస్ పార్టీ తమ తమ కార్యకలాపాల్లో వేగంపెంచింది. పార్టీ శ్రేణుల్ని ఉత్తేజితం చేసే దిశగా ఆ పార్టీ అధినేత కేసీఆర్ వ్యూహం రచించినట్లు తెలుస్తోంది. ఇటీవల వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూడా ఆ పార్టీకి కొంత ఊరట నిచ్చినట్లుగా కనిపిస్తోంది. తాజాగా నాలుగు జిల్లాల ముఖ్య నాయకులతో ఆ పార్టీ అధినేత సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# పెట్టుబడి సాయం

>> ముందుకెళుతోంది. గతంలో సాగు చేయని భూములకు కూడా నిధులు అందుతున్నాయన్న విమర్శల నేపథ్యంలో, ఈసారి ప్రభుత్వం టెక్నాలజీ సాయం తీసుకుంటోంది. ఉపగ్రహ చిత్రాల ద్వారా వ్యవసాయ భూములను క్షుణ్ణంగా పరిశీలించి, డిజిటల్ మ్యాపింగ్ ద్వారా ఏ పొలంలో పంట ఉందో, ఏది ఖాళీగా ఉందో గుర్తిస్తున్నారు. దీనివల్ల సాగులో లేని బంజరు భూములు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా నిలిచిపోనుంది. ఈ చర్యతో ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడమే కాకుండా, అర్హులైన రైతులకే లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి రూ. 18,000 కోట్లు కేటాయించింది. గత వానాకాలం సీజన్‌లో సుమారు 69 లక్షల మంది రైతులకు రూ. 9,000 కోట్లను కేవలం 9 రోజుల్లోనే జమ చేసింది. ఇప్పుడు యాసంగికి కూడా జనవరి రెండో వారం నాటికి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి, పండుగలోపు నిధులు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ విషయంపై ఈనెల 29 నుంచి ప్రారంభం కాబోతున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉంది. ఆ వెంటనే వచ్చే సంక్రాంతి నాటికి రైతుల బ్యాంకు ఖాతాల్లో భరోసా సొమ్ము జమ చేయనున్నట్టు తెలియవచ్చింది. దీనికి సంబంధించి అవసరమైన నిధులను సమకూర్చాలని ఇప్పటికే ఆర్థిక శాఖను ఆదేశించినట్లు సమాచారం. ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతు భరోసా సాయం కింద ఏడాదికి ఎకరానికి 12 వేల రూపాయలు చొప్పున విడుదల చేయనుంది. ఇందుకు గాను శాటిలైట్ ఇమేజెస్ ద్వారా రాష్ట్రంలోని రైతుల వివరాలు, సాగు విస్తీర్ణం, వేసిన పంటలు తదితర అంశాలను వారీగా డేటాను సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 70.11 లక్షల మంది రైతులకు చెందిన 1.49 కోట్ల ఎకరాలకు రైతుభరోసాను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రంలో కొత్తగా పంట భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు రైతు భరోసా నిమిత్తం దరఖాస్తు చేసుకునే వీలు కల్పించడంతో దాదాపు 5 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి.

# పేమెంట్ కోటా సిఎం రేవంత్

## ఒక్క ప్రెస్‌మీట్‌కే ఆయనకు ముచ్చెమటలు

## నేను గుంటూరులోనే చదివా.. నీ అల్లుడు ఆంధ్రాయేకదా.. కెటిఆర్ కౌంటర్



శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:** కెసిఆర్ ఒక్క ప్రెస్‌మీట్‌కు సిఎం రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఇక కెసిఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డి గుండె ఆగి చస్తాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు దోసల అనిల్ బిఆర్‌ఎస్‌లో చేరారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కెటిఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. నేను గుంటూరులో చదువుకుంటే నీకేంబాధ అని ప్రశ్నించారు. నేను హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాష నేర్చుకున్నా.... నువ్వుకూడా నేర్చుకో అని అన్నారు. నేను గుంటూరులో ఇంటర్ చదువుకున్నా.. నీ అల్లుడు ఆంధ్రోడే కదా అని ప్రశ్నించారు. ఇక చిట్టినాయుడు కాదు.. భీమవరం బుల్లోడు అని ఎద్దేవా చేశారు. మా అయ్య మొగోడు.. తెలంగాణ తెచ్చిన మొనగాడు అని కెటిఆర్ అన్నారు. మా అయ్యపేరు బరాబర్ చెప్పుకుంటానని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో ఎమ్మెల్యేగా గెలవకుండా చేసే బాధ్యత మాది అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి భాషను చూస్తే పిల్లలు నేర్చుకునే పరిస్థితి ఉందని అన్నారు. పాలమూరు - రంగారెడ్డి డిపిఆర్‌ను వెనక్కి పంపితే ఏం చేస్తున్నావని కెసిఆర్ అడిగారని తెలిపారు. 10 శాతం పనులు పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలని అడిగారని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలనిఅడిగారు.. అందులో తప్పేముందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే రేవంత్ రెడ్డికి కోపమొస్తుందని అన్నారు. ఎనుముల రేవంత్ రెడ్డికాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డిఅని కెటిఆర్ విమర్శించారు. ఎన్నికలకు ముందుకల్యాణలక్ష్మీకిందఆడబిడ్డలపెళ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని సోనియాగాంధీ మీద రేవంత్ రెడ్డి ఒట్టువేశాడని తెలిపారు. మహిళలకు రూ.2500 ఇస్తానని ప్రియాంక గాంధీ మీద ఒట్టు వేశాడని గుర్తుచేశారు. ఇవన్నీ ఎగవేసి.. ఇప్పుడు కోటిమంది మహిళలకు కోటీశ్వర్లను చేస్తానంటున్నాడని మండిపడ్డారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలంటే బడ్జెట్ సరిపోతుందా అని ప్రశ్నించారు. బ్యాగులు మోసి జైలు కెళ్లి.. పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యాడని రేవంత్ రెడ్డిపై కెటిఆర్ సెటైర్లు వేశారు. ఢిల్లీకి సంచులుమోసి పదవులు కాపాడుకుంటు న్నాడని ఆరోపించారు. మహిళలకు ఇస్తానన్న రూ.2500 ఎక్కడపోయాయని అడిగితే నీ గుడ్లు పీకి గోటీలు ఆడుకుంటా అంటున్నాడని మండి పడ్డారు.

## హస్తినలో సిఎం రేవంత్

>> మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ కీలక సమావేశంలో దేశ వ్యాప్తంగా రాజకీయ పరిస్థితులు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, రానున్న ఎన్నికలు, పార్టీ వ్యూహాలపై చర్చ జరగనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో పలువురు సీనియర్ నాయకులు, పార్టీ కీలక నాయకులు పాల్గొననున్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ పెద్దలతో సమావేశం సందర్భంగా రాష్ట్ర కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టులపై చర్చించనున్నట్లు సమాచారం.

## గాంధీభవన్‌లో శంకర్ దయాళ్ శర్మ, మన్మోహన్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు26:** శుక్రవారం గాంధీ భవన్‌లో మాజీ రాష్ట్రపతి శంకర్ దయాల్ శర్మ వర్ధంతి, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ వర్ధంతి సందర్భంగా పిసిసి అధ్యక్షుడె మహేష్ కుమార్ గౌడ్ తదితరులు నివాళులు అర్పించారు.

## వాయుకాలుష్యమా?

>> దుతూ, ఈ కాలుష్య సంక్షోభానికి పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారాన్ని కొనుగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఢిల్లీని పీడిస్తున్న వాయు కాలుష్య సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ఉపశమనం కలిగించే విధానాల కంటే.. దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు అవసరం. ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతున్న ఈ వాయు కాలుష్య సమస్యకు నిపుణులు పరిష్కారం కనుగొంటారని నాకు నమ్మకం ఉంది" అని సిజె సూర్యకాంత్ పేర్కొన్నారు.

## జనవరి 10 నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:** రాష్ట్రంలో జనవరి 11వ తేదీ నుంచి 15 వరకు ఐదు రోజులపాటు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఉండనున్నాయి. తిరిగి వచ్చే నెల 16వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జనవరి 10న రెండో శనివారం కావడంతో అకడమిక్ క్యాలెండర్‌లో ప్రకటించిన సెలవుల కంటే ఒకరోజు ముందుగానే విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ప్రారంభం కానున్నాయి. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో జనవరి 10 నుంచి 18 వరకు తొమ్మిది రోజులపాటు సంక్రాంతి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే.

## వారం - వర్జ్యం

27-12-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
సప్తమి మ.1.10
పూర్వాభాద్ర ఉ.9.09, మూల కార్తె
వర్జ్యం : సా.4.58-6.43
దు.ఉ.6.35-8.08
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగస్తులు తమ తోటివారితో అప్రమత్తతో మెలగాలి. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

**వృషభం:** పెదవి దాటడం వలన ఇబ్బందులను కొని తెచ్చుకోవడం అవుతుంది. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటాయి.

**మిథునం:** డాక్యుమెంట్లు, భూమి స్థిరాస్తుల సంబంధితమైన రావలసిన సౌకర్యాలు, ధనప్రాప్తి ఇబ్బందులకు గురిచేస్తారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులకు దూరంగా ఉండండి. మౌనం శ్రీరామరక్ష అవుతుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** ఓర్పు, నేర్పులు మేలు చేస్తాయి. యుక్తితో సమస్యల వలయాల నుండి బయట పడతారు. సోదరుల కలయిక.

**కన్య :** సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఇంటా బయట అనుకూలం. వస్త్రలాభం.

**తుల :** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. దీర్ఘ కాలిక ఋణాలు తీరుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇతరుల విషయంలో జోక్యం వద్దు. వాహన సౌలభ్యం కలదు.

**ధనుస్సు:** సమయస్ఫూర్తితో మెలగడం చెప్పదగినది. బంధువుల నుండి మాట సహాయం అందుకుంటారు.

**మకరం :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. ఆహార నియమాలు పాటించండి. ప్రకృతి వైద్యం మేలుచేస్తుంది.

**కుంభం:** చిన్ననాటి మిత్రుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మీనం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. కోర్టుకేసుల నుండి బయట పడతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇక కీలక నేతల విచారణ!

>> న్నట్లు తెలిసింది. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నాటి మంత్రులు కెటిఆర్, హరీష్ రావులను విచారించాలని సిట్ నిర్ణయించి నట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి వీరిద్దరి పేర్లను ఎస్ఐబి నాటి బాస్ ప్రభాకర్‌రావు వెల్లడించినట్లు సమాచారం. హరీష్ రావుకు మావోయిస్టుల నుంచి ప్రమాదం వుండడంతో రక్షణ కోసం ఎలా వుండాలనే దానిపై ఆయనతో చర్చలు జరిపినట్లు ప్రభాకర్ రావు చెప్పారని తెలిసింది. దీంతో పాటు కెటిఆర్ భద్రతకు సంబంధించి కూడా చర్చించినట్లు ఆయన వెల్లడించినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కెటిఆర్, హరీష్‌రా వులను విచారించేందుకు సిట్ నిర్ణయించినట్లు తెలిసింది. వీరిద్దరికి నోటీసులు జారీచేసి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి అప్పట్లో జరిగిన ఘటనల పై వాంగ్మూలం తీసుకోవాలని సిట్ భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో పాటు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ప్రభాకర్ రావుపై తీవ్ర ఆరోపణలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను, అప్పట్లో బిఆర్‌ఎస్‌లో వుండి ఆ తరువాత బిజెపిలో మారి ప్రస్తుతం ఎంపిగా వున్న ఈటెల రాజేందర్‌ను కూడా విచారించాలని సిట్ భావిస్తున్నట్లు తెలిసింది. ఇందులో ప్రభాకర్ రావు అక్రమాలపై అన్ని ఆధారాలు ఇస్తామని బండి సంజయ్ పలుమార్లు చెప్పడం తెలిసిందే. వీరి తరువాత మరికొందరు రాజకీయ ప్రముఖులు, ఫోన్ ట్యాపింగ్ వల్ల ఇబ్బందులకు గురైన సెలబ్రిటీలను విచారించాలని సిట్ భావిస్తున్నట్లు తెలిసింది. ఇందులో అనేక మంది ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సిట్ ఎదుట తమ వాంగ్మూలాలను ఇచ్చారు. వీరిని మరోదఫా విచారించి నాటి ఘటనలపై మరింత సమాచారం తీసుకోవాలని సిట్ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది.

ఇక ఇదంతా ఒక ఎత్తయితే ఎస్ఐబి ఐజిగా పదవీ విరమణ చేసిన తరువాత మొదట ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ బ్యూరో (ఐఎస్‌డబ్ల్యు) ఓఎస్‌డిగాని యమితులై ఆ తరువాత మొత్తం నిఘా విభాగానికి బాస్‌గా నియమితులైన ప్రభాకర్ రావు గురించి బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌ను విచారించాలని సిట్ భావిస్తున్నట్లు తెలిసింది. సాధారణంగా పదవీ విరమణ చేసిన అధికారులను కేడర్ పోస్టుల్లో నియమించరు. ఇదే సమయంలో ఎంతో ముఖ్యమై న నిఘా విభాగం మొత్తానికి బాస్‌గా నియమించడం అనేది అసాధారణ విషయం. ఇదే విషయమై సిట్ అధికారులు ప్రభాకర్ రావును విచారిస్తే ఈ అంశం గురించి తాను ఏమీ చెప్పనని, దీనిపై నాటి సిఎం కెసిఆర్‌నే అడగాలని, కెసిఆర్ తనను ఆ పోస్టులో నియమించినందున దీని గురించి ఆయనే సమాధానం చెబుతారని చెప్పినట్లు తెలిసింది. అప్పట్లో నిఘా విభాగంలో కేడర్ ఐజిగా ఒక అధికారి వున్నా ఆయనను కాదని ప్రభాకర్ రావు ను మొత్తం నిఘా విభాగం బాస్‌గా సర్కారు నియమించడం దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఆ సమయంలో నిఘా విభాగంలో వున్న ఓ ఉన్నతాధికారి మనస్తాపంతో కేంద్ర సర్వీసులకు వెళ్లడం పెద్ద చర్చకు దారితీసింది. ప్రభాకర్ రావు తరహా నియామకం దేశంలో ఇంతవరకు ఏ రాష్ట్రంలో నూ జరగక పోవడంతో దీని వెనుక వున్న మతలబు గురించి ఫోన్ ట్యాపింగ్‌పై విచారణకు ఏర్పాటైన రెండవ సిట్ బృందం ఏకంగా నాటి సిఎం కె సిఆర్‌ను విచారించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ప్రభాకర్ రావును నిఘా విభాగం బాస్‌గా నియమించడానికి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబ ంధం వుందని సిట్ భావిస్తోందని సమాచారం. ఇదే అంశమై కెసిఆర్‌ను విచారించాలని సిట్ భావిస్తున్నట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌పై సుప్రీం కోర్టుకు నివేదిక ఇచ్చే ముందు అన్ని కోణాల్లో విచారించాలని సిట్ భావిస్తున్నట్లు సమాచారం.

# రాజకీయ విశ్లేషకుడు ఆరామస్తాన్‌ను ప్రశ్నించిన సిట్

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రముఖ సెఫాల జిస్టు ఆరా మస్తాన్‌ను సిట్ బృందం శుక్రవారం విచారించింది. ఇదే కేసులో రెండు వారాల పాటు పోలీసు కస్టడీలో వుండి శుక్రవారం ఉదయం ఎస్ఐబి మాజీ బాస్ విడుదలవగా వెను వెంటనే ఆరా మస్తాన్‌ను సిట్ అధికారులు విచారించడం సంచలనం రేపింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయ ంలో ఆరా మస్తాన్ అప్పట్లో పిసిసి అధ్యక్షుడుగా వున్న రేవంత్ రెడ్డితో పాటు బిజెపి నాయకుడు బండి సంజయ్ సహా మరికొందరు రాజకీయ నా యకులతో ఫోన్‌లో అనేకదఫాలు మాట్లాడారు. ఇదే సమయంలో రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డితోనూ మాట్లాడారు. ఇదంతా 2020 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు జరిగింది. ఆ సమయంలో ఆరా మస్తాన్ ఫోన్ గతంలో ట్యాపింగ్‌కు గురైందని ఆరోపణలు రావడం తెలిసిందే. తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరా మస్తాన్ చెప్పడం విదితమే. ఎన్నికల ఫలితాలపై విశ్లేషణలు, సర్వేలు చేసే తన ఫోన్‌ను కొందరు ట్యాప్ చేయడం చట్టవిరుద్ధమని, తాను అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడలేదని ఆరా మస్తాన్ వెల్లడించారు. ఈ క్రమంలోనే ఫోన్ ట్యాపింగ్ ఉదంతం వెలు గు చూశాక ఆరా మస్తాన్ రెండుసార్లు విచారించారు. ఇదే అంశమై శుక్రవారం నాడు మరోసారి విచారించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరా మస్తాన్ కాల్ డేటాను సిట్ అధికారులు పరిశీలించారు. 2020 నుంచి 2023 వరకు ఆయన ఎక్కువగా ఎవరితో మాట్లాడారు? ఇందులో కీలకమైన వ్య క్తులు ఎవరు? అనే అంశమై ఆరా మస్తాన్‌ను సిట్ అధికారులు విచారించి వివరాలు సేకరించారు. గతంలో ఆరా మస్తాన్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఆయనను మరోదఫా విచారించారు. ఆరా మస్తాన్ కాల్ డేటా ఆధారంగా ఆయన ఫోన్‌లో వున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2020 నుంచి ఆరా మస్తాన్ కీలక నేతలు, ప్రజా ప్రతినిధులు, ఇతర రంగాల ప్రముఖులతో మాట్లాడిన ఫోన్ కాల్స్ రికార్డింగ్స్‌ను సిట్ అధికారులు పరిశీలించి వీటి ఆధారంగా ఆరా మస్తాన్‌ను కొన్ని ప్రశ్నలు వేసి వాటికి సమాధానాలు రాబట్టారు. కాగా విచారణ అనంతరం ఆరా మస్తాన్ మీడి యాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్‌పై రెండవ దఫాగా ఏర్పాటైన సిట్ తనను విచారణకు పిలిస్తే వచ్చానని, గతంలో అడిగిన ప్రశ్నలనే మరోసారి అడిగారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌పై గతంలో తాను ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా మళ్లీ తనను విచారించారని, అధికారులు అడిగిన అన్ని ప్ర శ్నలకు తాను స్పష్టమైన సమాధానాలు ఇచ్చానని అతను తెలిపారు. తన ఫోన్ 2020 నుంచి ట్యాపింగ్ జరుగుతుందని అనుమానం వుందని ఆరా మస్తాన్ తెలిపారు. అప్పటి నుంచి తన ఫోన్‌ను కొందరు ట్యాపింగ్ చేసినట్లు, ఇందుకోసం అధునాతన ఉపకరణాలు వాడినట్లు తాను అనుమానిస్తు న్నానని, ఇదే విషయాన్ని సిట్ అధికారులకు తెలిపానని ఆయన చెప్పారు. సిట్ విచారణపై తనకు పూర్తి విశ్వాసం వుందని ఆయన వెల్లడించారు. విచారణకు పూర్తిగా సహకరిస్తానని ఆయన తెలిపారు.

## పోలీసు కస్టడీనుంచి ప్రభాకర్‌రావు విడుదల

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండు వారాల పాటు పోలీసు కస్టడీలో వున్న ఎస్ఐబి మాజీబాస్ ప్రభాకర్‌రావు శుక్రవారం ఉదయం విడుదల అయ్యారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మొదటిసారి ప్రభాకర్ రావును ఫోన్ ట్యాపింగ్‌పై ఏర్పాటైన మొదటి సిట్ విచారించడం తెలిసిందే. అనంతరం ఈ నెల 19వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు రెండవ సిట్ బృందం ఆయనను మరో దఫా విచారించడం విదితమే. ఈ విచారణ గురువారంతో ముగిసింది. మొత్తం మీద 14 రోజుల పాటు ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారించి ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి కీలక విషయాలు వెలికితీశారు. కాగా శుక్రవారం ఉదయం పోలీసు అధికారులు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో పోలీసు కస్టడీలో వున్న ప్రభాకర్ రావును వైద్య పరీక్షలు నిర్వహించి అంతా సవ్యంగా వుందని ని ర్ధారించిన తరువాత విడుదల చేశారు. ప్రభాకర్ రావు పోలీసు కస్టడీ నుంచి విడుదల అయ్యే సమయానికి పోలీసు స్టేషన్ బయట ఆయన కుటుం బీకులు కారులో సిద్ధంగావుండగా వారితోకలిసి తన నివాసానికి వెళ్లిపోయారు.

## సిసి కెమెరాల పర్యవేక్షణలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్26:** తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ ప్రాక్టికల్స్ పై ఈసారి సిసి కెమెరాలు, ఫ్లైయింగ్ స్వాడ్ల బృందాల పర్యవేక్షణలో జరుగనున్నాయి. వచ్చే ఫిబ్రవరి 2 నుంచి 21వ తేదీ వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరంతోపాటు ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు ఇంటర్ సైన్స్ గ్రూపులకు చెందిన దాదాపు 4 లక్షల మంది హాజరవుతారు. రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో ఎక్కువగా థియరీపైనే దృష్టి సారించి, ప్రాక్టికల్స్‌ను విస్మరించారన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కాలేజీల్లో అవసరమైనా సామాగ్రి లేకపోవడం, మరికొన్నింటిలో నేర్పించే సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈ నేపథ్యంలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బంధీగా నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాటు చేస్తోంది. ర్యాంకుల పందేరంలో ప్రాక్టికల్స్ మార్కులే కీలకం. ఇంటర్ ప్రాక్టికల్స్‌లో ఎంపిసి వారికి 60 మార్కులు, బైపిసి వారికి 120 మార్కులు ఉన్నాయి.



## అసెంబ్లీ కార్యదర్శిగా రేండ్ల తిరుపతి బాధ్యతల స్వీకరణ

### స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డితో భేటీ

### మండలి కార్యదర్శిగా కొనసాగనున్న డా.వి.నరసింహాచార్యులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:** రాష్ట్ర శాసనసభ నూతన కార్యదర్శిగా రేండ్ల తిరుపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శాసనసభ కార్యదర్శి ఛాంబర్‌లో ప్రస్తుత లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహాచార్యులు నుండి బాధ్యతలను తిరుపతి స్వీకరించారు. అనంతరం అధికార నివాసంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి, మండలి కార్యదర్శి నరసింహాచార్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాసనసభ నూతన కార్యదర్శి తిరుపతికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలి కార్యదర్శిగా వి.నరసింహాచార్యులు కొనసాగుతారు. అసెంబ్లీ నూతన సెక్రటరీగా పదవీబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని తన ఛాంబర్‌లో శాసనమండలి సెక్రటరీ డా.నరసింహాచార్యులుతో కలిసి రేండ్ల తిరుపతి మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజు గడువు జనవరి 5

### అపరాధ రుసుంతో జనవరి 16 వరకు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) అధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పెంచారు. వచ్చే యేడాది మార్చి, ఏప్రిల్‌లో జరగనున్న పరీక్షలకు సంబంధించిన ఫీజును జనవరి 5 వరకు చెల్లించడానికి అవకాశం కల్పించినట్టు టాస్ డైరక్టర్ పివి శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 25 అపరాధ రుసుంతో జనవరి 6 నుంచి 12 వరకు, రూ. 50 అపరాధ రుసుంతో జనవరి 13 నుంచి 16 వరకు అవకాశం కల్పించారు. ఇక తత్కాల్‌కి జనవరి 17 నుంచి 19 వరకు అవకాశం కల్పించినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. మార్చిన పరీక్ష ఫీజు షెడ్యూల్ విద్యార్థులు ఉపయోగించుకోవాలని టాస్ డైరక్టర్ సూచించారు. టిజి ఆన్‌లైన్, మీ-సేవాల్లో ఆన్‌లైన్‌లో ఫీజును చెల్లించవచ్చని పేర్కొన్నారు.

## ఆదేశాలు అమలుచేయని ఐఏఎస్‌లకు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** తాము ఇచ్చిన ఆదేశాలను అమలు చేయని ఇరువురు ఐఏఎస్‌లను హైకోర్టు తప్పుపట్టింది. ఎందుకు నిర్లక్ష్యం వహించారనేది తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. జనవరి 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు తమ ముందు ధర్మాసనం ముందు హాజరై వివరాలను వెల్లడించాలని ఐఏఎస్ అధికారులు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయితీరాజ్ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తోపాటు, మరో ఇద్దరు అధికారులకు స్పష్టం చేసింది. అయితే ఇదే సమయంలో కోర్టుకు హాజరు కాకుండా మినహాయింపు పొందేందుకు ఎటువంటి కారణాలు చెప్పవద్దని పేర్కొంది. సివిల్ పనులకు సంబంధించి తమకు చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వడం లేదంటూ కంపెనీ హైకోర్టులో పిటీషన్ వేసింది. దానిపై విచారణ చేసిన ధర్మాసనం పిటీషనర్‌కు చెల్లించాల్సిన 1,16,51,734 రూపాయలను ఆరు వారాల్లో విడుదల చేయాలని గత ఏప్రిల్ నెలలో తీర్పునిచ్చింది. మూడు నెలలు అయినా ఈ తీర్పును అమలు చేయకపోవడంతో పిటీషనర్ కోర్టు ధిక్కరణ పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టి, పెండింగ్ బకాయిలను చెల్లించాలన్న తమ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇవ్వాలని పేర్కొంటూ జనవరి 9వ తేదీకి వాయిదా వేసింది.

## యూరియా రవాణా సబ్సిడీకి బ్రేక్

### పిఎసిఎస్, ఆగ్రోస్, డిసిఎమ్మెస్‌లకు చార్జీలు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** యూరియా ఉచిత రవాణా సబ్సిడీని రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఇకపై ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్), ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, జిల్లా మార్కెటింగ్ సొసైటీలకు (డీసీఎంఎస్) ఇప్పటి వరకూ యూరియా ఉచిత రవాణా (ఎఫ్‌వోఎల్) చేయడాన్ని రద్దు చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, 900 ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, 10 జిల్లా మార్కెటింగ్ సొసైటీలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వం రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నది. దీంతో అవి రైతులకు కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధరలకు యూరియాను విక్రయిస్తున్నాయి. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ రవాణా సబ్సిడీని ఎత్తివేస్తే వాటికి సంబంధించి ఆయా సంస్థలు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఫలితంగా రవాణా చార్జీల భారాన్ని సంబంధిత సంస్థలు రైతుల నుండి వసూలు చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి ఇప్పటికే సంప్రదింపులు జరిగాయి. దీంతో ఉచిత రవాణాను రద్దు చేస్తూ త్వరలో ఉత్తర్వులు విడుదల చేసే వీలున్నట్లు సమాచారం.




## సింగిడి కలెక్టివ్ బ్రాండ్‌ను ఆవిష్కరించిన మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:** తెలంగాణ చేనేత వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే దిశగా, పర్యావరణ హితమైన వస్త్రధారణను ప్రోత్సహిస్తూ రూపొందించిన 'సింగిడి కలెక్టివ్' నూతన ఫ్యాషన్ బ్రాండ్‌ను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ నేల స్వభావానికి అద్దం పట్టేలా, పూర్తిగా ప్రకృతి సిద్ధమైన రంగులతో, మన సంప్రదాయ చేనేత నైపుణ్యంతో ఈ బ్రాండ్ రూపుదిద్దుకోవడం విశేషం అని కెటిఆర్ పేర్కొన్నారు. తెలంగాణ గడ్డ ఎప్పుడూ కొత్తదనానికి వేదికగా నిలుస్తుందని, ఇక్కత్ నుండి గొల్లభామ చీరల వరకు మన నేతన్నల నైపుణ్యం అద్భుతం అని వ్యాఖ్యానించారు. ఈ వారసత్వాన్ని నేటి యువత అభిరుచులకు తగ్గట్టుగా మార్చుతూ, పర్యావరణానికి హాని లేని రీతిలో సింగిడి కలెక్టివ్ ముందడుగు వేయడం హర్షణీయం అని పేర్కొన్నారు. వ్యాపారమే కాకుండా, మన నేతన్నలకు అండగా నిలుస్తూ, సామాజిక బాధ్యతతో యువత ఇటువంటి స్టార్టప్‌లను స్థాపించడం గర్వకారణం అని కొనియాడారు.

# దేశవ్యాప్తంగా పెరిగిన చలితీవ్రత

### పొగమంచు కారణంగా పెరిగిన రోడ్డు ప్రమాదాలు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా వుండడం తెలిసిందే. ఈ యేడాది చలి తీవ్రత ఎక్కువ గా వుంటుందని అక్టోబర్ నెలలోనే వాతావరణ శాస్త్రవేత్తలు చెప్పడం తెలిసిందే. ఇది నిజమవుతూ డిసెంబర్ నెలలో దేశంలోని అన్ని ప్రాంతాలు చలి గుప్పిట్లో చిక్కుకున్నాయి. చలి కారణంగా అనేకచోట్ల ఉష్ణోగ్రతలు ఐదు అంతకు తక్కువగా పడిపోయాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. చలి తీవ్రతవల్ల తెల్లవారుజామున అనేకచోట్ల పొగమంచు కమ్ముకోవడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. తెలంగాణ, మహారాష్ట్ర, ఎపి, కర్ణాటక, తమిళనాడులో వారం రోజులుగా పదికి పైగా సంభవించిన రోడ్డు ప్రమాదాలలో 30 మందికి పైగా ప్రయాణీకులు మరణించారు. ఈ ప్రమాదాలన్నీ తెల్లవారుజామునే జరగడం గమనార్హం. పొగమంచు వల్ల రోడ్లపై ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగ్గా కనిపించక పోవడంతో పాటు మలుపుల వద్ద పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం సంగారెడ్డి జిల్లాలో ఒక టూరిస్టు బస్సు తెల్లవారుజామున పొగమంచు కారణంగా మలుపు వద్ద అదుపుతప్పి గుంతలో జారింది. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ప్రయాణీ కులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మహారాష్ట్రలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో నలుగురు తెలంగాణ వారు మరణించారు. కర్నాటకలో జ రిగిన ఇంకో రోడ్డు ప్రమాదంలో నలుగురు చనిపోయారు. ఎపిలోని నంద్యాలలో జరిగిన ఇంకో రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన నలుగురు మరణించారు. కర్నాటక, తమిళనాడు సరిహద్దులో జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది సజీవ దహనం అయ్యారు. ఇదే ఘటనలో మరో పది మంది గాయపడ్డారు. రాష్ట్రంలోని మంచిర్యాలలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో నలుగురు చనిపోయా రు. ఈ తరహా ప్రమాదాలు ఉత్తరాది రాష్ట్రాలలోనూ అనేకం జరిగాయి, చలికాలంలో పొగమంచు కారణంగా తెల్లవారుజామున ప్రమాదాలు జరగడం సహజమే అయినా ఈ ఏడాది ఇటువంటి ఘటనలు ఎక్కువగా జరగడం గమనార్హం. ఇలాంటి ఘటనలకు పొగమంచు ఒక కారణం కాగా డ్రైవ ర్ల అప్రమత్తత లేకపోవడం, పరిమితికి మించి వేగంగా వెళ్లడం వంటి కారణాలు కూడా వున్నాయని రవాణరంగ నిపుణులు చెబుతున్నారు. చలి కాలంలో వాహనాల డ్రైవింగ్ విషయంలో మరింత అప్రమత్తంగా వుండాలని రవాణ రంగ నిపుణులు చెబుతున్నారు. తెల్లవారుజామున పొగమంచు వుండడం రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించవని, వేసవికాలంతో పోలిస్తే ఈ సమస్య ఎక్కువగా వుంటుందని వారంటున్నారు. దీంతో పాటు మలుపుల వద్ద ఏమీ కనిపించని పరిస్థితి వుంటుందని వారంటున్నారు. దీనివల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు లోన వుతాయని రవాణ రంగ నిపుణులు చెబుతున్నారు. చలికాలంలో వాహనాలు కచ్చితంగా పరిమిత వేగంతోనే వెళ్లాలని, డ్రైవర్లు ప్రతి గంట లేదా రెండు గంటలకు ఒకసారి వాహనాలను ఆపి ముఖం కడుక్కోవాలని, వీలైతే టీ తాగి కొంత విశ్రాంతి తీసుకోవాలని వారు చెబుతున్నారు. ఇదే సమ యంలో వాహనాల కండీషన్‌ను నిరంతరం చూడాలని వారంటున్నారు. ప్రయాణీకులతో వెళ్లే బస్సుల డ్రైవర్లు మరింత అప్రమత్తంగా వుండాలని వారు కోరుతున్నారు.

## నేటి నుంచి టెట్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్

### జనవరి 3 నుంచి 20 వరకు పరీక్షలు.. ఫిబ్రవరిలో ఫలితాలు

### పరీక్షలను వాయిదా వేయాలంటున్న ఉపాధ్యాయులు, సంఘాలు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జనవరి 3 నుంచి జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పరీక్షల హాల్ టికెట్లను నేటి(శనివారం డిసెంబర్ 27) నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. టెట్ నోటిఫికేషన్ జారీ చేసిన సమయంలోనే హాల్ టికెట్ల డౌన్‌లోడ్ తేదిలను ప్రకటించిన విషయం తెలిసిందే. టెట్ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 71,670 దరఖాస్తులు వచ్చాయి. టెట్ పరీక్షలను జనవరి 3 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. టెట్ ఫలితాలను ఫిబ్రవరిలో ఇవ్వనున్నట్టు నోటిఫికేషన్ లోనే ప్రకటించారు. టెట్ పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు మధ్యాహ్నం సెషన్ 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన రోజువారీ షెడ్యూల్‌ను ఇప్పటికే అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే.

టెట్ పరీక్షలకు 2,37,754 దరఖా స్తులు వచ్చాయి. టెట్ దరఖాస్తుల్లో ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారి నుంచి 71,670 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న వారు 49,236 మంది టెట్-2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ప్రైవేటు స్కూల్స్ లో ఇప్పటికే విద్యా బోధన చేస్తున్న వారు 22,434 మంది టెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే పాఠాలు బోధిస్తున్న వారి నుంచి పేపర్-1 పరీక్షకి 15,672 మంది, పేపర్-2 పరీక్షకి 33,564 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు పేపర్లకి 11,719 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ప్రైవేటు టీచర్లలో పేపర్-1కి 15,672 మంది దరఖాస్తు చేసుకోగా, పేపర్-2కి 10,717 మంది దరఖాస్తు చేసుకున్నారు. టెట్-2026కి దరఖాస్తు గడువు లోపు పేపర్-1కి 85,538 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 1,52,216 దరఖాస్తులు వచ్చాయి.

టెట్ పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున.. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను దృష్టిలో పెట్టుకొని జనవరి 3 నుంచి జరగనున్న టెట్ పరీక్షలను వాయిదా వేయా లని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. కొన్ని సంఘాలతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విద్యాశాఖ కార్యదర్శికి వినతిపత్రం సైతం సమర్పించారు.

## సిపిఐ వందేళ్ల ఉత్సావాల్లో 18న ఖమ్మంలో భారీ బహిరంగ సభ

### సౌహార్ద సందేశం నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో వందేళ్ల ఉత్సవాల భారీ బహిరంగసభను నిర్వహించనున్నారు. ఈ బహిరంగ సభనుచరిత్రలో కనివిని, ఎరగని రీతిలో జనవరి 18న ఖమ్మంలో భారీ బహిరంగ సభను నిర్వహించి, కమ్యూనిజాన్ని అంతమొందించలేరని నిరూపిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు శుక్రవారం ముగ్ధూమ్ భవన్‌లో మీడియాకు తెలిపారు. కమ్యూనిస్టులు ఎక్కడ అని అనే వారికి కనువిప్పు కలిగే విధంగా ఎర్ర సముద్రాన్ని తలపించేలా లక్షలాది మందితో ఖమ్మం 'బహిరంగ సభ'ను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఖమ్మంలో జరిగే బహిరంగసభలో సౌహార్ద సందేశం నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, జాతీయ వామపక్ష పార్టీల నాయకులను, 40 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. సభకు ఐదు లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. జనవరి 19న జాతీయ వామపక్ష పార్టీల నాయకులతో సదస్సు, ఆ తర్వాత సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని కూనంనేని తెలిపారు. వందేళ్ల ముగింపు ఉత్సవాల సందర్భంగా నిర్వహించే బహిరంగ సభ ద్వారా ప్రజలకు విశ్వాసం కలగాలన్నారు. కమ్యూనిజానికి మరణం లేదని, మనిషి ఉన్నంత వరకు మనిషిలో శ్వాస, ఆకాశం, భూమి, నీరు, నిప్పు,గాలి ఉన్నంత వరకు కమ్యూనిస్టు సిద్ధాంతం ఉంటుందన్నారు. తాము ఎవరికి భయపడేదే లేదన్నారు. అయితే సంకెళ్లు.. లేదంటే కమ్యూనిజ రాజ్యం వస్తుందన్నారు. బహిరంగ సభను జయప్రదం చేసేందుకు జిల్లాల వారిగా జాతాలను నిర్వహిస్తామని, ఆంధప్రదేశ్, తమిళనాడు, కేరళతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, ప్రజలు హాజరుకానున్నట్టు కూనంనేని సాంబశివరావు తెలిపారు.



### రేపు గాంధీ చిత్రపటాలతో గ్రామగ్రామాన

## కాంగ్రెస్ నిరసన కార్యక్రమాలు

### జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించేందుకు కేంద్రం కుట్ర

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:** రాష్ట్రంలో ఈనెల 28న గాంధీ చిత్రపటాలతో అధికార కాంగ్రెస్ గ్రామ గ్రామాన నిరసన కార్యక్రమాలు చేపట్టనుంది.ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి గాంధీ పేరును తొలగించినందుకు 28న నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రకటించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రను గ్రామీణ ప్రజలకు తెలియజేయాలని ఏఐసీసీ పిలుపునిచ్చింది. ఏఐసీసీ పిలుపు మేరకు ఇప్పటికే జిల్లా కేంద్రాలలో మహాత్మా గాంధీ చిత్ర పటాలతో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని టీపీసీసీ అధ్యక్షులు తెలిపారు. ఎన్నో ఉద్యమాల ఫలితంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు.

ఉపాధి హామీ పథకం అమలు బాధ్యతల నుంచి కేంద్రం పక్కకు జరగాలని కుట్ర చేస్తుంది. పేదలకు, గ్రామీణ ప్రాంత కూలీలకు ఎంతో భరోసాగా ఉన్న ఈ పథకాన్ని నీరు గార్చాలని బీజేపీ కుట్ర చేస్తుందని ఆరోపించారు. అందుకు నిరసనగా జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు 28న రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ విగ్రహాల వద్ద, గాంధీ చిత్రపటాలను పట్టుకొని నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి, పనికి ఇచ్చే గౌరవాన్ని ప్రజలకు వివరంగా తెలియజేయాలని పార్టీ శ్రేణులకు,నేతలకు సూచించారు..28న జరగబోయే నిరసన కార్యక్రమాలను పెద్దఎత్తున విజయవంతం అయ్యేలా ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని కోరారు.

## 4 లేబర్ కోడ్స్, జీ రామ్ జీ, విత్తన, విద్యుత్ చట్టాల రద్దు కోసం నిరసన



4 లేబర్ కోడ్స్, విబి జీరామ్‌జీ, విత్తన, విద్యుత్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరసన దృశ్యం

**హైదరాబాద్ (చిక్కడపల్లి), డిసెంబరు 26, ప్రభాతవార్త:** నాలుగు లేబర్ కోడ్స్, జీ రామ్ జీ, విత్తన, విద్యుత్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్ర వారం సిఐటియు, వ్యవసాయ కార్మిక, అఖిల భారత కిసాన్ సభల కమిటీల ఆధ్వర్యంలో సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ ఆఫీసు నుండి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యవసాయ కూలీ, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నగర కార్యదర్శి జే. కుమార్ స్వామి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ ప్రసంగించారు.

కేంద్ర ప్రభుత్వం కార్మికులను, రైతులను, వ్యవసాయ కార్మికులను కట్టు బానిసలుగా మార్చడానికి ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్స్ లను, విబి జీ రాం జీ, విత్తన, విద్యుత్ చట్టాలను తీసుకువచ్చి కార్మికులకు, రైతు లకు, వ్యవసాయ కూలీలు కు కనీస హక్కులు లేకుండా చేస్తున్నదని విమర్శించారు.

ఈ చట్టాల రద్దయ్యే వరకు రైతు ఉద్యమ స్ఫూర్తితో దేశ వ్యాప్త కార్మిక రైతు వ్యవసాయ కూలీ సంయుక్తంగా ఉద్యమించి చట్టాలు తిప్పి కొడతాయని పేర్కొన్నారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ మాట్లాడారు.




## పిఎఫ్ విత్‌డ్రా ఇకపై ఎంతో ఈజీ!

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** ఇపిఎఫ్ఒ ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. పిఎఫ్ 3.0 పేరుతో కొత్తనిబంధనలు అమలుకు తెస్తోంది. ఉద్యోగుల భవిష్యనిధి వ్యవస్థను మరింత డిజిటల్‌గా సులభతరంచేయడమే లక్ష్యం అని కేంద్రం ప్రకటించింది. పిఎఫ్ ఉపసంహారణ ప్రక్రియ మరింత త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంది. ఆన్‌లైన్ సేవలు మరింత మెరుగవడంతో ట్రాన్స్‌ఫర్‌లు, క్లెయిమ్‌లు, బ్యాలెన్స్ వివరాలు తక్షణమే తెలుసుకునే విధంగా వ్యవస్థను అప్‌గ్రేడ్‌చేస్తున్నారు. దీనితో పిఎఫ్ ఖాతాదారులకు మరింత సౌలభ్యం, స్పష్టత లభించనున్నదని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పిఎఫ్ ఖాతాలోని సొమ్మును సులభవంగా విత్‌డ్రాచేసుకునేలా చేస్తోంది. పిఎఫ్‌సొమ్ము ఎటిఎం కార్డులు, యుపిఐద్వారా కూడా తీసుకునే వెసులుబాటు తెస్తోంది. ఈ కొత్త విధానం వచ్చే సంవత్సరం ఏప్రిల్ ఒకటోతేదీనుంచి అమలులోకి రానున్నదని సమాచారం. ఉద్యోగి మానేసిన తర్వాత ఒక నెలపూర్తయితేనే పిఎఫ్ బ్యాలెన్స్‌లో 75శాతం సొమ్ము విత్‌డ్రాచేసుకునే వీలుండేది. మిగిలిన 25శాతం మొత్తాన్ని తీసుకోవాలంటే రెండునెలలవరకూ వేచి ఉండాల్సివచ్చేది. అయితే తాజా మార్పులతోఉ ద్యోగం మానేసిన వెంటనే పిఎఫ్ బ్యాలెన్స్‌లోని 75శాతం మొత్తం తీసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. మిగిన మొత్తం 12నెలల తర్వాత పూర్తిగా విత్‌డ్రాచేసుకునే అవకాశం ఉంది. అలాగే గతంలో విద్య, వివాహం, ఇతర అవసరాలకు పిఎఫ్ సొమ్ము తీసుకోవాలంటే ఆధారపత్రాలు సమర్పించాల్సివచ్చేది. ఇపుడు ఎలాంటి డాక్యుమెంట్లు అవసరంలేకుండా విత్‌డ్రాచేసే సౌకర్యం కల్పిస్తున్నట్లుప్రభుత్వం ప్రకటించింది.

## దేశంలోని 440 జిల్లాల్లో ప్రమాద ఘంటికలు

### భూగర్భ జలాల్లో అధిక మోతాదులో నైట్రేట్

### విచ్చలవిడిగా యూరియా వాడకం

### రాష్ట్రంలోని రంగారెడ్డి, ఆదిలాబాద్, సిద్దిపేట జిల్లాల్లో అధికం

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నైట్రేట్ అత్యధికంగా ఉండి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ప్రధానంగా దేశంలోని 440 జిల్లాల్లోని భూగర్భ జలాల్లో నైట్రేట్ అత్యధికంగా ఉంది. 20 శాతం నమూనాల్లో అనుమతించదగినదాని కన్నా ఎక్కువ నైట్రేట్ ఉన్నదని గుర్తించడం జరిగింది. భూగర్భ జలాల్లో నైట్రేట్ అత్యధికంగా ఉన్న జిల్లాలు దేశవ్యాప్తంగా 15 కాగా, వీటిలో తెలంగాణలోని రంగారెడ్డి, ఆదిలాబాద్, సిద్ధిపేట, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు ఉన్నాయి. ఈ మేరకు విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది.

నైట్రేట్ కాలుష్యం వల్ల పర్యావరణం, ప్రజారోగ్యం దెబ్బతింటాయి. ముఖ్యంగా నైట్రోజన్ ఆధారిత ఎరువులు, పశువుల పెంటలను ఉపయోగించే వ్యవసాయ ప్రాంతాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. 9.04 శాతం నమూనాల్లో ఫ్లోరైడ్ స్థాయిలు సురక్షిత పరిమితి కన్నా అధికంగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందని వెల్లడించింది. అలాగే 3.55 శాతం నమూనాల్లో ఆర్సెనిక్ కాలుష్యం ఉన్నట్లు పేర్కొంది. నైట్రేట్ స్థాయిలు 40 శాతానికిపైగా నమూనాల్లో కనిపించిన రాష్ట్రాలు రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు కాగా, మహారాష్ట్రలో 35.74 శాతం, తెలంగాణలో 27.48 శాతం, ఆంధ్ర ప్రదేశ్‌లో 23.5 శాతం, మధ్య ప్రదేశ్‌లో 22.58 శాతం నమూనాల్లో నైట్రేట్ అధికంగా కనిపించింది. ఉత్తరప్రదేశ్, కేరళ, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో నైట్రేట్ స్థాయి తక్కువగా ఉంది. సురక్షితత పరిమితి పరిధిలో ఉన్న రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, గోవా, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్ ఉన్నాయి. కాగా తెలంగాణలో వ్యవసాయ పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం ఏటా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పైర్లు పచ్చగా, ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో రైతులు అధిక శాతం విష రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో పంట పొలాల్లో భాస్వరం నిల్వలు భారీగా పేరుకుపోయినట్లు అధికారులు గుర్తించారు.

తెలంగాణలో ప్రతీ ఏటా వానాకాలం, యాసంగి వ్యవసాయ సీజన్లలో ఒక్క యూరియానే 20 లక్షల టన్నులకు పైగా వినియోగిస్తున్నారని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారిక పురుగు మందుల వినియోగం అధికంగా ఉంది. కొన్ని జిల్లాల్లో భాస్వరం, నత్రజని, పొటాష్ ఎక్కువగా ఉన్నా మళ్లీ రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఏడేళ్ల కాలంలో తెలంగాణలో ఏకంగా 38 శాతం డై అమ్మోనియం ఫాస్ఫేట్ వినియోగం పెరిగింది. ప్రధాన వాణిజ్య పంట పత్తితో సహా పసుపు, వేరుశెనగ తదితర పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు అధికంగా సాగు చేసే ప్రాంతాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తే అందులో అవసరానికి మించి భాస్వరం ఉన్నట్లు తేలింది. అయినా రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్లలో ప్రతీ ఏటా 5 లక్షల టన్నులకు పైగా డై అమ్మోనియం ఫాస్ఫేట్‌ను పొలాల్లో చల్లుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సాగునీరు, నేల మాత్రమే కాకుండా పర్యావరణంలోకి సైతం కాలుష్యం విడుదలై పలు సమస్యలు ఉత్పత్తన్నమవుతున్నాయని అధికారులు గుర్తించారు.

వార్త

గౌరవం అన్నది పదవులు హోదాలు పొందడంలో లేదు. పదవులు గౌరవాలకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది.

-అరిస్టాటిల్

# రాజకీయ అవినీతే అసలు సమస్య!

**ప్రజలందరి ముందు వికృతరూపం దాల్చి నాట్యం చేసేది మరొక రకపు అవినీతి. అది ప్రజలకే కాదు పాలకులకు కూడా స్పష్టంగా తెలుసు. ప్రభుత్వం అప్రతిష్టపాలయ్యేది కూడా ఈ అవినీతితోనే. తెలుగు రాష్ట్రాల్లో ఈ అవినీతి అదుపు తప్పిపోతున్నది. చీకటిలో మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని అరికట్టలేకపోతే పోయారు కనీసం ప్రజలను వేధిస్తూ కళ్లముందు బాహాటంగా జరుగుతున్న అవినీతిని నియంత్రించకపోతే అప్రతిష్టపాలుకాక తప్పదు. రాజకీయ అవినీతిని అదుపుచేయకుండా ఎన్ని లక్షల కోట్లు అప్పు చేసినా పన్నుల రూపేణా ప్రజల ముక్కుపిండి ఎన్నివేల కోట్లు వసూల్ చేసి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు.**

దామెర్ల సాయిబాబ

'పరసరంబు పంజైన పసులకాపరీ తప్పు, ప్రజలు దుర్జనులైన ప్రభువుల తప్పు, భార్య గయ్యాలి అయిన ప్రాణనాధుని తప్పు, తనయుడు దుష్టుడైన తండ్రితప్పు, కూతురు చెడిన మాత తప్పు, సైన్యంబు చెదిరిన సైన్యనాధుని తప్పు..అంటూ ఎవరు తప్పుచేస్తే ఎవరు బాధ్యులో ఏనాడో ధర్మపురి లక్ష్మినరసింహస్వామి శతకంలో శేషప్ప కవి చెప్పారు. దేశంలో అవినీతి, అక్రమాలు, ఆశ్రిత పక్షపాతాలు పెరిగిపోతున్నాయని, అందరూ ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉంటారు. ఈ వ్యవస్థ ఇలా దిగజారిపోవడానికి ఎవరు బాధ్యులో తెలియనివారు లేరు. ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు తర, తమ బేధాలు లేకుండా ఎవరు అధికారంలో ఉన్నా తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు మానవతా విలువలు మంటగల్పుతున్నారు. దేశంలోని అవినీతి అంతకంతకు పెరిగిపోతున్నది. పాలకులు అభివృద్ధి పేరుతో ఎన్నిలక్షల కోట్లు అప్పు తెస్తున్నారో అదేస్థాయిలో అవినీతి విజృంభిస్తున్నది. ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఒకటేమిటి ఎక్కడ అప్పు దొరుకుతుందో దుర్భిణి పెట్టి వెతికి అక్కడికి వెళ్లి రకరకాల విన్యాసాలు చేసి వారిని ఒప్పించి, మెప్పించి అప్పులు తెచ్చుకుంటున్నారు. అప్పులు తేవడమే గొప్పగా చెప్పుకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. నిర్మాణాత్మకమైన అభివృద్ధికి అప్పులు అవసరమే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. అవి ఎలాతీర్చాలో నిర్దిష్టమైన ప్రణాళిక, పథకాలుండాలి. వేలాది రూపాయలు ఏటా వడ్డీరూపేణా ఇప్పటికే చెల్లిస్తున్నారు. ఇటు పన్నులు రూపేణా ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్న డబ్బు, అటు అప్పులు తెస్తున్న వేలాదికోట్ల రూపాయలు అవినీతి, అక్రమార్కుల పాలు కాకుండా చూడాల్సిన గురుతర బాధ్యత పాలకులపై ఉంది. అప్పులు పెరిగి అందుకు తగ్గట్టుగా ఆదాయం రాకపోతే పరిస్థితి ఎలాఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పొరుగునున్న శ్రీలంకను చూశాం. ఇప్పటికీ ఆ దేశం కోలుకోలేకపోతున్నది. అభివృద్ధి, అవినీతి రెండూ కలిసి పయనించలేవు. అభివృద్ధి ముందుకు నడుస్తుంటే అవినీతితూట్లు పొడుస్తూ వెనక్కి గుంజుతుంటుంది. దిగజారిపోతున్న మానవతా విలువలు అవినీతిని పెంచిపోషిస్తున్నాయి. అంతోఇంతో నిజాయితీతో జీవనం సాగిస్తున్న అధికారులను అసమర్థులుగా పరిగణించే పరిస్థితులు దాపురించాయి. ఎలుకలనుచూసి పిల్లి తప్పుకున్నట్లుగా అవినీతిపరుల ముందు నీతివంతులు తలవంచుకునే నికృష్టపు రోజులు వచ్చాయి. మరోకపక్క రాష్ట్రాల పరిధుల్లో ఎసిబి కానీ, కేంద్రస్థాయిలో సిబిఐ విజిలెన్స్ కొత్తగా ఏర్పడ్డ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తదితర విభాగాలు రాజకీయ ఒత్తిడిల నుంచి బయటపడలేకపోతున్నాయి. అన్నింటికంటే మించి రాజకీయ అవినీతి శృతిమించిపోతున్నది. ఆవు చేలో మేస్తే దూడగట్టుపై మేస్తుందన్నట్లు కొందరు రాజకీయ నాయకుల అవినీతి అధికారులకు మార్గాన్ని చూపెడుతున్నది. అధికారుల్లో ఉన్న అవినీతి ఒక ఎత్తైతే కీలకపదవులు నిర్వహిస్తున్న కొందరు పెద్దలు ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న మరికొందరు రాజకీయ నాయకులు, దళారుల వల్లనే పరిస్థితి అదుపు తప్పుతున్నదేమోననిపిస్తున్నది. వారి రాజకీయ అధికారం ధాటికి నిజాయితీ, సమర్థులైన అధికారులు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అవినీతి మూలంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు భారత్ ఎన్ని లక్షలకోట్ల రూపాయలు కోల్పోయిందో అంచనాలకే అందదు. అవినీతినిఅంతం చేయాల్సిన కీలక పదవుల్లో ఉన్నకొందరు రాజకీయ నాయకులే చట్టానికి చుట్టాలై చక్రం తిప్పుతున్న సంఘటనలు గతంలో ఎన్నో బయటపడ్డాయి. పశ్చిమబెంగాల్‌లో మాజీ మంత్రి ఒకరు ఉపాధ్యాయ నియామక కుంభకోణంలో కోట్లాది రూపాయలు దిగమింగి తన ఆప్తమిత్రురాలు ఇంట్లో


## ఒక్క మాట

గుట్టుచప్పుడు కాకుండా దాచిన వైనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రట్టుచేసింది. ఆ మధ్య కర్ణాటకలో బాధ్యత కలిగిన మంత్రే తన చావుకు కారణమని తనను ఏ రకంగా డబ్బు కొరకు వేధించారో వివరిస్తూ ఒక యువ గుత్తేదారు ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో విధిలేని పరిస్థితుల్లో ఆ మంత్రి రాజీనామా చేయాల్సివచ్చింది. ఇక సబ్బుల తయారీకి అవసరమైన ముడిసరుకుల టెండర్ ఆమోదముద్ర పొందడానికి లంచం ముట్టచెప్పాల్సిందేనని గుత్తేదారుకు ఆ ప్రాంత శాసనసభ్యుడు తన కుమారుడికి అప్పగించడంతో ఏకంగా నలభైలక్షల రూపాయలు తీసుకుంటూ లోకాయుక్త పోలీసుల ఉచ్చులో చిక్కుకున్నాడు. ఇక సాక్షాత్తు హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల నోట్ల కట్టలు బయటపడ్డాయి. రాజ్యాంగం కల్పించిన రక్షణ వల్ల ఆయనపై ఎఫ్‌ఐఆర్ కూడా వెంటనే నమోదు చేయలేని నిస్సహాయక పరిస్థితి. దీంతో ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎందుకోసం ఎవరు ఇచ్చారు? తదితర ప్రశ్నలకు జవాబు లేకుండా పోయింది. ఇటీవల ఒడిశాలో సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న ఐఎఎస్ అధికారి పదిలక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆయన ఇంట్లో సోదా చేసి నలభై లక్షలకుపైగా నగదును అధికారులు కనుగొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది ఉన్నతాధికారులపై గతంలోనూ, ఇప్పుడు కూడా అవినీతి ఆరోపణలు తరచుగా వినిపిస్తూనే ఉన్నాయి. ఎసిబి దర్యాప్తు చేసి చర్యలకు సిద్ధమైనా ప్రభుత్వం అనుమతించక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. ఇప్పుడే కాదు గతం నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉన్నది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషన్ రాంచంద్రన్ సమాల్‌పై ఏకంగా విలేకరుల సమావేశం పెట్టి వెల్లడించిన విషయాలు అందుకు అద్దం పడుతున్నాయి. అప్పుడే కాదు నేటికీ కొందరు సీనియర్ రాజకీయ నాయకులు, మరికొందరు ఉన్నతాధికారులు అవినీతిలో మునిగి తేలుతున్నారు. కాంట్రాక్టుల కోసం ఏకంగా మంత్రులే బహిరంగంగా పోటీపడుతూ విమర్శనాస్త్రాలను కురిపించుకుంటే ఏమనుకోవాలి? ఎవరికి చెప్పుకోవాలి? ఇక కిందిస్థాయిలో పరిస్థితి అదుపుతప్పిపోతున్నదేమోననిపిస్తున్నది. తాజాగా ఈవారంలో మహబూబ్‌నగర్‌లో రోడ్డు రవాణాకు సంబంధించిన అధికారిపై ఎసిబి అధికారులు చేసిన దాడుల్లో బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రెండువందల కోట్లకు పైగా ఆదాయానికి మించిన ఆస్తులు కనుగొన్నట్లు ప్రకటించారు. ఇక రెవెన్యూ, ఎక్సైజ్, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల్లో అవినీతి తారస్థాయికి చేరినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎసిబికి పట్టుబడుతున్న కేసులు కూడా ఇందుకు అద్దంపడుతున్నాయి. తెలంగాణలో ఇద్దరు ముగ్గురు మంత్రులు కోట్లాది రూపాయలు అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని సాక్ష్యాత్తు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మొన్న గురువారం రోజు బహిరంగంగానే ఆరోపించారు. అంతేకాదు కేంద్ర నిఘా విభాగాల దృష్టిలోఉన్నాయని, వాళ్ల జైలుకు వెళ్లడం తప్పదన్నట్లుగా వ్యాఖ్యానించారు. వాస్తవంగా చూసినా ఈ యేడాది ఎసిబి అధికారులు తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రెండువందల ఇరవై కేసులకుపైగానూటయాభై మందిని అధికారులను అరెస్టు చేశారు. ఇవన్నీ ప్రత్యక్షంగా డబ్బు తీసుకుంటూ పట్టుబడిన కేసులే. ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకే చిక్కిన కేసులుగానే చెప్పొచ్చు. అవినీతిలో మరోరకం మూడో మనిషి కంటికి కనపడదు. ఇచ్చిపుచ్చుకునే చేతులు రెండూఅదృశ్యంగానే ఉంటాయి. మూడో నేత్రానికి దృశ్యగోచరమయ్యే అవకాశం ఉండదు. సమయం, సందర్భాన్ని బట్టి వదంతులు, ఆరోపణలు, నిజానిజాలు, వ్యక్తిగత గుణగణాలు, గత, ప్రస్తుత పరిస్థితులను బట్టి వనరులు, తాహతును అంచనా వేసుకొని ఎవరికివారే ఊహాజనితమైన నిర్ణయానికి రావాల్సిందే తప్ప ప్రత్యక్ష సాక్షులతో రుజువు చేయడం అసాధ్యం. ఇది పైస్థాయిలో అయితే మరింత కష్టం. ముడుపులు ఇచ్చినవారు ఇచ్చినట్లు కానీ, తీసుకున్నవారు తీసుకున్నట్లు కానీ ఏ పరిస్థితుల్లోనూ బయటకు చెప్పరు. ఎవరైనా ఆరోపణలు చేసినా ఇద్దరు కలిసి ఖండించడమే కాదు తమ పరువుకు భంగం కలిగించారంటూ న్యాయస్థానం మెట్లెక్కడానికి కూడా వెనుకాడరు. ఇక ప్రజలందరి ముందు వికృతరూపం దాల్చి నాట్యం చేసేది మరొకరకపు అవినీతి. అది ప్రజలకే కాదు పాలకులకు కూడా స్పష్టంగా తెలుసు. ప్రభుత్వం అప్రతిష్టపాలయ్యేది కూడా ఈ అవినీతితోనే. తెలుగు రాష్ట్రాల్లో ఈ అవినీతి అదుపు తప్పిపోతున్నది. చీకటిలో మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని అరికట్టలేకపోతే పోయారు కనీసం ప్రజలను వేధిస్తూ కళ్లముందు బాహాటంగా జరుగుతున్న అవినీతిని నియంత్రించకపోతే అప్రతిష్టపాలుకాక తప్పదు. అవినీతిని అదుపుచేయకుండా ఎన్ని లక్షల కోట్లు అప్పు చేసినా పన్నుల రూపేణా ప్రజల ముక్కుపిండి ఎన్ని కోట్లు వసూలు చేసి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు. ●

# స్వచ్ఛమైన గాలికి పన్నుల అవరోధమా!


రాజధాని అయినా, ఓ కుగ్రామమైనా, ఊరంతా పొగమంచు లేదా కాలుష్యం ఒకే తెరగా కమ్మేస్తోంటే ఎన్నాళ్లు ఊరుకుంటాం? దానికి పరిష్కారమేమిటో అంతుచిక్కకపోతే ఏంచేయాలి? ఇవన్నీ న్యాయస్థానాలను, పాలకుల్ని వేధిస్తున్న ప్రశ్నలు. ఢిల్లీలో కాలుష్య స్థాయి ఆందోళనకరంగా ఉందని అందరూ చెప్తున్న మాటే! శాస్త్రజ్ఞులు, కాలుష్య మండలి అధికారులు సైతం ఒకే మాట. ఢిల్లీలో కాలుష్యం పెచ్చుపెరిగిపోతే ఊరు మొత్తం ఇంట్లో కూర్చోవాల్సిందే. ఢిల్లీ కాలుష్యస్థాయిని గుర్తించడంలో ఎవరి అంచనా వారిది. ఒకేసారి 20 సిగరెట్లు కాలిస్తే మానవ దేహం ఎంత ఇన్‌ఫెక్షన్‌కు గురౌతుందో అంతేస్థాయిలో ఉందని ఒక అంచనా గతంనుంచే వస్తోంది. ఢిల్లీలో రెండు రోజులుంటే తనకు ఇన్‌ఫెక్షన్ సోకడం ఖాయమని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అంటున్నారు. ఎవరెంత బాగా బాధపడితే వారంతగా తన బాధను వ్యక్తం చేయగలుగుతారన్నది నిజం. అందుకే ఆయన ఫీలింగ్‌ను ఆయన చెప్పారు. ఒక పుస్తకావిష్కరణ సభలో ఆయన పలు విషయాలపై తన సొంత అభిప్రాయాలను నిర్ద్వంద్వంగా ప్రకటించారు. తన రవాణా శాఖవల్లే 40శాతం కాలుష్యం ఏర్పడ్తోందని అన్నారు. యేటా 22 లక్షల కోట్ల ఖర్చుతో శిలాజ ఇంధనాలు దిగుమతి చేసుకుంటున్న దేశం మనదని అయినా ఎక్కడో లోపం ఉందేమోనన్న సందేహం వ్యక్తం చేశారు. ఇదోరకమైన జాతీయ వాదమా! అని ప్రశ్నించారు. అంత భారీస్థాయిలో డబ్బు ఖర్చుపెట్టి దేశాన్ని కలుషితం చేస్తున్నాము. ప్రత్యామ్నాయ ఇంధనాలు, జీవ ఇంధనాలలో మనం స్వయం సమృద్ధిని సాధించలేమా? అన్నది ఆయనకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉదయించింది. శ్వాస పీల్చుకోలేక ఎగశ్వాసను దింపుకోలేక శ్వాసనాళాలు గడబిడ చేస్తున్నాయని తెలిసినా ఢిల్లీ ప్రజలపై 'ఎయిర్‌ప్యూరిఫైయర్లపై 18శాతం పన్ను వేసిన జిఎస్‌టి కౌన్సిల్ ఔదార్యాన్ని ఢిల్లీ హైకోర్టు ప్రస్తావించి అక్షింతలు వేసింది. ఢిల్లీలో గాలి నాణ్యత అత్యంత ప్రమాదకరస్థాయికి పడిపోయి జనం స్వచ్ఛమైన గాలికోసం ఎదురుచూస్తున్నఢిల్లీ ప్రజలకు ఈ విధమైన పన్ను శరాఘాతంలా మారింది. అంటే మూలిగే నక్కపై తాటిపండు పడిన చందాన ఇబ్బంది జరిగింది. ఎయిర్ ప్యూరిఫైయర్‌లు జీవరక్షక సాధనాలే తప్ప విలాస వస్తువులుగా ఎంతమాత్రం భావించలేం. అలాంటి పరిస్థితుల్లో వాటిపై 18 శాతం జిఎస్‌టి ఆక్షేపణీయం. ఈ మాటలన్నది ఎవరో కాదు సాక్షాత్తూ న్యాయమూర్తులే. ఒకపక్క జిఎస్‌టి భారతీయుడికి ప్రాణవాయువు అని కేంద్ర ప్రభుత్వం ఊదరకొడుతూ విస్తృత స్థాయిలో ప్రచారం చేసుకుంటూ మరోపక్క వినియోగదారుల జేబుకు చిల్లుపెట్టే స్థాయికి ఆవిభాగం చేరిందంటే నమ్మలేం. కానీ అది నిజం. వైద్యపరికరాలు ప్రాణాన్ని నిలబెడతాయి కనుక వాటి మీద ఐదు శాతం జిఎస్‌టి పన్నునే వసూలు చేస్తున్నారు. వైద్య పరికరాల జాబితాలో ఉండాల్సిన వస్తువుకు బయట ఎసిల మాదిరి విలాస వినియోగ వస్తువుగా ఎందుకు గుర్తించడం లేదని ధర్మాసనం నిలదీసింది. బుధవారం తమ ముందుకొచ్చిన వాదనలో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావుతో కూడిన ధర్మాసనం జిఎస్‌టి కౌన్సిల్ ఆలోచనను దుయ్యబట్టింది. ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. ప్రజలకు స్వచ్ఛమైన గాలినందించాల్సిన అధికారులు విఫలమయ్యారు. ప్రతి మానవుడు రోజుకి 21వేల సార్లు శ్వాసిస్తాడు. విషతుల్యమైన ఢిల్లీ కాలుష్యాన్ని పీల్చడంవలన ఊపిరితిత్తులు ఏమేరకు పాడవుతాయో అంచనా వేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితిని గుర్తించైనా ఎయిర్ ప్యూరిఫైయర్‌లకు 'పన్ను' మినహాయింపు నివ్వచ్చునని ధర్మాసనం శాసించింది. ఇప్పటికిప్పుడు జిఎస్‌టి కౌన్సిల్‌సమావేశం జరపడం సాధ్యంకాదని హైకోర్టు ధర్మాసనానికిప్రభుత్వ ప్రతినిధులు కోర్టుకు నివేదించారు. భౌతికంగా సమావేశమై నిర్ణయాలు తీసుకోలేని సందర్భాలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై నిర్ణయం తీసుకోవచ్చునని హుకుం జారీచేసింది. ఢిల్లీ కాలుష్య స్థాయిల తీవ్రత రీత్యా ఎయిర్ ప్యూరిఫైయర్‌లను 'మెడికల్ డివైస్'గా నిర్ణయించి జిఎస్‌టి 18 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించాలని లేదా పన్ను మినహాయించాలని కోరుతూ సుప్రీంకోర్టు న్యాయవాది కపిల్ మదన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం కూలంకషంగా విచారించింది. ఈ పిటిషన్ ఆద్యంతమూ ఢిల్లీ కాలుష్యం, దాని వలన సమస్యలు, పర్యావసనాలు తదితర అంశాలపై వాదనలు జరిగాయి. ఎప్పటిలాగే ప్రభుత్వం తరపున కొంత సమయం కావాలని కోరినప్పుడు ధర్మాసనంలోని న్యాయమూర్తి ఒకరు సమయం అంటే ఎంతకాలం వేలాది మంది మరణించినప్పుడా? అని నిర్ద్వంద్వంగా ప్రశ్నించారు. ప్రతి పౌరునికి పరిశుభ్రమైన గాలి కావాలి. దానిని ఇవ్వలేని పరిస్థితి ఉంది. అలాంటప్పుడు ప్రజలకు ఎయిర్ ప్యూరిఫైయర్‌లు అందుబాటులో ఉంచడం అత్యంత ఆవశ్యకమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఢిల్లీ కాలుష్యంపై ఆందోళన చెందని వారుండరు. పలుసందర్భాల్లో సుప్రీంకోర్టు కూడా అన్నిటికీ అతీతమై దీర్ఘకాలిక పరిష్కారం కావాలని సూచించింది. శుక్రవారం ఉదయం హానికరమైన పొగమంచు ఢిల్లీలోని దాదాపు అన్ని ప్రాంతాలను కమ్మేసింది. దృశ్యనాణ్యత బాగాపడిపోయింది. ఢిల్లీలో ఎన్‌సిఆర్ పరిధిలో గాలి నాణ్యత సూచీని అంచనా వేయగా గురువారం ఏక్యూఐ 220గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. వీటన్నిటిని అధిగమించాలంటే సమస్య వచ్చినప్పుడు ఆందోళన చెందడం కన్నా పటిష్ట ప్రణాళికలు, నిర్ణయాలతో సమస్య నుంచి గట్టెక్కడం అవసరం.

అదృష్టం కోసం కాచుకు కూర్చునే వ్యక్తి రాత్రిభోజనం తనకు ఎక్కడ దొరుకుతుందనేది ఖచ్చితంగా చెప్పలేడు.




ఫ్రాంక్లిన్

ధైర్యం, పట్టుదల, ఆత్మ విశ్వాసం ఈ మూడింటితోనే చాలా మంది సామాన్యులు నాయకులైనారు.



మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



### విద్యుత్ వాహనాలే సరైన పరిష్కారం

పర్యావరణపరిరక్షణ, ఇంధనభద్రత అనేసవాళ్లకు విద్యుత్ వాహనాలే సరైన పరిష్కారం. పెరుగుతున్న చమురు ధరలు, కాలుష్య కోరలనుండి దేశాన్నిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం ఈడ్రైవ్ వంటి పథకాల ద్వారా భారీ ప్రోత్సాహకాలు అందిస్తోంది. దాదాపురూ.10,900 కోట్ల వ్యయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కొనుగోలుపై గణనీయమైన రాయితీలు లభిస్తున్నాయి. గణాంకాలప్రకారం, 2025 నాటికి దేశంలో ఈవీల సంఖ్య 65 లక్షలకు చేరడం, ఏడాదిలోనే 34 శాతం వృద్ధి నమోదు కావడం శుభపరిణామం. కర్ణాటక 'ఈవీ రాజధాని'గా ఎదుగుతుండగా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న 30 వేల ఛార్జింగ్ కేంద్రాలను భవిష్యత్తు అవసరాల కోసం 15 లక్షలకు పెంచాల్సి ఉంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### విరమించిన కార్యాచరణ

ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం తాను ఖనిజాలకోసం దాదాపు 800 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల మధ్య భూగర్భ ఖనిజాలను వెలికి తీయడానికి ప్రాథమికంగా సమ్మతించినా, అపోజిషన్ నాయకులు ఇతర మేధావులు ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఆరావళి శిఖర శ్రేణుల విధ్వంసం వలన కలిగే ప్రకృతి విలయాలను విశదీకరించడం వలన కాబోలు కేంద్ర ప్రభుత్వం తన కార్యాచరణను విరమించుకుని మంచిపని చేసింది.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### గురువుల పిల్లలకు సీట్లు ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీబీసీ మైనారిటీ గురుకులాలలోని గురువుల యొక్క పిల్లలకు 2026-2027 విద్యా సంవత్సరం నుండి గురుకుల గురువుల పిల్లలకు కూడాగురుకులాలలో ఉచితసీట్లు కేటాయించాలి. బాలుర గురుకులాలలో ఒక సీటు. బాలికల గురుకులాలలో ఒక సీటు గతంలో ఉన్న ప్రత్యేక జీవోను వచ్చే విద్యా సంవత్సరం నుండి తప్పనిసరిగా అమలు చేయాలి. రాష్ట్రంలో ఉన్న 2 సైనిక్ స్కూల్‌లలో కూడా ఈ విధానం అమలు చేయాలి. గురుకులాలలోని గురువుల పిల్లలకు తప్పనిసరిగా ఉచిత సీట్లు ఇచ్చి దేశంలోనే ఆదర్శంగా నిలవాలి.

- రాపాక రవీందర్, జనగాం

### పంచాయతీలకు నూతన సంవత్సర కానుక

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి దిశానిర్దేశం చేసే కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రముఖ్యమంత్రి గ్రామపంచాయతీలకు ప్రత్యేకఆర్థిక సహాయం ప్రకటించడం గ్రామీణస్వయంపాలన వ్యవస్థకు ఊతమిచ్చే చర్యగా భావించవచ్చు. చిన్న గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షలు, ప్రధాన గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించడం ద్వారా ప్రభుత్వం గ్రామాల అవసరాలనుగుర్తించినట్లుస్పష్టమవుతోంది. గ్రామ పంచాయతీలు గ్రామస్థాయిలో పరిపాలనకు పునాది వంటివి. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, అంతర్గత రహదారులు, పచ్చదనం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పంచాయతీల పాత్ర ఎంతో కీలకం. కానీచాలాసార్లు నిధుల కొరత కారణంగా చిన్నచిన్న అభివృద్ధి పనులు కూడా ఆలస్యమవుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయడం గ్రామీణ సమస్యలకు తక్షణ పరిష్కారాలను అందించే అవకాశాన్ని కల్పిస్తుంది.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### అవగాహన అవసరం

ఈమధ్య కాలంలోవివిధ రకాల ప్రకృతి, పారిశుధ్యం లోపాలు, వ్యక్తుల అజాగ్రత్త మూలాన కొత్తవ్యాధులు బయటపడుతున్నాయి. అదే కోవకు చెందిన స్క్రబ్ టైఫ్స్ వల్ల కూడా రాష్ట్రంలో ప్రస్తుతం మరణాలు పెరిగినవి. బాధితులు తక్కువైన , వీటి లక్షణాలు తెలియక మరికొందరికి ఎక్కువ కావొచ్చు. సరైన మందుఅందక ఆలస్యంవల్ల మరణం సంభవించవచ్చు. ముందు జాగ్రత్తగా అన్ని ప్రధాన ఆసుపత్రుల్లో ఈ వార్తను ప్రజలకు నోటీసు బోర్డు ద్వారా తెలియజేస్తే చికిత్స మార్గం ద్వారా వ్యాప్తి, ప్రాణనష్టం నివారణ సాధ్యం కాగలదు.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### ఉచిత ప్రయాణం పేద విద్యార్థి హక్కు

ప్రభుత్వం మహిళల పేరిట ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు పరిచింది. వెంటనే ఈ ఉచిత ప్రయాణ వసతిని తొలగించాలి. ఉచితబస్సు ప్రయాణం పేదవిద్యార్థులకు చెందవలసిన హక్కు మాత్రమేకానీ రాజకీయ వ్యూహాలతో అనవసర పథకాలు పెట్టాల్సినపనిలేదు. పథకాలుపేదవాడికి భరోసానివ్వాలికానీ భారాన్ని మిగల్చొద్దు. కాబట్టి ఈ పథకాన్ని రద్దుపరిచి దీని స్థానంలో పేద విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి.

-కె. నిఖిత, నల్గొండ జిల్లా

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నేతన్న 'భరోసా'తో ఉజ్జ్వల భవిష్యత్

చిలగాని జనార్ధన్

శిక్షణ, ఉత్పత్తి, మార్కెటింగ్, తద్వారా వచ్చేలాభాలు.. పరిశ్రమ ఏదైనా ఈ మూల సూత్రాలపైనే భవితవ్యం ఆధారపడి ఉంటుంది. మారుతోన్న కాలానుగుణంగా డిమాండ్ ఉన్న వస్తువుల ఉత్పత్తితో పాటు మార్కెటింగ్ చేసి లాభాల బాటలో సాగకుంటే ఎప్పుడోకప్పుడు పతనం తప్పదు. గత బీఆర్ఎస్ పాలనతో తీసుకున్న కొన్ని నిర్ణయాలు చేనేత రంగ భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చేసింది. శరవేగంగా మారుతోన్న కాలానుగుణంగా వస్త్ర పరిశ్రమల్లో మార్పులను అంచనా వేయలేక, కేవలం ప్రభుత్వంపైనే ఆధారపడడం వల్ల నేడు చేనేత రంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ సవాల్‌ను స్వీకరించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ఆలోచనలతో ప్రణాళిక సిద్ధం చేస్తుంది. రాష్ట్రంలోని వస్త్ర పరిశ్రమను గట్టెక్కించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. చేనేత కార్మికులకు శిక్షణ, పెట్టుబడికి వడ్డీలేని రుణాలు, డిమాండ్ ఉన్న వస్త్రాలు కార్మికులు తయారు చేయడం లేదనే విమర్శలున్నాయి. చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలని ఉన్నా అందుబాటులో లేకపోవడంతో మార్కెట్‌లో కొనుగోలు చేసి ధరిస్తున్నారు ఉద్యోగులు. గతంలోనూ శిక్షణ కేంద్రం ద్వారా మార్కెట్‌కు అనుగుణంగా చేనేత ఉత్పత్తులు జరిగేవి. మార్కెటింగ్ ద్వారా లాభాలు కూడా వచ్చేవి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్లలో 1990లో చేనేత శిక్షణ కేంద్రాన్ని అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది.




2006 తరువాత దీన్ని కరీంనగర్‌కు మార్చారు. రాజకీయ, నాటకీయ పరిణామంలో భాగంగా 2014 డిసెంబరు చివరన తిరిగి సిరిసిల్లకు కేంద్రాన్ని తరలించి మూసి వేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో హైదరాబాద్ వీవర్ సర్వీసింగ్ సెంటర్‌కూడాఉంది. ఇది కూడా నామమాత్రం. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం ఇందుకు అద్దం పడుతుంది. అత్యాధునిక పద్ధతిలో డిమాండ్ ఉన్న వస్త్రాలు కార్మికులకు శిక్షణ ఇచ్చి ఆయా రకాల ఉత్పత్తులతో లాభాలు ఆర్జించే అవకాశాలున్నా, ఆ దిశగా చర్యలేవీ చేపట్టడం లేదు. దీంతో మార్కెట్ పోటీకి అనుగుణంగా వస్త్రోత్పత్తులు జరగని పరిస్థితులు ఏర్పడ్డాయి. పదేళ్లక్రితంవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా క్లస్టర్లుగా ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టేవి. గత పదేళ్లుగా ఈ ఊసే లేదు. దీనికితోడు టెస్కోను విస్తరించి బ్రాండ్ ఇమేజ్‌ను పెంచే విధంగా కృషి కూడా జరగలేదు. తెలంగాణలోని పేరెన్నిక గల వస్త్రాలు మంచి డిమాండ్ ఉండేది. కరీంనగర్ జిల్లాకు చెందిన కొత్తపల్లి దోవతులు, చీరలు పోచంపల్లి చీరలు, కాటన్ షర్టింగ్..ఇలా పలు వస్త్రాలు ఎంతధరైనా చెల్లించి కొనుగోలు చేసేవారు. ప్రభుత్వాలు ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన ఉండేది. గతంలో ఆప్కో ట్రేడ్‌మార్క్‌తో వస్త్రాలు విరివిగా అమ్ముడుపోయేవి. దురదృష్టవ శాత్తు గత పదేళ్ల కాలంలో టెస్కో పూర్తిస్థాయిలో నిర్వీర్యమైంది. ప్రస్తుతం టెస్కోగుర్తింపు, నాణ్యత, నమ్మకాన్ని మార్కెట్‌లో పెంచాల్సిన అసరం ఎంతైనాఉంది. ఆ దిశగా కృషి జరగాలి. చేనేత సంఘాల్లో ఉత్పత్తి అయ్యే వస్త్రాల నాణ్యతను గుర్తించేలా టెస్టింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలి. ఇందులోని నిపుణులు సర్టిఫైడ్ చేసి నాణ్యతను గుర్తించి మార్కెట్‌లో విక్రయాలు చేయించాలి. ●

# విద్య ఇక్కడ..ఉద్యోగాలు విదేశాల్లోనా!

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారతదేశంలో ఉత్తమమైన విద్యాభ్యాసంలో పరిపూర్ణత సాధించిన కొందరు విద్యావంతులు దేశంలో సామాజిక ఆర్థికశాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రతిభను చాటుతున్న అప్పటికి, కొన్ని దశాబ్దాలుగా దేశంలోని ప్రముఖ సాంకేతిక కళాశాలలో అభ్యసించిన విద్యార్థులు మరికొందరు ప్రతిభ నైపుణ్యం కలిగి ఉండి విదేశాల్లో ఉద్యోగుల కొరకు వెళ్తున్న క్రమంలో స్వదేశానికి ఉపయోగపడవలసిన అత్యున్నతమేధాశక్తిని విదేశాలు అందిపుచ్చుకుంటూ ఉన్నాయా అనే సంశయం కలగకమానదు. కారణాలు ఏవైనా విదేశాల్లో వేతనాలు ఎక్కువగా ఉంటున్నాయా లేక ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉంటున్నాయా అనే భావనతోనైనా కావచ్చేమో నిజమైనా కాకపోయినా భారతదేశంలోని శాస్త్ర ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగినటువంటి చాలామంది విద్యావంతులు విదేశాల వైపు మొగ్గ చూపుతున్నారా అనే సంశయం కలగక మానదు. భారతదేశానికి స్వతంత్రం వచ్చే నాటికి దేశంలోని ప్రజలలో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉండేదని గణాంకాలు చెప్తున్నాయి. దేశంలో ఆర్థిక వ్యవస్థ కూడా అంతంత మాత్రంగానే ఉండడం ఒకవైపు, పేదరికం మరోవైపు. ఆర్థిక వ్యవస్థ అనుకున్న రీతిలోలేకపోవడం వల్ల అధిక స్థాయిలో విద్యా ప్రమాణాలను అందరికీ అందించడంలో కొంత ఆలస్యంగా జరిగిందనే భిన్న వాదనలు సమాజంలో లేకపోలేదు. తద్వారా ప్రజలు ఎక్కువగా వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవించేవారు. అనంతరం జరిగిన పరిణామ క్రమంలో గణనీయంగా విద్యకు ప్రాముఖ్యత అవసరం కావడం దేశాభివృద్ధిలో అక్షరాస్యతక్రమం ప్రధానంగా మారింది. ప్రభుత్వాలు విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో క్రమేణా దేశంలో అనేక రాష్ట్రాల్లో ప్రతిభావంతులైన బోధకుల చేత విద్య అభ్యసించిన వారిసంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ భారత దేశ జనాభాలో గణనీయంగా అక్షరాస్యత శాతం పెరుగుతూ వస్తున్నది. ఎక్కువగా ఇంజనీరింగ్ విద్యావ్యవస్థకు భారతదేశంలో ఉన్న అన్ని యూనివర్సిటీలు ఉత్తమమైన నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. దీనివల్ల ఇంజనీరింగ్ వ్యవస్థ అనేది భారతదేశంలో విస్తృతంగా ఉపాధి అవకాశాలు ఉన్న వ్యవస్థగా మారింది. ఇంజనీరింగ్ చదువుకున్న విద్యార్థులు డిగ్రీలు పుచ్చుకొని స్వదేశంలోనే కాకుండా ఇతర దేశాల్లోనూ ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. అయితే చాలావరకు భారతదేశంలోని ఇంజినీరింగ్ చదివి ప్రతిభా నైపుణ్యం ఉన్న వారిని స్వదేశంలో ఉపాధి కంటే విదేశాల్లో ఉపాధి అవకాశాలు ఆకర్షించయో ఏమోకానీ చాలామంది ఉన్నత విజ్ఞానవంతులు కూడా భారత దేశాన్నివిడిచి ఆసియా దేశాలు, అమెరికా, ఆస్ట్రేలియా ,యూరప్ లాంటి అనేక దేశాల్లో ఉన్న ప్రముఖ సంస్థల్లో పారిశ్రామిక వాణిజ్య వ్యవస్థలలో చేరడానికి స్వదేశంలో చదివిన నాణ్యమైన విద్య విదేశాల్లో ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందనే భిన్నాభిప్రాయాలు లేకపోలేదు.



దీనితో భారతదేశంలో ఉన్న సాంకేతిక విద్యావ్యవస్థకు అగ్రదేశాలు, పాశ్చాత్య దేశాల్లో కూడా మంచి విలువలు ఉంటున్నాయి అనే వాదనలు బలపడుతూ వస్తున్నాయి. ప్రాచీన కాలం నుండి అనేక సంస్కృతి సాంప్రదాయాలకు ఆచార వ్యవహారాలకు నిలయమై ఉన్న భారత దేశంలో బహుముఖ ప్రజ్ఞ కలిగినటువంటి అనేకమంది విజ్ఞానవేత్తలు, జ్ఞానులు తత్వవేత్తలు, రాజకీయ వేత్తలు మరెందరో ప్రముఖులు భారతదేశ ప్రాచీన ఆధునిక చరిత్రలో సుస్థిరంగా నిలిచిపోయి భారతదేశం ప్రఖ్యాతి ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసినవారు లేకపోలేదు. ప్రాచీన కాలం నుండి కూడా భారతదేశం విద్యాపరంగా ప్రపంచవ్యాప్తంగా మూల బిందువుగా ఉండేదనినలందా, తక్షశిల లాంటి విశ్వవిద్యాలయాల్లో అనేక దేశాల నుండి అభ్యాసకులు వచ్చి విద్యను అభ్యసించి వెళ్లే వారని చరిత్రకారులు చెపుతారు. కానీ భిన్నంగా తరచుగా స్వదేశంలో ఉన్న విద్యావంతులు వేరేదేశాల్లో ఉన్నత చదువులకు ఉద్యోగాలకు వలసలు వెళుతున్న దృశ్యాలు అడపాదడపా గోచరిస్తుండడం ఆశ్చర్యకరం. సుమారు మూడు దశాబ్దాల నుండి చాలామంది భారతదేశంలో ఇంజినీరింగ్ విద్యలో పరిపూర్ణమైన నైపుణ్యత గల విద్యాభ్యాసాన్ని పూర్తిచేసి అమెరికా ఆస్ట్రేలియా యూరప్ దేశాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నం చేయడం, చాలామంది ఆయాదేశాల్లో పౌరసత్వం తీసుకుని స్థిరపడడం కూడా జరుగుతూ వచ్చింది. దీనితో స్వదేశంలో ఉత్తమమైన విద్యను అభ్యసించి సాంకేతిక రంగాల్లో నిపుణత కలిగిన ప్రతిభావంతుల నైపుణ్యతను మేధాసంపత్తిని పాశ్చాత్య దేశాలు విరివిగా ఉపయోగించుకుంటున్నాయా అనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. కానీ స్వదేశం మీద అభిమానం కలిగి అనేక విషయాలపై నిపుణత కలిగిన విద్యావంతులు, మేధావులు, అన్నిరంగాల్లో క్షేత్రస్థాయిలో అత్యున్నతమైన ప్రతిభను ప్రదర్శిస్తూ భారతదేశాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకుపోతున్న వారు లేకపోలేదు. అలాంటి వారు విదేశాలకువెళ్లి ఏదో సాధించుకోవాలని కాకుండా దేశభక్తి, దేశ అభిమానంతోపాటు దేశానికి ఎంతో కొంత సేవచేయాలని వారికున్న జ్ఞానాన్ని స్వదేశానికి అంకితపరుస్తూ శాస్త్రవేత్తలుగా, వైద్యులుగా, ఇంజినీర్లుగా, అనేక రకాలైనటువంటి టెక్నీషియన్లుగా, పరిశోధకులుగా మరెన్నో విషయాలలో తమవంతు కృషి చేస్తుండడం శుభపరిణామం. స్వదేశంలో ఉత్తమమైన విద్యను, పరిపూర్ణ విజ్ఞానాన్ని సంపూర్ణంగా నేర్చుకుంటున్న యువత భారతదేశ పురోగతిలో సమాజ అభివృద్ధి కొరకు తోడ్పడే విధంగా మరింతగా తమ వంతు పాత్ర పోషించాల్సి ఉంది. అయినప్పటికీ, చాలావరకు స్వదేశంలో ఉన్నతవిద్యను అభ్యసించిన యువత విదేశాల వైపు పరుగులు పెడుతుండడం సర్వసాధనమైపోతుందా అనిపిస్తుంది. ఈవిధానంలో పాశ్చాత్య దేశాలఅభివృద్ధిలో భారతీయ మేధావులు ఆయాదేశాల్లో వివిధ రంగాల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా భాగస్వాములు అవుతున్నారా అనే సంశయం కలగక మానదు. ఏదిఏమైనప్పటికీ భారతదేశంలో అత్యున్నతమైన మేధాసంపత్తి కలిగిఅన్ని రంగాల్లో నైపుణ్యం కలిగినటువంటి ప్రతిభావంతులు మారుతున్నకాలానికి అనుగుణంగా స్వదేశంలోనే అధునాతన శాస్త్ర సాంకేతిక పోకడలతో మరింతగా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని ఆశించడంలో సందేహంలేదేమో. ●



# నైజీరియాలో అమెరికా సైన్యం భీకర దాడులు

## హ్యాపీ క్రిస్మస్ అంటూ ట్రంప్ పోస్టు!

**అబూజా, డిసెంబరు 26:** నైజీరియాలో ఐసిస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా) ఉగ్రవాద స్థావరాలపై అగ్రరాజ్యం అమెరికా సైన్యం విరుచుకుపడింది. నైజీరియాలో క్రైస్తవుల హత్యలను ఆపాలని ఐసిస్‌ను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన కొద్ది రోజుల్లోనే ఈ దాడులు చేపట్టడం గమనార్హం. క్రైస్తవులను దాడులను నిరోధించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. వాయువ్య నైజీరియాలోని ఐసిఎస్ ఉగ్రవాదులే లక్ష్యంగా తమ సైన్యం భీకర దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 'నైజీరియాలో ఐసిస్ ఉగ్రవాదులపై అమెరికా శక్తిమంతమైన దాడులు చేపట్టింది. ముఖ్యంగా అమాయక క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దారుణ హత్యలకు పాల్పడుతున్న వారిపై ఇవి జరిగాయి. ఈ ఊచకోతలు ఆపకపోతే నరకం చూపిస్తానని గతంలోనే హెచ్చరించాను. అయినా వాటిని ఉగ్రవాదులు పెడచెవిన పెట్టి ఇప్పుడు దానికి ఫలితం అనుభవిస్తున్నారు. రాడికల్ ఇస్లామిక్ తీవ్రవాదాన్ని సహించను' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 'మన సైన్యానికి ఆ భగవంతుడు ఆశీస్సులు ఉండాలి.. హతమైన ఉగ్రవాదులు సహా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు.. ఈ హత్యాకాండ కొనసాగితే.. మా దాడులు కూడా జరుగుతూనే ఉంటాయి..' అని అమెరికా అధ్యక్షుడు వార్నింగ్ ఇచ్చారు. నైజీరియా అభ్యర్థన మేరకు దాడులు చేపట్టి, పలువురు ఉగ్రవాదులను హతమార్చినట్టు అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది. కాగా, నైజీరియా అధికారుల అభ్యర్థన మేరకు (సోకోటో రాష్ట్రంలో) ఒక దాడిని నిర్వహించి.. పలువురు ఐసిస్ ఉగ్రవాదులను హతమార్చినట్లు అమెరికా ఆఫ్రికా కమాండ్ ఎక్స్ (ట్విట్టర్) పోస్టులో తెలిపింది. పెంటగాన్ చీఫ్ పెటే హెగ్‌సేథ్ సైతం నైజీరియాలో తమ సైన్యం చర్యలు, సంసిద్ధతపై ప్రశంసలు కురిపించారు. ఈ విషయంలో నైజీరియా ప్రభుత్వ మద్దతు, సహకారానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక, అమెరికా దళాలు నైజీరియాలో ట్రంప్ ఆధ్వర్యంలో మొదటిసారిగా దాడులు చేశాయి. అక్టోబరు, నవంబరు నెలల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నైజీరియాపై తీవ్ర విమర్శలు చేశారు. అక్కడ క్రైస్తవులు అస్తిత్వ ముప్పు ఎదుర్కొంటున్నారని, ఇది జాతి నిర్మూలనతో సమానమని ఆయన అన్నారు.

# అయోధ్యలో కొరియా రాణి విగ్రహావిష్కరణ



**అయోధ్య, డిసెంబరు 26:** భారత్, దక్షిణ కొరియాల మధ్య ఉన్న పురాతన సాంస్కృతిక బంధానికి ప్రతీకగా శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో కొరియా రాణి హెయో హ్వాంగ్‌ఓక్ (సురిరత్న) కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. సుమారు 2000 ఏళ్ల క్రితం అయోధ్యకు చెందిన యువరాణి కొరియాకు వెళ్లి అక్కడి రాజును వివాహమాడారనే చారిత్రక విశ్వాసానికి గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కొరియన్ ఇతిహాసాల ప్రకారం, క్రీ.శ. 48లో అయోధ్య రాజు తన కుమార్తె సురి రత్నను, దైవాజ్ఞ మేరకు సముద్ర మార్గంలో కొరియాకు పంపారు. అక్కడ ఆమె గయ సామ్రాజ్య స్థాపకుడైన రాజు కిమ్ సురోను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు పది మంది సంతానం కలగగా, వారి వారసులనే నేడు దక్షిణ కొరియాలో కరక్ తెగగా పిలుస్తారు. సుమారు 60 లక్షల మంది ఉన్న ఈ తెగ ప్రజలు, తమ మూలాలు అయోధ్యలోనే ఉన్నాయని దృఢంగా విశ్వసిస్తారు. ఈ బంధాన్ని గౌరవిస్తూ 2001లోనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, దక్షిణ కొరియాలోని గిమ్హే నగరం కలిసి సరయూ నది ఒడ్డున రాణి సురి రత్న పేరుతో ఒక స్మారక పార్కును నిర్మించాయి. కొరియా ప్రతినిధుల కోరిక మేరకు ఇటీవల ఈ పార్కును మరింత సుందరీకరించి, తాజాగా రాణి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించారు. 2018లో దక్షిణ కొరియా ప్రథమ మహిళ కిమ్ జంగ్‌సూక్ భారత పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ఈ పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించడం గమనార్హం. ప్రతి ఏటా కరక్ తెగకు చెందిన వందలాది మంది కొరియన్లు అయోధ్యకు వచ్చి తమ పూర్వీకురాలిని స్మరించుకుంటారు. ఈ విగ్రహా ఏర్పాటుతో అయోధ్య, గిమ్హే నగరాల మధ్య ఉన్న సోదర బంధం మరింత బలపడింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య కేవలం దౌత్యపరమైన సంబంధాలకే కాకుండా, చారిత్రక, సాంస్కృతిక బంధానికి నిలువుటద్దంగా నిలుస్తోంది.

# దాయాది పాకిస్థాన్‌కు మరిన్ని కష్టాలు

## వైమానిక దళం ఏర్పాటుకు ఉగ్రసంస్థ టిటిపి ప్రణాళిక!



**కాబూల్, డిసెంబరు 26:** అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి ను తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) రెచ్చిపోతోంది. కొత్త యేడాదిలో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించేలా ప్రణాళికలు చేసింది. ఇందులో భాగంగానే పాక్ సైన్యానికి పోటీగా వైమానిక దళం ఏర్పాటు చేయడానికి సిద్ధపడింది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో పలు పోస్టులు చేసింది. ఈ వార్త పాక్ అధికారులను భయపెడుతోంది. 2026లో ఈ వైమానిక దళం ఏర్పాటు చేస్తామని టిటిపి ఓ ప్రకటనలో పేర్కొంది. సలీం హక్కానీ నాయకత్వంలో దీన్ని నడపనున్నట్లు తెలిపింది. దీంతోపాటు ప్రావిన్స్‌ల వారీగా మోహరింపులు, మిలిటరీ యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మిలిటరీ కమాండర్లతో కూడిన రెండు కొత్త పర్యవేక్షణ జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. కాశ్మీర్, గిల్గిత్-బాల్టిస్థాన్‌తో సహా మరికొన్ని ప్రావిన్స్‌లను తమ అధీనంలోకి తీసుకోవాలని ప్లాన్ చేస్తోంది. మిలిటరీ యూనిట్లలో నాయకత్వ మార్పులు కూడా చేపట్టింది. 2022 నవంబరులో పాక్ ప్రభుత్వంతో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని టిటిపి ముగించింది. ఆ తర్వాత నుంచి పాక్ భద్రతా దళాలు, పోలీసులు, అధికారులపై టిటిపి వరుస దాడులకు పాల్పడుతోంది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలోచిస్థాన్ ప్రావిన్స్‌లలో కార్యకలాపాలు విస్తరించింది. అఫ్ఘానిస్థాన్ భూభాగం నుంచి టిటిపి ఉగ్రదాడులకు పాల్పడుతుందని పాక్ అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే, తాలిబన్ ప్రభుత్వం వీటిని ఖండిస్తోంది.

# మహిళా మేనేజర్‌పై సామూహిక అత్యాచారం..

## కంపెనీ సిఇఒతోపాటు మరో ఇద్దరి అరెస్టు

**జైపూర్, డిసెంబరు 26:** రాజస్థాన్‌లోని ఓ కంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్న మహిళ గ్యాంగ్ రేప్‌నకు గురైంది. ఈ ఘటన ఉదయ్‌పూర్‌లో జరిగింది. ఆ కేసుతో సంబంధం ఉన్న ప్రైవేట్ కంపెనీ సిఇఒతోపాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ ప్రైవేటు కంపెనీలో సిఇఒగా పనిచేస్తున్న జితేశ్ సిసోడియా.. వారం క్రితం పుట్టినరోజు పార్టీ ఇచ్చాడు. ఆ పార్టీకి మహిళా మేనేజర్ కూడా హాజరయ్యారు. ఈ కేసులో మరో మహిళా ఎగ్జిక్యూటివ్, ఆమె భర్త గౌరవ్ సిరోహి నిందితులుగా ఉన్నారు. గురువారం ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారిని నాలుగురోజుల కస్టడీలోకి తీసుకున్నారు. బిఎన్ఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద సుఖేర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఉదయ్‌పూర్ ఎస్పీ యోగేశ్‌గోయల్ తెలిపారు. బర్త్‌డే పార్టీ ముగిసిన తర్వాత అతిథులు అందరూ వెళ్లిపోయారని, అయితే మహిళా ఎగ్జిక్యూటివ్.. లేడీ మేనేజర్‌ను ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని చెప్పింది. కారులో బాధిత మేనేజర్‌తోపాటు సిసోడియా, సిరోహి ఉన్నారు. దారిలో ఓ చోట ఆగి సిగరెట్లు కొన్నారని, ఆ సిగరెట్ తాగిన తర్వాత స్పృహ కోల్పోయినట్లు మేనేజర్ చెప్పింది. మరుసటి రోజు మళ్లీ నిద్ర లేచినట్లు పేర్కొన్నది. అయితే తనపై లైంగిక దాడి జరిగినట్లు అప్పుడు గుర్తించినట్లు ఆమె తెలిపారు. బాధిత మహిళ ఇచ్చి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. నిందితుల్ని అరెస్టు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. లేడీ మేనేజర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఎఎస్పీ మాధురీవర్మకు దర్యాప్తు వివరాలు అందజేసినట్లు తెలుస్తోంది.

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

## ప్రమాదకర స్థాయిలో వాయుకాలుష్యం

## గాలి నాణ్యత ఎక్యూఐ 400గా నమోదు

## ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గించలేం..

## ఢిల్లీ హైకోర్టులో తేల్చిచెప్పిన కేంద్రం

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకు పెరుగుఒతంది. ప్రమాదకర స్థాయిలో పెరుగుతోందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం హానికర పొగమంచు ఢిల్లీలోని అనేక ప్రాంతాలను కమ్మేసింది. దీంతో దృశ్య నాణ్యత కూడా బాగా పడిపోయింది. గాలి నాణ్యత గణనీయంగా క్షీ ణించింది. ఢిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచి (ఏక్యూఐ) గురువారం ఉదయం 220గా నమోదైంది. ఓ సమయంలో 310గా కూడా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. అదే శుక్రవారం ఉదయం గాలి నాణ్యత సూచి 400గా నమోదైనట్లు తెలిపింది.

ఉదయం 8 గంటల ప్రాంతంలో నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 305గా నమోదైంది. అత్యధికంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచిక 390గా నమోదైంది. బవానాలో 379, నరేలా ప్రాంతంలో 356, ఆర్కే పురంలో 320గా ఏక్యూఐ నమోదైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగ్గా నమోదైంది.

ద్వారకలో 253, అరబిందో మార్గ్ (258), మందిర్ మార్గ్ (234), విమానాశ్రయం ప్రాంతంలో (239)గా గాలి నాణ్యత నమోదైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాయుకాలుష్యం తీవ్రంగా ఉండటంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 4 కింద ఢిల్లీ ప్రభుత్వం ఆంక్షలు అమలు చేస్తోంది.

**ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గించలేం: కేంద్రం**

ఢిల్లీలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గించాలన్న అభ్యర్థనను కేంద్రం తోసిపుచ్చింది. అది ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రముఖ న్యాయవాది కపిల్ మదన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు జిఎస్‌టి తగ్గింపు అంశంపై వివరణాత్మక స్పందన తెలియజేయాలని కోరిన నేపథ్యంలో శుక్రవారం మరోసారి చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. జిఎస్‌టి తగ్గింపుపై నిర్ణయం తీసుకునేందుకు జిఎస్‌టి మండలికి ఇబ్బందేమిటని ప్రశ్నించింది. వైద్య పరికరాల వర్గీకరణను ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుందని, ఈ విషయంపై జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. జిఎస్‌టి కౌన్సిల్ ఒక రాజ్యాంగ సంస్థ అని.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇందులో పాల్గొంటున్నందున జిఎస్‌టి తగ్గింపు ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయలేమని కేంద్రం తరపున విచారణకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్ వెంకట్రామన్ అన్నారు. ఈ విషయంపై వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వాలని ఆయన కోర్టును కోరారు. దీంతో కోర్టు 10 రోజుల సమయం ఇచ్చింది. తదుపరి విచారణ 9కివాయిదా.

# పెంచిన రైల్వేఛార్జీలు అమల్లోకి!



**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దేశవ్యాప్తంగా రైల్వేశాఖ పెంచిన రైలు ఛార్జీలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ ఏడాది జులైలో ఒకసారి ఛార్జీలు పెంచిన రైల్వే శాఖ, కేవలం ఐదు నెలల వ్యవధిలోనే రెండోసారి ధరలను పెంచడం గమనార్హం. మెయిల్/ఎక్స్‌ప్రెస్, ఏసీ క్లాసులతో పాటు, 215 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించే ఆర్డినరీ నాన్ ఏసీ క్లాసులపై కూడా ఈ పెంపు ప్రభావం చూపనుంది. అయితే, సబర్బన్ (లోకల్) రైళ్లు, సీజన్ టికెట్లకు ఈ పెంపు నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వడం సామాన్య ప్రయాణికులకు కొంత ఊరటనిచ్చే అంశం. భారీగా పెరిగిన నిర్వహణ ఖర్చులు, ముఖ్యంగా సిబ్బంది జీతభత్యాలు రూ.1,15,000 కోట్లు, పెన్షన్ల బిల్లు రూ.60,000 కోట్లు భారాన్ని తగ్గించుకునేందుకే ఈ ఛార్జీల హేతుబద్ధీకరణ చేపట్టినట్లు రైల్వే మంత్రిత్వ శాఖవెల్లడించింది. ఈ పెంపు ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా సుమారు రూ.600 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఛార్జీలు పెంచినప్పటికీ, ఇప్పటికీ ప్రయాణికుల టికెట్ ధరలో దాదాపు 50 శాతం సబ్సిడీ రూపంలో తామే భరిస్తున్నామని రైల్వే శాఖ పేర్కొంది. రైల్వే బోర్డు జారీ చేసిన కమర్షియల్ సర్క్యులర్ నం. 24 ప్రకారం, ఛార్జీల పెంపు సబర్బన్, సీజన్ టికెట్లకు ఎలాంటి మార్పు లేదు. ఆర్డినరీ నాన్‌ఏసీ 215 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారికి పాత ఛార్జీలే వర్తిస్తాయి. ఆ తర్వాత దూర ప్రయాణాలపై శ్లాబుల వారీగా రూ.5 నుంచి రూ.20 వరకు పెంచారు. స్లీపర్ క్లాస్ (ఆర్డినరీ): కిలోమీటర్‌కు 1 పైసా పెరిగింది. మెయిల్/ఎక్స్‌ప్రెస్ (నాన్‌ఏసీ, ఏసీ క్లాసులు స్లీపర్, ఏసీ చైర్ కార్, ఏసీ 3టైర్, 2టైర్, ఫస్ట్ క్లాస్‌తో పాటు రాజధాని, శతాబ్ది, వందే భారత్ వంటి అన్ని ప్రీమియం రైళ్లలో కిలోమీటర్‌కు 2 పైసల చొప్పున ఛార్జీలు పెరిగాయి. ఈనెల 26కు ముందే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. రిజర్వేషన్ ఫీజు, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీలలో ఎలాంటి మార్పులు చేయలేదు.

**ప్రభుత్వంపై విపక్షాల తీవ్ర విమర్శలు**

రైలు ఛార్జీల పెంపుపై విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, "మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను దోచుకోవడానికి ఏ అవకాశాన్నీ వదలడం లేదు. బడ్జెట్‌కు కొన్ని రోజుల ముందు, పార్లమెంటులో చర్చ లేకుండా ఛార్జీలు పెంచారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్ లేకపోవడంతో జవాబుదారీతనం కనుమరుగైంది" అని విమర్శించారు. రైల్వే భద్రతా వ్యవస్థ కవచ్ కేవలం 3 మార్గాలకే పరిమితమైందని, ఇది కేవలం ప్రచారానికే తప్ప ఆచరణలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు.

# సీక్రెట్‌గా ఫోన్ వాడుతోందని భార్యను చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టిన భర్త



**గోరఖ్‌పూర్, డిసెంబరు 26:** భార్య రహస్యంగా మొబైల్ ఫోన్ వాడుతోందన్న కోపంతో ఓ భర్త ఆమెను దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని ఇంటి వెనుకే గొయ్యి తీసి పూడ్చిపెట్టి, ఆమె ఆత్మహత్య చేసుకుందని పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. లూథియానాలో కూలీగా పనిచేసే అర్జున్, ఈ నెల 21న యూపి గోరఖ్‌పూర్‌లోని తన ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ సమయంలో అతని భార్య ఖుష్బూ రహస్యంగా మొబైల్ ఫోన్ వాడటాన్ని గమనించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన అర్జున్, ఖుష్బూ గొంతు నులిమి హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటి వెనుక ఆరడుగుల గొయ్యి తవ్వి, ఓ మడత మంచం సహా ఆమె మృతదేహాన్ని అందులో పూడ్చిపెట్టాడు. అనంతరం ఖుష్బూ ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులను నమ్మించాడు. రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఖుష్బూ తండ్రి తన అల్లుడిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు అర్జున్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని, మృతదేహాన్ని నదిలో పడేశానని చెప్పాడు. పోలీసులను గ్రామ సమీపంలోని నదీ తీరానికి తీసుకెళ్లి గంటలపాటు తప్పుదోవ పట్టించాడు. నదిలో గాలింపు విఫలమవడంతో పోలీసులు తమదైన శైలిలో అర్జున్‌ను మరోసారి విచారించగా, అతను నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ఇంటి వెనుక తవ్వకాలు జరపగా మృతదేహం లభ్యమైందని గోరఖ్‌పూర్ సర్కిల్ ఆఫీసర్ శిల్పా కుమారి తెలిపారు. వివాహేతర సంబంధంపై అనుమానంతోనే అర్జున్ ఈ హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్న ఈ దంపతులకు పిల్లలు లేరు.

# ఢిల్లీలోనూ రూ.5లకే భోజనం

## అటల్ క్యాంటీన్ పేరుతో ప్రారంభం

## 45 ప్రాంతాల్లో ప్రారంభించిన ప్రభుత్వం



**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దక్షిణాది రాష్ట్రాల్లో పేదల కడుపు నింపుతున్న రూ.5లకే భోజనం పథకం తాజాగా దేశ రాజధాని ఢిల్లీలోనూ అందుబాటులోకి వచ్చింది. సిఎం రేఖా గుప్త నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని ఢిల్లీ నగర వ్యాప్తంగా 'అటల్ క్యాంటీన్' పేరుతో రూ.5లకే భోజన పథకానికి శ్రీకారం చుట్టింది. ఢిల్లీ నగరంలో 45 ప్రాంతాల్లో అటల్ క్యాంటీన్‌లను ప్రారంభించారు. త్వరలో 100 ప్రాంతాలకు విస్తరించాలని యోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేఖా గుప్త తెలిపారు. దేశరాజధాని ఢిల్లీలో నివసిస్తున్న పేదలు చాలా మంది ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నారు. తమ ఆదాయంలో ఎక్కువ మొత్తాన్ని ఆహారం కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇతర మౌలిక అవసరాలకు వదలుకోవాల్సిన పరిస్థితి. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఎవరూ ఆకలితో బాధపడకూడదనే లక్ష్యంతో రూ.5లకే భోజనం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సిఎం రేఖా గుప్త వివరించారు. అటల్ క్యాంటీన్ మెనూలో అన్నం, పప్పులు, కూరగాయలు, బ్రెడ్ వంటి పోషకాహార పదార్థాలుంటాయని తెలిపారు. వీటి ద్వారా పేదలు, కార్మికులు,

రోజువారీ వేతన జీవులు లబ్ధిపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అటల్ క్యాంటీన్‌లు ప్రారంభించిన అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఢిల్లీ పట్టణాభివృద్ధి మంత్రి ఆశిష్ సూద్, బిజెపి నేతలతో కలిసి క్యాంటీన్‌లోనే భోజనం చేశారు.

# వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే మేలు

## -చీఫ్ జస్టిస్ సూర్యకాంత్



**పనాజి, డిసెంబరు 26:** వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ఎంతో విజయవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన ప్రక్రియ అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఇది కేసులోని ఇరుపక్షాలకూ గెలుపుగెలుపు పరిస్థితిని కల్పిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈరోజు గోవాలోని పనాజీలో మధ్యవర్తిత్వంపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన పాదయాత్రలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో మధ్యవర్తి ఎవరిపైనా తమ నిర్ణయాలను రుద్దరని సీజేఐ స్పష్టం చేశారు. వివాదంలో ఉన్న పక్షాలు కోరుకున్న పరిష్కారాన్నే దీని ద్వారా సాధించవచ్చని తెలిపారు. ఇది ఇరువర్గాల అంగీకారంతో జరిగే పరిష్కారం కాబట్టి, ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. సుప్రీంకోర్టు ఖిదేశం కోసం మధ్యవర్తిత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు.

న్యాయవ్యవస్థలోని భాగస్వాములైన న్యాయవాదులు, న్యాయమూర్తులతో పాటు సాధారణ ప్రజలకు కూడా దీని ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం ఒక విజయవంతమైన సాధనమని ప్రజలు గుర్తించినప్పుడు మంచి ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. కొన్ని ప్రత్యేక కేసులను మధ్యవర్తిత్వానికి పంపమని హైకోర్టులను, జిల్లా కోర్టులను ఒప్పించగలిగామని తెలిపారు. ఇది పాత, కొత్త కేసులకే కాకుండా, కోర్టుకు రాకముందు దశలో (ప్రీలిటిగేషన్) ఉన్న వివాదాలకు కూడా వర్తిస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు.

# సంక్షిప్తంగా..

## 31న గిగ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మె

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దేశవ్యాప్తంగా యాప్ ఆధారిత సంస్థల్లో పనిచేస్తున్న గిగ్ వర్కర్లు మరోసారి ఆందోళన బాట పట్టారు. తమ దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం నూతన సంవత్సర వేడుకల రోజైన డిసెంబర్ 31న దేశవ్యాప్త మెగా సమ్మెకు పిలుపునిచ్చారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్‌బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ వంటి ప్రధాన కార్మిక సంఘాలు ఈ సమ్మెకు నాయకత్వం వహిస్తున్నాయి. స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, జెప్టో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ సంస్థల డెలివరీ భాగస్వాములు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. ఈనెల 31న తలపెట్టిన ఈ మెగా సమ్మెకు ముందు, క్రిస్మస్ పండుగ రోజైన 25న కూడా గిగ్ వర్కర్లు ఫ్లాష్ స్ట్రైక్ నిర్వహించారు. గురుగ్రామ్, హైదరాబాద్ వంటి నగరాల్లో ఈ సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపించింది. గురుగ్రామ్‌లో ఫుడ్ డెలివరీ సేవలకు తీవ్ర అంతరాయం కలగగా, హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో 2,000 మందికి పైగా కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

## తిరువనంతపురం మేయర్‌గా బిజెపి అభ్యర్థి రాజేశ్



**తిరువనంతపురం, డిసెంబరు 26:** కేరళ రాజకీయాల్లో బీజేపీ సరికొత్త రికార్డు సృష్టించింది. తిరువనంతపురం కార్పొరేషన్ మేయర్‌గా బీజేపీ నేత వి.వి. రాజేశ్ (49) ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన మేయర్ ఎన్నికల్లో ఆయన 51 ఓట్లతో విజయం సాధించారు. రాష్ట్ర చరిత్రలో ఒక బీజేపీ నేత మేయర్ పీఠాన్ని అధిరోహించడం ఇదే తొలిసారి కావడంతో ఇది ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ఈ ఎన్నికల్లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ కూటమి (ఎల్‌డీఎఫ్) అభ్యర్థి ఆర్.పి. శివాజీకి 29 ఓట్లు రాగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. శబరినాథన్‌కు 19 ఓట్లు మాత్రమే లభించాయి. ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.

## టొరాంటో వర్సిటీలో భారతీయ విద్యార్థి హత్య!



**ఒట్టావా, డిసెంబర్ 26:** కెనడాలో మరో ఘోరం జరిగింది. ఇటీవల టొరంటోలో 30 ఏళ్ల భారతీయ మహిళ హిమాన్షి ఖురానా హత్య ఘటన మరువక ముందే మరో భారతీయ విద్యార్థి శివంక్ అవస్థి (20) హత్యకు గురయ్యాడు. దీంతో భారతీయుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. టొరంటో విశ్వవిద్యాలయంలోని స్కార్‌బరో క్యాంపస్ సమీపంలో 20 ఏళ్ల భారతీయ విద్యార్థి శివాంక్ అవస్థిపై దుండగుడు కాల్పులు జరిపాడు. తీవ్ర గాయాలతో ఉండగా పోలీసులు గమనించారు. ఆసుపత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ ఏడాది టొరంటోలో జరిగిన 41వ హత్య కేసుగా పోలీసులు తెలిపారు.

## లాలూఫ్యామిలీకి షాక్.. ప్రభుత్వ బంగ్లా నుంచి వస్తువులు తరలింపు



**పాట్నా, డిసెంబర్ 26:** ఎట్టకేలకు లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేసింది. పాట్నాలోని 10 సర్క్యులర్ రోడ్‌లోని బంగ్లాలో 19 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆర్జేడి ఘోర పరాజయం పాలైంది. ఎన్డీఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాలని లాలూ కుటుంబానికి నోటీసులు ఇచ్చింది. దీనిపై గత కొద్దిరోజులుగా రాజకీయ దుమారం కొనసాగుతోంది. ఖాళీ చేసేందుకు నిరాకరించింది. ముఖ్యమంత్రులుగా పని చేసిన తమకు బంగ్లాను కేటాయించారా? అని ఆర్జేడీ నిలదీసింది. పైగా లాలూ ప్రసాద్‌కు అనారోగ్యం కారణంగా ఇదే బంగ్లా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కానీ ప్రభుత్వం నిరాకరించింది.

## ప్రాథమిక స్థాయి నుంచి వార్తాపత్రికలు చదవాల్సిందే: యుపి సర్కార్

**లక్నో, డిసెంబరు 26:** విద్యార్థులు మొబైల్‌ఫోన్లకు బానిసలు కాకుండా చూడటంతోపాటు వారికి ప్రాపంచిక పరిజ్ఞానం మరింతగా పెంపొందించేదిశగా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు వార్తాపత్రికలు చదవడాన్ని తప్పనిసరిచేసింది. శుక్రవారం ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు కూడా జారీచేసింది. విద్యార్థుల్లో పఠనాసక్తినిపెంచడం, డిజిటల్‌స్క్రీన్‌టైమ్‌ను తగ్గించాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. విద్యార్థులకోసం పాఠశాలల గ్రంథాలయాల్లో హిందీ, ఇంగ్లీషు పేపర్లను అందుబాటులో ఉంచనున్నారు. ఉదయం స్కూలు అసెంబ్లీలో కనీసం పదినిమిషాలు వార్తాపత్రిక చదవడానికి కేటాయించాలి. జాతీయ, అంతర్జాతీయ, క్రీడారంగాల అంశాలను విద్యార్థులు చదవాలి.

# ఆదిలాబాద్ రిమ్స్‌లో క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభం



## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి సిసియును ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

### ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సుల పోస్టుల భర్తీకి చర్యలు

### రూ. 2,700 కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి పునర్నిర్మాణం

### మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం

**ఆదిలాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యాన్ని చేరువ చేయడమే లక్ష ్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ రిమ్స్ (ళిలీళీ) ఆస్పత్రిలో ఖిప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ఖి కింద నిర్మించిన అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్ (దిదిగీ) భవనాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. రిమ్స్‌లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన క్రిటికల్ కేర్ యూనిట్ ద్వారా అత్యవసర స్థితిలో ఉన్న రోగులకు మెరుగైన ప్రాణవాయువు (ıదిగీ) మరియు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయని మంత్రి తెలిపారు. దీనివల్ల అత్యవసర చికిత్స కోసం హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ వైద్య రంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైందని మంత్రి జూపల్లి అన్నారు. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక ఉస్మానియా ఆస్పత్రిని రూ. 2,700 కోట్ల భారీ వ్యయంతో అత్యున్నత ప్రమాణాలతో పునర్నిర్మిం చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాకుండా, రోగులకు సేవలు అందించే సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. రిమ్స్ సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, పారామెడికల్, ఇతర సిబ్బంది పోస్టులను యుద్ధప్రతి పాదికన భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసు కు రావడం ద్వారా ఖిఆరోగ్య తెలంగాణఖిను నిర్మించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో అదిలాబాద్ ఎంపీ గోడం నగేష్,ఎమ్మెల్సీ దండే విఠల్, ఆదిలాబాద్, బోథ్,ఖానాపూర్ ఎమ్మెల్యేలు పాయిలి శంకర్,అనీల్ జాదవ్, వెడమ బొజ్జు, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



వీర్ బాల్ దివస్ సందర్భంగా శుక్రవారం సికిందరాబాద్ గురుద్వారాలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

# సిక్కుల సంక్షేమం, సాధికారతకు మోడీ ప్రభుత్వం అవిరళ కృషి

### వీర్‌బాల్ దివస్‌లో బిజెపి అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, డిసెంబరు 26:** వీర్ బాల్ దివస్ సందర్భంగా సికిందరాబాద్ గురుద్వారాలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పాల్గొన్నారు. భక్తులు, సిక్కు సమాజ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకు ముందు వీర్ సాహిబ్జాదేలు సాహిబ్జాదా బాబా జోరావర్ సింగ్ జీ, సాహిబ్జాదా బాబా ఫతేహ్ సింగ్ జీ త్యాగాలకు ఘన నివాళులు అర్పించారు.వీర్ సాహిబ్జాదేల వీరమరణం భారతీయ నాగరికత చరిత్రలో అత్యంత ప్రేరణాత్మక అధ్యాయాలలో ఒకటని రాంచందర్ రావు పేర్కొన్నారు. వయస్సు ధైర్యానికి అడ్డుకాదని, విశ్వాసం, గౌరవం, అణచివేతకు వ్యతిరేకంగా నిలబడే అత్యున్నత విలువలు చిన్న వయస్సులోనూ ఎలా ప్రతిఫలించగలవో వారి త్యాగం శాశ్వత స్మరణగా నిలుస్తుందని తెలిపారు. వీర్ బాల్ దివస్ కేవలం స్మరణ దినం మాత్రమే కాదని, ధైర్యం, ధర్మం, అన్యాయానికి ఎదురు నిలిచే భారతదేశ శాశ్వత విలువలను పునఃప్రతిపాదించే ముఖ్యమైన దినమని ఆయన అన్నారు.సిక్కు సమాజం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. 2014 నుంచి సిక్కుల సంక్షేమం, గౌరవం, సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం అపూర్వమైన కట్టుబాటుతో పనిచేస్తోందని, ఇది కేవలం ప్రతీకాత్మక చర్యలకు పరిమితం కాకుండా నిరంతరమైన, సార్థకమైన విధానాత్మక చర్యల ద్వారా అమలవుతోందని స్పష్టం చేశారు.1984 యాంటీసిక్కు అల్లర్ల బాధితులకు న్యాయం అందించడంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాత్మక చర్యలు అత్యంత కీలకమైనవని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఈ చర్యల ద్వారా బాధిత కుటుంబాలకు దీర్ఘకాలంగా ఎదురుచూసిన న్యాయం, బాధ్యతను కల్పించగలిగిందన్నారు.లంగర్ కార్యక్రమాలకు ఉపయోగించే ఆహార పదార్థాలపై జీఎస్టీ మినహాయింపు కల్పించే సేవా భోజ్ యోజన వంటి ముఖ్యమైన పథకాలను కూడా ఆయన ప్రస్తావించారు. సంవత్సరానికి సుమారు రూ.325 కోట్ల వ్యయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా లంగర్‌లకు ఉపయోగించే ఆహారంపై సెంట్రల్ జీఎస్టీ, ఐజీఎస్టీ రీయింబర్స్ చేయబడుతూ,ప్రతిరోజూ దాదాపు ఒక కోటి మందికి ఉచిత భోజనం అందించే గురుద్వారాలకు గణనీయమైన సహాయం అందుతోందని తెలిపారు.అలాగే, సిక్కుల పవిత్ర క్షేత్రాలలో ఒకటైన కర్తార్పూర్ సాహిబ్‌ను ఏడాది పొడవునా దర్శించుకునే అవకాశం కల్పించిన చారిత్రాత్మక కర్తార్పూర్ కారిడార్ సిక్కు సమాజం ఎన్నాళ్లుగానో కోరుకున్న కలను సాకారం చేసిందన్నారు.ఈ అన్ని చర్యలు ప్రధాని నరేంద్ర మోదీ సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ అనే దార్శనిక ఆలోచనకు ప్రతిబింబమని, ప్రతి సమాజం విశ్వాసం, వారసత్వం ఆకాంక్షలకు గౌరవం ఇస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయని రాంచందర్ రావు పేర్కొన్నారు. సిక్కు సమాజంతో అనుసంధానం, అవగాహన పెంపొందించడంలో మైనారిటీ మోర్చా అధ్యక్షులు జగ్మోహన్ సింగ్ జీ చేసిన సేవలను కూడా ఈ సందర్భంగా అభినందించారు.వీర్ సాహిబ్జాదేల వారసత్వం ప్రతిబింబించే ధైర్యం, సేవాభావం జాతీయ ఐక్యత విలువలను ప్రతి భారతీయుడు తన జీవితంలో ఆచరించాలని కోరుకుంటూ రాంచందర్‌రావు తన ప్రసంగాన్ని ముగించారు.



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్

# బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపు

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్

### కాగజ్‌నగర్‌లోని నేషనల్ జిమ్, బాక్సింగ్ క్లబ్‌ల సందర్శన

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపొందిస్తాయని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ చిత్తరంజన్ అన్నారు. శుక్రవారం బాక్సింగ్ డే సందర్భంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని నేషనల్ ఫిట్‌నెస్ జిమ్, శివ బాక్సింగ్ క్లబ్‌లను సందర్శించారు. యువతకు ఉచిత బాక్సింగ్ శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్న కానిస్టేబుల్ నివాస్‌ను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. ముందుగా అడిషనల్ ఎస్పీ హనుమాన్ చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్లబ్‌లో శిక్షణ పొందుతున్న బాక్సర్లను పరిచయం చేసుకుని, బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ యువత బాక్సింగ్ వంటి క్రీడలను నేర్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆత్మస్థైర్యం కూడా పెరుగుతుందని తెలిపారు. క్రీడలు క్రమశిక్షణ, సహనం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, యువత తమ ప్రతిభను క్రీడారంగంలో ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షి ంచారు. కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ తనకు ఇష్టమైన బాక్సింగ్ క్రీడను యువతకు ఉచితంగా శిక్షన ఇస్తున్న నివాస్ ఎంతో మందికి ఆదర్శమని ప్రశంసించారు. యువతను రాష్ట్ర, జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు సిద్ధం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు, కోచ్‌లు, బాక్సర్లు, రామకాంత్ యాదవ్ (మాజీ సర్వీస్‌మాన్, సీనియర్ నేషనల్ బాక్సర్), జాకిర్, శ్రవణ్ గౌడ్ (నేషనల్ ఫిట్‌నెస్ జిమ్ ట్రైనర్), వినయ్ యాదవ్ (కోచ్) తదితరులు

# మెరిట్ కోటాలో సిఎం అయిన రేవంత్‌రెడ్డి

### కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుద్ధి, జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం కౌంటర్ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి మెరిట్ కోటాలో సిఎం అయ్యారన్నారు. నువ్వు మేనేజ్‌మెంట్ కోటాలో రాజకీయాల్లోకి వచ్చావంటూ కేటిఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అదే కోటాలో వచ్చి సిరిసిల్ల ఎమ్మెల్యే అయి.. మంత్రి అయ్యావంటూ వ్యంగ్యంగా అన్నారు.

రేవంత్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా జడ్పీటీసీ, ఎమ్మెల్యేగా గెలిచారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా గెలిచి.. ప్రస్తుతం సిఎం అయ్యారని వివరించారు. మెరిట్ కోటా, పేమెంట్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా ఎవరిదో తెలం గాణ ప్రజలకు తెలుసునన్నారు. పిసిసి అధ్యక్షుడుగా రేవంత్‌రెడ్డి అయిన తర్వాతనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు.

ఎప్పుడు అధికారం తమకే ఉంటుందని బీఆర్ఎస్ హయాంలో నియంత పాలన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని రేవంత్ రెడ్డి ఓడించి ఇంటికి పంపారని చెప్పారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి చేతిలో మీకు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి ఛాలెంజ్ స్వీకరించాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఐరెన్ లెగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అని అభివర్ణించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి గుండు సున్నా వచ్చిందని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో తాను ఏదో పొడిచానని చెప్పుకున్న కేటీఆర్‌ను కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ప్రజలు ఓడగొట్టారని గుర్తు చేశారు. పిచ్చి ఆలోచనలు మానుకోవాలంటూ కేటిఆర్‌కు ఆయన హితవు పలికారు. నిర్మాణత్మక ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషించాలంటూ బిఆర్ఎస్ నేతలకు సూచించారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకుని రావాలంటూ కేటీఆర్‌కు తెలిపారు

. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే ప్రధాన ప్రతిపక్ష నేత హోదాను కేటీఆర్ తీసుకోవాలని అభిప్రాయ పడ్డారు. తద్వారా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కేటీఆర్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. తాను బూతులు మాట్లాడతానంటూ కేటీఆర్ అంటున్నారన్నారు. కట్టే, కొట్టే, తెచ్చే అనేది మీ కుటుంబానికి వర్తిస్తుం దంటూ కేటీఆర్‌కు తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ ప్రజలను మీరు వంచించ లేదా? అని కేటిఆర్‌ను సూటిగా ప్రశ్నించారు.

కేసీఆర్ ఉద్యమకారుడి అవతారం ఎత్తి, పిట్ట కథలు కట్టి, సీఎం పదవిని అధికారాన్ని చేపట్టి.. రాష్ట్రాన్ని అప్పులచేసి మీ కుటుంబానికి సంపద తెచ్చారని విమర్శించారు.

# ఆర్‌టిసి కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

### ఎండి నాగిరెడ్డికి జెఎసి నాయకుల విజ్ఞప్తి

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి)లోని కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కారించాలని ఆర్‌టిసి జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్‌టిసి వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డికి టిజిఎస్ ఆర్‌టిసి జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్ శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 డిమాండ్లతో కూడిన అంశాలపై సుదీర్ఘంగా ఆర్‌టిసి ఎండితో చర్చించినట్లు తెలిపారు. వాటిలో 2017 వేతన సవరణకు చెందిన అలవెన్సులను పెంచి చెల్లించుటకు ఎండి సానుకూలంగా స్పందించార న్నారు. అలాగే కారుణ్య నియామకాలను 3 సంవత్సరాల పాటు కన్సాలిడేటెడ్ పే కింద పని చేసే విధానాన్ని 2 సంవత్సరాలకు మారుస్తామని, 2021 వేతన సవరణను వీలైనంత త్వరలో అమలు చేయడానికి ప్రయత్నం చేస్తామని చెప్పారన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వీలైనంత త్వరగా చెల్లిస్తామని, మహాలక్ష్మి పథకంలో ప్రయాణిస్తున్న మహిళలకు స్మార్ట్ కార్డు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారన్నారు.

కార్మికులపై పనిభారాలు తగ్గిస్తామని, జనం లేని రూట్లలో కిలోమీటర్లను తగ్గిస్తామని, కారుణ్య నియామకాల వయో పరిమితిని 44 సంవత్సరాలకు పెంచడానికి బోర్డు అనుమతి కోరుతామని జేఏసీ నాయకులు తెలిపారు. ఆర్‌టిసిలో యూనియన్ల పునరుద్ధరణ అంశం యాజమాన్యం పరిధిలో లేదని, ప్రభుత్వం అనుమతితో యూనియన్ల కార్యకలాపాలను అనుమతిస్తామని అన్నారు.

తార్నాక హాస్పిటల్‌లో పేషెంట్‌తో వచ్చే అటెండెంట్స్‌కి మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని, త్వరలో విశ్రాంతి భవనం నిర్మించి అందులో డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేస్తామన్నారని తెలిపారు. ఆర్‌టిసి ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ ప్రైవేట్ వాహనాల రవాణాను అరికట్టేందుకు తగు చర్యలు చేపడతామన్నారు. అలాగే యాజమాన్యం పరిధిలో ఉన్న సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరించటానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినట్టు జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.కమలాకర్ గౌడ్, జె.రాఘవులు, బుద్ధ విశాల్, ఎం.ఎ.మజీద్, జి.రాములు, జి.రాంచందర్ పాల్గొన్నారు.

# 7వ తేదీ నుంచి అండర్-19 రాజీవ్‌గాంధీ ఆల్ ఇండియా క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 26, ప్రభాత వార్త:** జనవరి 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అండర్-19 రాజీవ్‌గాంధీ ఆల్ ఇండియా క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్ నగరంలో జరుగుతాయని క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్, ఉమ్మడి ఏపి రాష్ట్ర క్రీడల శాఖ మాజీ మంత్రి వి.హనుమంతరావు తెలిపారు. మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జ్ఞాపకార్థం ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత 18 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో అండర్-19, ఛండీగఢ్‌లో అండర్-17,





బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వి.హనుమంతరావు

చెన్నైలో అండర్-15 క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహి స్తున్నామని ఆయన తెలిపారు. ఈ సారి నిర్వహించేది 19వదని తెలిపారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్‌లోని ఫతే మైదాన్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో 4 దేశాలు, పది రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. 7వ తేదీన అంబర్‌పేటలోని వాటర్ వర్క్స్ గ్రౌండ్‌లో రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఈ పోటీలను ప్రారంభి స్తారని, ఆ తరువాత అత్తాపూర్ విజయానంద్ గ్రౌండ్, ఎల్‌బి స్టేడియంలో జరుగుతాయన్నారు. ముగింపు 10వ తేదీన ఎల్‌బి స్టేడియంలో ఫైనల్ పోటీలు జరుగుతాయని, ముఖ్యఅతిధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పాల్గొని క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తారని ఆయన వివరించారు. శ్రీలంక, దుబాయి, మలేషియా, నేపాల్ దేశాలతోపాటు తమిళనాడు, మహారాష్ట్ర, చెన్నై, బీహార్, విదర్భ, బెంగుళూరు, తెలంగాణ తదితర రాష్ట్రాలు క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ జట్లు పాల్గొంటాయని వి.హనుమంతరావు చెప్పారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు ఆది అవినాష్, ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శంభుల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ నేత ఆర్.లక్ష్మణ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు బంజారా జ్ఞానేశ్వర్‌గౌడ్, పంజాల ధనుంజయగౌడ్, దిడ్డి రాంబాబు, సద్గురు నేమూరి మహేందర్, షకీల్, కుంకుమ మనోహార్ తదితరులు పాల్గొన్నారు.



గేట్ ధర్నాలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

# ఆర్టీసీ డ్రైవర్‌పై అక్రమ కేసుకు నిరసనగా ధర్నా

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 26, ప్రభాతవార్త :** ఆర్టీసీ డ్రైవర్ పై పెట్టిన అక్రమ కేసుకు నిరసనగా ఆర్టీసీ డిపో గేట్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్టీసీ గేట్ వద్ద ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి దివాకర్ గౌడ్ మాట్లాడుతూ రెబ్బెన మండలంలోని దేవులగూడా వద్ద ఆర్టీసీ బస్సుకు వెనుక నుండి బులెరో వాహనం ఢీకొని జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి జైలుకు పంపించడం బాధాకరమని అన్నారు. ఈ విషయంలో డిపో మేనేజర్ నిరక్ష ్యంగా వ్యవహరించడం సబబు కాదని ఆరోపించారు. ఆర్టీసీ డ్రైవర్ రామారావుకు వెంటనే బెయిల్ మంజూరు చేసి కేసు విషయంలో పునరాలోచన చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రఫిక్, తాహెర్, రాజు, హరినివాస్, బాలు, విలాస్, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో గుజ్జ కృష్ణ, విక్రమ్‌గౌడ్ తదితరులు

# 29 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనే రిజర్వేషన్‌లు ప్రకటించి, ఎన్నికలు నిర్వహించాలి

### రాష్ట్ర బిసి జెఎసి ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 26, ప్రభాత వార్త:** మార్చి మాసంలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొనడాన్ని బిసి జెఎసి తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నెల 29వ తేదీ నుంచి జరిగే అసంబ్లీ సమావేశాల్లోనే బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ ఎన్నికలను ప్రకటించాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బిసి జెఎసి రాష్ట్ర కార్యాలయంలో స్టీరింగ్ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో బిసి రిజర్వేషన్‌లపై కేంద్ర ప్రభుత్వంపైన వత్తిడీ పెంచేందుకు అఖిల పక్షంతో ఢిల్లీకి వెళ్ళేలా అసెంబ్లీ వేదికగా ఒక రాజకీయ కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బిసి రిజర్వేషన్‌లకు కట్టుబడి ఉంటామని ప్రకటించిన రాజకీయ పార్టీలు ఇప్పుడు మాట మార్చి వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. బిసి రిజర్వేషన్‌ల కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేసిన తాము ఇక నుంచి ఉద్యమాన్ని ఉదృతం చేయాలని నిర్ణయించామని, ఇందులో భాగంగా ఈ నెల 31న అఖిల పక్ష సమావేశాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని , అలాగే బిసిల రాజకీయ చైతన్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 5,380 మంది బిసి సర్పంచ్‌లతో సంక్రాంతి తరువాత 'బిసి సర్పంచ్‌ల రాష్ట్ర ఆత్మీయ అభినందన సభ' నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఫిబ్రవరి 2వ వారంలో రాష్ట్ర వ్యాప్తంగా బిసిల రథయాత్ర చేపడతామని, ఏప్రిల్ మొదటి వారంలో లక్షలాది మందితో హైదరాబాద్ నగరంలో 'వేల వృత్తులు-కోట్ల గొంతులు' అనే నినాదంతో భారీ బహిరంగ సభను నిర్వహించి ప్రభుత్వానికి బిసిల సత్తా చాటి చెపుతామని జాజుల తెలిపారు.

# ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరాలన్నదే ప్రజల ఆకాంక్ష

### ప్రధాని మోడీ, బిజెపిది తిరోగమనం, కార్పొరేట్లకు ఊడిగం చేసే సిద్ధాంతం

### బ్రిటిష్ కాలంలోనే పోరాటం చేసి హక్కులను, చట్టాలను సాధించుకున్నాం

### వందేళ్ల సిపిఐ సభలో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** దేశంలో ఉన్న ఎర్ర జెండాలన్నీ ఏకమై ఒకే జెండాగా మారి ఢిల్లీలోని ఎర్రకోటపై ఎగరాలని ప్రజలు ఆకాంక్షి స్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివ రావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ లేకపోతే ప్రస్తుతం అనుభవిస్తున్న చట్టాలు, హక్కులు ఉండేవే కాదన్నారు. కమ్యూనిస్టు పార్టీ లేకపోతే ప్రజలకు రక్షణ కవచం లేదన్నారు. వీరోచిత పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను, చట్టాలను రద్దు చేస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తిరోగమన దిశగా వెళ్తుందని మండిపడ్డారు. 'సిపిఐ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవ సభను .. ఆ పార్టీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైద రాబాద్‌లోని మగ్దూంభవన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అరుణ పతాకాన్ని కూనంనేని సాంబశివరావు ఎగురవేశారు. సభకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నర్సింహా అధ్యక్షత వహించగా, జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట రెడ్డి, కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్‌పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారత కమ్యూ నిస్టు పార్టీ(సిపిఐ) ఆవిర్భవించి వం దేళ్లు పూర్తవు తుందని, దోపిడీవర్గాల నుంచి మానవ జాతి విముక్తి కోసం అనేక త్యాగాలు, వీరోచిత పోరాటలు చేసిన ఘనమైన చరిత్ర సిపిఐకే ఉందన్నారు. బ్యాంకుల జాతీ యీకరణ, భూ సంస్కరణలు, రైతాంగ విముక్తి, కార్మికు లకు 8 గంటల పనిదినాలు, అసంఘటితరంగ కార్మి కులు, దళితులు, బడుగు బలహీనవర్గాలకు, పీడిత వర్గాలు కూడా ప్రధాన స్రవంతిలో భాగస్వాములనే విష యాన్ని సిపిఐ నినదించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర ప్రపంచ పుట్టల్లో లిఖించదగిందన్నారు. జైలులోనే భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టిందని, పుట్టుకలోనే పార్టీ గొంతు నూలిమేయాలని ప్రయత్నించారని, కొందరికి యావజ్జీవ శిక్ష విధించారని, మరి కొందరిని ఉరి తీశారని, అనేక మంది నాయకులపై కుట్ర కేసులు నమోదు చేసినప్పటికీ వాటన్నింటినీ తట్టుకుని కమ్యూనిస్టులుగా నిలబడ్డారని గుర్తు చేశారు. కమ్యూనిజం, ఎర్రజెండా లేకపోతే ప్రజలకు రక్షణ కవచం లేదని, ఎప్పుడు ఏమైతుందోననే భయానక పరిస్థితులు ఉంటాయని తెలిపారు. ప్రధాని మోదీ, బిజెపి లాంటి తిరోగమనం, కార్పొరేట్లకు ఊడిగం చేసే సిద్ధాంతం కలిగిన వాళ్లు.. కమ్యూనిజం అంటేనే ఒక భూతంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని, కమ్యూనిస్టులు ఉండకూడదని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒక లక్ష్యాన్ని పెట్టు కున్నదని అన్నారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు.

బ్రిటిష్ కాలంలోనే పోరాటం చేసి సాధించుకున్న హక్కులను, చట్టాలను మోదీ ప్రభుత్వం తీసివేస్తోందని, కార్మికులకు సమ్మె చేసే హక్కు కూడా లేదని, రాష్ట్రంలో ఆర్‌టిసిలో కూడా అదే పరిస్థితి నెల కొందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని, ఇచ్చిన జీతాలు తగ్గిస్తున్నారన్నారు. మావోయిస్టుల గురించి మాట్లాడే వారిని కూడా జైలులో పెడుతున్నారని విమర్శించారు. పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేసే శక్తి ఎర్రజెండాకు ఉన్నదని, అందుకే ఎర్రజెండాను చూసి బిజెపి వణికిపోతున్నదని, ఎర్ర జెండా కనిపించొద్దనే ఏజెండాతో బిజెపి పనిచేస్తున్నదని విమర్శించారు. హైద రాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు నాటి నిజాం నిరాకరించడంతో మఖ్దూం మొయియుద్దీన్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలు తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని, ఈ క్రమంలో మూడు వేల గ్రామాలను విముక్తి చేశారని గుర్తు చేశారు. నిజాం నవాబుల ఏజెంట్లు ఎర్రజెండాలను చూసి భయ పడ్డారని, గ్రామాలన్నీ కమ్యూనిస్టుల వశమవు తుందని, వారంతా నిజాం నవాబుకు మొరపెట్టుకుంటే, ఆయన సర్దార్ వల్లభాయపటేల్‌ను ఆహ్వానించి భారతదేశంలో విలీనమయ్యారని పల్లా గుర్తు చేశారు. దేశంలోనే మొట్టమొదటిసారి భూసంస్కరణలు తీసుకొచ్చిన మొట్ట మొదటి రాష్ట్రం కేరళ అని అన్నారు. అందరికీ విద్య, వైద్యం అనే నినాదంతో కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం పని చేస్తుందని, అతి పేదరిక నిర్మూలన రాష్ట్రంగా కేరళ ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని పల్లా గుర్తు చేశారు. కె. రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవలే వందేళ్ల ఉత్సవాలను పూర్తి చేసుకున్న ఆర్ఎస్ఎస్ సంస్థ తమ వందేళ్ల చరిత్రలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. భారతస్వాతంత్ర్య పోరటంలో ఆర్ఎస్ఎస్ తరపున ఒక్కరైనా జైలుకు వెళ్లారా? స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారా? ఏనాడైనా నాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిలదీశారా? అని ప్రశ్నించారు.



## కాచిగూడలోని ఓ ఇంట్లో భారీ అగ్నిప్రమాదం

### ఎసి షార్ట్‌సర్క్యూట్ కారణం..

### కవల పిల్లల్లో ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుందర్ నగర్‌లో ఉన్న ఓ నివాస గృహంలో ఏసీ షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మూడేళ్ల కవల పిల్లల్లో ఒక చిన్నారి మృతి చెందగా, మరో బాలుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఉన్న కవల పిల్లలు రహీం, రెహమాన్ మంటల్లో చిక్కుకున్నారు. ప్రమాదంలో రహీం అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన రెహమాన్‌ను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతిచెందిన చిన్నారి తండ్రి పేరు సైఫుద్దీన్ ఖాదిరిగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## డిప్యూటీ కలెక్టర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:**తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీనిశుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విక్టర్, ప్రధాన కార్యదర్శిగా కే.చంద్రకళ ఎన్నికయ్యారు. తెలంగాణా డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన అడిషనల్ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం కేంద్ర సంఘ ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై పలు తీర్మానాలు కూడా ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారు.దాంతో పాటు 2025-2028 కాలానికి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సమావేశంలో వి.విక్టర్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నియ్యారు.ప్రధాన కార్యదర్శిగా కె.చంద్రకళ, కోశాధికారిగా చొల్లేటి వెంకటేశ్వర్లు ఎన్నుకోబడ్డారు. అసోసియేట్ ప్రెసిడెంట్లుగా చంద్రావతి, ఎం. నగేష్, మహిపాల్ రెడ్డి, హనుమా నాయక్, ఎస్.రాజేశ్వరి తదితరులు ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కె.ఉపేందర్ రెడ్డి ఎన్నికయ్యారు.



### రవికుమార్ కుటుంబసభ్యుల ఆస్తులపై

## హైకోర్టుకు ఎసిబి నివేదిక

### పరకామణి చోరీ కేసులో కీలక పరిణామం

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పర కామణిలో జరిగిన చోరీ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సం బంధించిన నిందితుడు రవికుమార్‌తో పాటు ఆయన కుటుంబసభ్యుల ఆస్తులపై ఏసీబీ (అవి నీతి నిరోధకశాఖ) ఒక మధ్యంతర నివేదికను విడుదలచేసింది.ఈ నివేదికను ఏసీబీ డీజీ ఇవాళ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సమర్పించారు.ఈ నివేదికను స్వీకరించిన హైకోర్టు, దానిని సవివరంగా పరిశీలించిన అనంతరం తగిన ఉత్తర్వులుజారీచేస్తామని స్పష్టం చేసింది. అలాగే ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవసరంఉందా లేదా అనే అం శాన్ని పరిశీలించాలని సీఐడీకి న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. పరకామణిలో జరిగిన చోరీవ్యవహారంపై హైకోర్టులో శుక్రయవారం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా న్యాయ మూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుకు సంబం ధించిన దర్యాప్తు చాలా వరకు పూర్తి అయ్యిం దని, అయితే కొన్ని అంశాలపై ఇంకా విచారణ మిగిలి ఉందని పేర్కొన్నారు. అలాగే సుప్రీం కోర్టు ఇచ్చిన గత తీర్పుల ప్రకారం, ఈ కేసులో పరిస్థితుల ఆధారంగా మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవకాశం ఉందని హైకోర్టు అభిప్రా యపడింది. ఈ అంశాన్ని కూడా సీఐడీ పరిశీలించాలని సూచించింది.ఈ కేసుకు సం బంధించిన తదుపరి విచారణను 2026 జనవరి 5వ తేదీకి ఏపీ హైకోర్టు వాయిదా వేసింది. అప్పటికి ఏసీబీ నివేదికపై పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.



## నీటి తొట్టిలో పడి బాలుడు మృతి

మదనపల్లె క్రైమ్, డిసెంబరు 26 ప్రభాతవార్త: ఆడుకుంటూ వెళ్లిన ఓ నాలుగేళ్ల చిన్నారి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటన మదనపల్లెలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా సోమల మండలానికి చెందిన జ్యోతిప్రకాష్ గత రెండేళ్లుగా మదనపల్లి మండలం వలసపల్లి గ్రామ సమీపంలోని ఒక మామిడి తోటకు కాపలాగా ఉంటూన్నారు. శుక్రవారం సాయంత్రం జ్యోతిప్రకాష్ కుమారుడు విక్రాంత్ (4) ఇంటి ముందు ఆడుకుంటూ, సమీపంలో ఉన్న నీటి సంపు వద్దకు వెళ్లిన బాలుడు, ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. కొంతసేపటికి బాలుడు కనిపించకపోవ డంతో తల్లిదండ్రులు ఆందోళనతో చుట్టుపక్కల వెతికారు. చివరకు నీటి తొట్టిలో విగతజీవిగా పడి ఉన్న విక్రాంత్‌ను చూసి వారు తల్లడిల్లిపోయారు. అల్లారుముద్దుగా పెరుగుతున్న కొడుకు కళ్ల ముందే విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# టి-20 సిరీస్‌ను కైవసం చేసుకున్న ఉమన్ ఇండియా!

### 8 పరుగుల తేడాతో శ్రీలంక మహిళా జట్టు ఓటమి




**తిరువనంతపురం, డిసెంబరు 26:** వరల్డ్ ఛాంపియన్ భారత జట్టు స్వదేశంలో తొలి టి20 సిరీస్ పట్టేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ79 నాటౌట్‌గా విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగింది. మూడో టీ20లోనూ భారీ విజయంతో సిరీస్ పట్టేసింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆతిథ్య జట్టుకు కనీస పోటీ ఇవ్వలేకపోతున్న లంక త్రివేంద్రంలోనూ ఓటమి చవిచూసింది. రేణుకా సింగ్ 4-21 తో నిప్పులు చెరగగా స్వల్ప ఛేదనలో షఫాలీ ఉప్పెనలా విరుచుకుపడింది. 13.2 ఓవర్లలోనే విక్టరీ కొట్టిన భారత్ మరో రెండు మ్యాచ్‌లుండగానే సిరీస్ ఒడిసి పట్టింది. ఇంకా 40 పరుగులు మిగిలి ఉండగానే ఎనిమిది వికెట్ల తేడాతో విక్టరీ నమోదుచేసింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా రేణుకాసింగ్ నిలిచింది. స్వదేశంలో ఇటీవలే వన్డే ప్రపంచకప్‌తో చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ బృందం పొట్టి సిరీస్‌ను కైవసం చేసుకుంది. త్రివేంద్రంలో శుక్రవారం శ్రీలంకను 112కే కట్టడి చేసిన టీమిండియా స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్ అని ఊదేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ 79 నాటౌట్‌గానిలిచి సుడిగాలిలా చెలరేగి బౌండరీల మోతతో లక్ష్యాన్ని మంచులా కరిగించింది. స్మృతి మంధాన(1), జెమీమా రోడ్రిగ్స్(9)లు విఫలమైనా దూకుడు మంత్రంతో ఆడిన లేడీ సెహ్వాగ్ 24 బంతుల్లోనే సెంచరీ కొట్టింది. హాఫ్ సెంచరీ తర్వాత కూడా అదే దూకుడు చూపింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(21 నాటౌట్)తో కలిసి జట్టుకు భారీ విజయాన్ని అందించింది. ఈ గెలుపుతో టీ20ల్లో అత్యధిక విజయాలతో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మేగ్ లానింగ్ పేరిట ఉన్న రికార్డును హర్మన్‌ప్రీత్ బ్రేక్ చేసింది. 77 విజయాలతో లానింగ్‌ను ఇండియన్ స్కిప్పర్ వెనక్కి నెట్టేసింది. వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిన శ్రీలంక చావోరేవో పోరులోనూ చిన్న స్కోర్‌కే పరిమితమైంది. టాస్ ఓడిన ఆ జట్టు ఇన్నింగ్స్‌ను దూకుడుగానే ఆరంభించింది.

ఓపెనర్ హాసిని పెరీరా 25 చేసింది. బౌండరీలతో చెలరేగడంతో స్కోర్ దాటింది. దీప్తి శర్మ3-18 ఓవర్లో చమరి ఆటపట్టు(3)ను ఔట్ చేసి దీప్తి శర్మ తొలి బ్రేకిచ్చింది. ఆ తర్వాత ఆరో ఓవర్లో రేణుకా సింగ్(4-21) పెరారీతో పాటు డేంజరస్ హర్షిత సమరవిక్రమ(2)లను వెనక్కి పంపింది. 32కే లంక మూడు బిగ్ వికెట్లు కోల్పోయి ఒత్తిడిలోకి వెళ్లింది. దులానీ మెరుపులతో కీలక బ్యాటర్లు ఔట్ కావడంతో కష్టాల్లో పడిన లంకను ఇమేశా దులానీ (27) ఆదుకుంది. ఆమెతో కలిసి భాగస్వామ్యంతో జట్టును ఆదుకోవాలనుకున్న నీలాక్షి డిసిల్వా(4)ని రేణుక ఎల్బీగా పెవిలియన్ చేర్చింది. క్రాంతి గౌడ్, దీప్తి ఓవర్లో ఫ్రంట్‌ఫుట్‌లో స్వీప్ షాట్లతో విరుచుకుపడిన దులానీ కవిశ దిల్హరి(20) తో కలిసి స్కోర్ బోర్డును ఉరికించింది.

26 బంతుల్లో 40 రన్స్ పిండుకున్న ఈ ద్వయ్నా దీప్తి విడదీసింది. సిక్సర్‌కు యత్నించిన దిల్హరి బౌండరీ వద్ద అమన్‌జోత్ చేతికి చిక్కడంతో 85 వద్ద ఐదో వికెట్ పడింది. కాసేపటికే దులానీని రేణుక వెనక్కి పంపగా లంక స్కోర్ నెమ్మదించింది. ఆఖర్లో కుశాని నుత్యంగన(19 నాటౌట్) మెరుపులతో ఆటపట్టు బృందం నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 రన్స్ మాత్రమే చేయగలిగింది.

### రాజంపేట జిల్లాను నువ్వే తెచ్చుకో అన్నమయ్య!

## థీమ్ పార్కులో ప్రజల వినూత్న నిరసన

రాజంపేట, డిసెంబరు 26 ప్రభాతవార్త: స్వామి అన్నమయ్య కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిపై 32 వేల సంకీర్తన రచించి అంకితం చేసి ఈ ప్రాంతంలో జన్మించిన మీరు మీ పేరుతో ఏర్పాటు చేసిన జిల్లాను మీరే తెచ్చుకోవాలంటూ ప్రజలు మొరపెట్టుకున్నారు. రాజంపేట జిల్లా రాజంపేట జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో జేఏసీ నేతలు ఇచ్చిన పిలుపుమేరకు కడప రేణిగుంట జాతీయ రహదారిలోని అన్నమయ్య థీమ్ పార్క్ వద్దకు వేలాదిగా ప్రజలు చేరుకున్నారు. అన్నమయ్య విగ్రహం ఎదుట వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జేఏసీ నేతలు అన్నమయ్య విగ్రహం వద్ద వినతి పత్రం అందజేసి మీ జిల్లాను మీరే తెచ్చుకోవాలి అంటూ వేడుకున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై ఆకస్మికంగా బైఠాయించారు. ఎంతో వాహనాలు పెద్ద ఎత్తున జాతీయ రహదారిపై నిలిచిపోయాయి. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గం నేత ఎల్లటూరి శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ జగన్ సర్కార్ చేసిన పాపం రాజంపేటను వెంటాడుతోందని విమర్శించారు. వైకాపా హాయంలో జరిగిన తప్పును కూటమి ప్రభుత్వం సరిదిద్ది రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే జనసేన నేత పవన్ కళ్యాణ్‌ను కలిసి రాజపేట జిల్లా కేంద్రం చేయాలని కోరతామన్నారు. రాజంపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు




శరత్ కుమార్ రాజు తదితరులు ప్రసంగించారు. మరోవైపు జెఏసి ఆధ్వర్యంలో రాజంపేటలో జరుగుతున్న నిరాహార దీక్షలు 17 రోజులు చేరుకున్నాయి. టిడిపి అసెంబ్లీ జగన్ మోహన్ రాజు దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు టి.లక్ష్మీ నారాయణ, పూల భాస్కర్, ప్రభాకర్ నాయుడు, డాక్టర్ సుధాకర్, డాక్టర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## 1న కృష్ణా, గోదావరి జలాలపై మంత్రి ఉత్తమ్ పిపిటి

### హాజరుకానున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:** జనవరి1న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. కృష్ణా, గోదావరి జలాల అంశంపై కాంగ్రెస్ పార్టీ నేతలకు ముఖ్యంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించనున్నారు. ప్రగతిభవన్ వేదికగా నిర్వహించే ఈ పీపీటీలో రాష్ట్ర జలవిధానంపై ప్రభుత్వ వైఖరి, గత పాలనలో జరిగిన నిర్ణయాలు, ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లపై సమగ్రంగా వివరించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా హాజరుకానున్నారు.

ప్రధానంగా అసెంబ్లీలో కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించే లక్ష్యంతో గత ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని వివరించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నది. 2,3వ తేదీల్లో గోదావరి, కృష్ణా జలాలపై అసెంబ్లీలో ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నారు. అయితే.. అధికారంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సైతం ఈ సబ్జెక్టు మీద అవగాహన ఉండాలనే ఉద్దేశంతో వారికి ఒకరోజు ముందుగానే పీపీటీలో వివరించనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో జలాల విషయంలో జరిగిన రాజీలను అసెంబ్లీలో గట్టిగా ప్రస్తావించేందుకు, పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఒకే వాయిస్‌తో మాట్లాడేందుకు ఈ ప్రజెంటేషన్‌ను కీలకంగా భావిస్తున్నారు.

# టోకెన్లు ఉంటేనే 'వైకుంఠం'

### తొలి మూడురోజులు కఠినంగా అమలు

### జనవరి 2నుండి అందరికి 'సర్వదర్శనం'

### సిఫారసులు స్వీకరించరన్న టిటిడి



**తిరుమల,డిసెంబరు 26ప్రభాతవార్తప్రతినిధి:** వైఖా నస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు జరిపించుకునే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవి త్రమైన వైకుంఠద్వార దర్శనానికి డిసెంబర్ 30, 31,జనవరి 1మూడురోజులు టోకెన్లు ఉన్న భక్తు లనే ఆలయం లోపలకు అనుమతించేలా టిటిడి చర్యలు తీసుకుంది. ఆ రోజులతో బాటు జనవరి 8వరకు ఎలాంటి సిఫార్సు లేఖలు కూడా స్వీకరిం చరు. వైకుంఠ ఏకాదశి పర్వదినం డిసెంబర్ 30న ద్వాదశి 31నటోకెన్ కలిగిన భక్తులతోబాటు రాజ్యాంగహోదాలోని ప్రముఖులు స్వయంగా వస్తేనే దర్శనాలు కల్పిస్తారు. జనవరి 2నుండి 8 వరకు సామాన్యభక్తులకు సర్వదర్శనంలో వారం రోజులు(జనవరి 8వరకు) వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు. గోవిందమాల భక్తులు కూడా దర్శన టిక్కెట్లు, టోకెన్లు ఉంటేనే ఆలయంలోనికి అను మతిస్తారు. ఈనెల 30వతేదీ నుండి జనవరి 8వరకు పదిరోజులు స్వయంగా వచ్చే విఐపిలకు మినహాయించి మరెవ్వరికీ విఐపి దర్శనాలు ఉం డవు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు సమయం సమీపిస్తోంది. ఇందుకు సంబంధించి టిటిడి అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకా దశి 30వతేదీ, ద్వాదశిని 31వతేదీ నిర్ణయిం చారు. కలియుగవైకుంఠవాసుడు కొలువైన ఆల యంలో 30వతేదీ తెల్లవారుజామున 1.30గం టలకు వైకుంఠద్వారం తెరచుకోనుంది. భక్తులకు సంతృప్తికర దర్శనం చేయించేలా టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సిం ఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి స్వయంగా పర్యవేక్షిస్తూ అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పదిరోజులపాటు దాదాపు 9లక్షల మంది భక్తులు ఆరోజుల్లో వైకుంఠద్వార దర్శనం చేసుకునేలా చూడనున్నారు. తొలిమూడురోజులు దర్శన టోకెన్లు లేని భక్తులను ఆలయం లోపలకు అనుమతించరు. రాజ్యాంగ పరిధిలోని ప్రోటోకాల్ విఐపిలు స్వయంగా వస్తేనే పరిమితంగా బ్రేక్ దర్శనాలు జారీ చేస్తారు. భారీ క్యూలైన్లు నివారించి గరిష్ట సం ఖ్యలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు కేటాయించిన టైమ్‌స్లాట్ టోకెన్లలో నిర్ధేశిత సమయానికే క్యూలైన్లలోనికి చేరుకోవాలని సూచిస్తున్నారు. 3వేలమంది యువ శ్రీవారిసేవ కులను, అవసరమైన పోలీసులను నియమించు కునివారి సేవలను క్యూలైన్ల నిర్వహణకు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి 300రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం 1.20 లక్షలు టిక్కెట్లు, శ్రీవాణి విఐపి బ్రేక్ దర్శనాలను రోజుకు వెయ్యి టిక్కెట్లు వారంరోజులకు ఎని మిదివేల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో భక్తులు అందు కున్నారు. అందరికీ మహాలఘులో వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. 30వతేదీ ఉదయం స్వర్ణరథం, 31నఉదయం చక్రస్నాన మహోత్సవం జరుగుతాయి.

## శివనామస్మరణతో మారుమోగిన శ్రీకాళహస్తీశ్వరాలయం

**శ్రీకాళహస్తి, డిసెంబరు 26 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయం భక్తులతో కిటకిట లాడింది. వరుస సెలవులతో ఆలయంలో ఎటు చూసినా భక్త జనులే. కన్నడ, తమిళనాడు నుంచి తండోపతండాలుగా భక్తులు కదలి వచ్చారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శివానందైక నిలయానికి భక్తులు పోటెత్తారు.

అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఒ మోహన్, విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్స్పెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం, హరికృష్ణ వారి సహచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. శనీశ్వరుని ఆలయం వద్ద, అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

వేదపండితులు, అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడషాభిషేకాలు జరిపారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి.

దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు.

## రాజ్యాధికార సాధన కోసం బిసిలు ఏకం కావాలి

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త :** రాజ్యాధికారం దిశగా బీసీలు ఐక్యం కావాలని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. గౌడ్ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) స్వర్ణోత్సవ సంబరాలు శుక్రవారం కాచిగూడ లోని మ్యాడం అంజయ్య హాల్లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మహేష కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని సుప్రజ హాస్పిటల్స్ సౌజన్యంతో గోపా హెల్త్ కార్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వంద సంత్సరాల తరువాత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో కులగణన చేపట్టిందని, అధికారికంగా బీసీలు 56. 36 శాతం ఉన్నట్లు తెలిందన్నారు.

కులాలుగా విడిపోతే 2 శాతం, 4 శాతం 5 శాతంగా ఉండటంతో ఏది సాధించలేమని, 56 శాతం బీసీలంతా ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించగలుగుతామని అన్నారు. కుల అభిమానం ఉండాలి కాని, కుల పిచ్చి ఉండకూడదని ఆయన సూచించారు. బీసీలు భవిష్యత్తులో ఎమ్మెల్యేలుగా మరింత ఎక్కువ మంది గెలుపొందే విధంగా చూడాలని, ఆ దిశగా తనవంతు ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు. ఏ కులమైనా, సమాజమైనా అభివృద్ధి చెందాలంటే అది విద్య ద్వారానే సాధమవుతుందని అన్నా రు.

గత 50 సంవత్సరాలుగా సమాజ అభివృద్ధి కోసం గోపా సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నా రు. మిగతా సంఘాలతో పోల్చుకుంటే గోపా సంస్థ కొంత వెనుకబడి ఉందనేది వాస్త వమని, మరింత ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కుల సంఘాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గోపా భవన్ కు అవసరమైన స్థలాన్ని గాని, భవన నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వ పరంగా ఇప్పించే విధంగా తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

గోపా సంస్థ ఒక ప్రత్యేక గోపా నిధిని ఏర్పాటు చేసి పేద ప్రజల విద్యాభివృద్ధికి పాటుపడాలని అన్నారు. చదువుకున్నప్పుడే ఏ కులమైన అభివృద్ధి చెందుతుందని, కుల అభివృద్ధి కోసం గోపా కృషి చేయాలని సూచించారు.

గోపా నిధి కోసం తనవంతుగా రూ.10 లక్షలు ఇస్తానని మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ కె. స్వామిగౌడ్, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, డాక్టర్ విజయ్ కుమార్ గౌడ్, అజయ్ కుమార్ గౌడ్, నూతి శ్రీకాంత్‌గౌడ్, బండి సాయన్న గౌడ్, జి.వి.శ్రీనివాస్ గౌడ్, రఘునాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న పిసిసి అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్‌గౌడ్

**రక్తం చిందిన రోడ్లు**

## ఆళ్లగడ్డవద్ద ప్రమాదంలో నలుగురు మృతి

### నల్లపాడు వద్ద మరో ఘటనలో ముగ్గురు దుర్మరణం

**నంద్యాల/గుంటూరు, డిసెంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో శుక్రవారం రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు, క్షతగాత్రు లంతా తెలంగాణ వాసులు. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం బత్తలూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. క్వాలిస్ వాహనం ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి, అవతలి వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో క్వాలిస్ వాహ నం నుజ్జునుజ్జు అయ్యింది. క్వాలిస్‌లో ఉన్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్వాలిస్‌లో ఇరు క్కున్న మృతదేహాలను తొలగించి ఆళ్లగడ్డ ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారికి వైద్య చికిత్స అందిస్తున్నారు. మృతులు, క్షతగా త్రులు హైదరాబాద్ వాసులుగా క్యాటరింగ్ సిబ్బందిగా గుర్తించారు. యాత్రకు వెళ్తే వారి కోసం వంట చేసేందుకు వెళ్లిన క్యాటరింగ్ చేస్తుంటారు. మృతులు గుండెరావు, శ్రవణ్, నరసింహ, బన్సీగా గుర్తిం చారు. అలాగే గాయపడిన వారు శివసాయి, సిద్ధార్థలు. హైదరాబాద్ నిజాం కాలేజీలో విద్యనభ్యసిస్తున్నారు. గత 15 రోజులుగా యాత్ర చేస్తున్న బస్సుకు వంట చేసేందుకు గుండెరావు టీం వెళ్లి, తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరి ధిలోని అంకిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహ దారిపై ఆగి ఉన్న కారును ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రా ణాలు కోల్పోగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మృతులను తెలంగాణలోని సూర్యా పేటకు చెందిన సుశీల(64), వెంకయ్య(70), మహేష్(28)గా గుర్తించారు. తిరుపతి నుంచి తిరిగి వస్తుండగా ఈఘటన చోటుచేసుకుంది. మృతదేహాలను నల్లపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నారు.

# రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణ



తిరుపతిలో నూతన పోలీస్ జిల్లా కార్యాలయం ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**సాంకేతిక పరిజ్ఞానంతో నేరనియంత్రణ అవసరం తిరుపతిలో కొత్త డిపిఒ ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు**

**తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** రకరకాల మనస్తత్వాలతో నేరాలు చేసే నేరస్తులకంటే పోలీసులు తెలివిగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అన్నారు. వారెన్ని డ్రామాలు ఆడినా సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానాన్ని అనుసరించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. సాంకేతికతను వాడుకుని నేరనియంత్రణ చేయాలన్నారు. డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించి విజువల్ ఆధారాలను సేకరించాలని సూచించారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన తిరుపతిజిల్లా పోలీసు కార్యాలయం (డిపిఒ)నూతన భవనాలను రాష్ట్రహోంమంత్రి వంగలపూడి అనిత, డిజిపి హరీశ్‌కుమార్‌గుప్తా, అనంతపురం డిఐజి షిమోషిబాజ్‌పేయి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుతో కలసి సిఎం చంద్రబాబు నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణే శరణ్యమన్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మికక్షేత్రానికి తిరుపతికి, తిరుమలకు వచ్చే భక్తులకు భరోసాగా పోలీసులు నిలవడం అభినందనీయమన్నారు. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే భక్తులకు భద్రతాభావం కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని సిఎం స్పష్టం చేశారు. కలియుగవైకుంఠం శ్రీవేంకటేశ్వరస్వామి నెలకొన్న ఈ ప్రాంతం పవిత్రతను కాపాడేలా పోలీసులు చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీసు వ్యవస్థ అత్యంత అప్రమత్తంగా వుండాలని నిర్ధేశం చేశారు. భక్తులకు ఎక్కడా చిన్న అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశాలిచ్చారు.

– రౌడీయిజంపై ఉక్కుపాదం:సిఎం

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడేప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతిలో హెచ్చరించారు. కొందరు రాజకీయ ముసుగులో ఉండి రౌడీయిజం చేస్తామంటే కుదరదని, సెటిల్‌మెంట్లు బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. రౌడీయిజం చేసే వారిని రాష్ట్రబహిష్కరణ చేస్తామని హెచ్చరిక చేశారు. అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా సరే జైలుకు పంపిన చరిత్ర తమదని సిఎం వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా భ్రష్టుపట్టాయని, తిరుమల పవిత్రతను దెబ్బతీశారని విమర్శించారు. రోడ్లు బ్లాక్‌చేయడంచ రప్పారప్పా లాడించడం ఏమిటో ఎవరికీ అర్థంకావడం లేదన్నారు. బంగారుపాళ్యంలో మామిడికాయలు తొక్కించారని, గుంటూరులో ఓ వ్యక్తిని కాన్వాయ్‌క్రింద తొక్కించి పొదల్లో పారేసి పోయారని అన్నారు. ఈ తరహా ఘటనల్లో సిసికెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధారాలు పెట్టుకోవాలన్నారు.

## ఆదోని మెడికల్ కాలేజీ టెండర్‌పై ప్రభుత్వ వివరణ

**కిమ్స్ ఆసుపత్రి ఎలాంటి బిడ్ వేయలేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టీకరణ**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో నిర్మించ తలపెట్టిన ఆదోని మెడికల్ కాలేజీ టెండర్ వ్యవహారంలో నెలకొన్న అనుమానాలను ప్రభుత్వం తొలిగించింది. ఈ అంశంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టతను ఇచ్చారు. ఆదోని కాలేజీకి కిమ్స్ ఆసుపత్రి బిడ్ వేసిందని తొలుత ప్రకటించిన ప్రభుత్వం, ఆ తర్వాత కిమ్స్ యాజమాన్యం దానిని ఖండించడంతో ఇరకాటంలో పడింది. ఈ వివాదంపై తాజాగా మంత్రి సత్యకుమార్ స్పష్టతనిచ్చారు. కిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ప్రేమ్ చంద్ షా తన వ్యక్తిగత హోదాలో టెండర్ దాఖలు చేశారని, అయితే ఆయన కిమ్స్‌లో పనిచేస్తుండటంతో సంస్థే బిడ్ వేసిందని పొరపాటు పడ్డామని మంత్రి వివరించారు. “ఇది కేవలం ఒక చిన్న కమ్యూనికేషన్ గ్యాప్ మాత్రమే. కిమ్స్ సంస్థ ఎలాంటి బిడ్ వేయలేదు“ అని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు, ప్రభుత్వం నాలుగు మెడికల్ కాలేజీలకు టెండర్లు పిలవగా, ఒక్క ఆదోని కాలేజీకి మాత్రమే కిమ్స్ నుంచి బిడ్ వచ్చిందని ప్రచారం జరిగింది.

## బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపు

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపొందిస్తాయని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ చిత్తరంజన్ అన్నారు. శుక్రవారం బాక్సింగ్ డే సందర్భంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని నేషనల్ ఫిట్‌నెస్ జిమ్, శివ బాక్సింగ్ క్లబ్‌లను సందర్శించారు. యువతకు ఉచిత బాక్సింగ్ శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్న కానిస్టేబుల్ నివాస్‌ను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. ముందుగా అడిషనల్ ఎస్పీ హనుమాన్ చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్లబ్‌లో శిక్షణ పొందుతున్న బాక్సర్లను పరిచయం చేసుకుని, బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు.

## ప్రజా క్షేమమే ముందు...రాజకీయాలు తర్వాత

**- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**విజయవాడ, డిసెంబర్ 26:** మాత్రమే కాదు...అసలైన రాజనీతిజ్ఞుడు. ప్రతి పక్ష నాయకుడూ ఆయన నుంచి స్ఫూర్తి పొందాలని ఏపీ డీ సీం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.. ఆయన మార్గనిర్దేశకత్వం లోనే ప్రజాక్షేమం ముందూ...రాజకీయాలు ఆ తర్వాతే అని గట్టిగా నమ్ముతున్నా...ఇదే మన ధర్మం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వాజ్‌పేయి జన్మదినం సందర్భంగా ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్ లో వ్యాఖానించారు. 'అధికారం ఆట కొనసాగుతూ ఉంటుందని, పార్టీలు వస్తాయని, పోతాయని, ప్రభుత్వాలు ఏర్పడతాయి, కూలతాయని...కానీ దేశం ఉండాలని, ఆ దేశంలో ప్రజాస్వామ్యం అమరంగా ఉండి తీరాలని వాజ్‌పేయీ 1996లో పార్లమెంట్ ప్రసంగంలో చెప్పిన మాటలు ఎప్పుడూ గుర్తుంటాయి. అవి ప్రజాస్వామ్య విలువల పట్ల మన భాధ్యతను ఎప్పుడూ గుర్తు చేస్తుంటాయి. ఆయన పోఖ్రాన్ అణుపరీక్షలతో భారత్ వ్యూహాత్మక బలాన్ని నొక్కి చెప్పారు. స్వర్ణ చతుర్భుజి, జాతీయ రహదారులతో దేశవ్యాప్తంగా అనుసంధానం పెంచారు. ఆయన ఆదర్శాలు ఇప్పటికే మార్గనిర్దేశం చేస్తున్నాయి'అని పవన్ కళ్యాణ్ కొనియాడారు.

## వీఆర్ఎస్ నిర్ణయం వెనక్కి తీసుకుంటే తీవ్ర చర్యలుంటాయని బెదిరించారు

**మాజీ ఐపిఎస్ ప్రవీణ్ ప్రకాష్ వెల్లడి**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** స్వచ్ఛంధ పదవీ విరమణ(వీఆర్ఎస్) ధరఖాస్తు వెనక్కి తీసుకుంటే తీవ్ర పరిణామాలుంటాయని అప్పట్లో తనను కొందరు బెదిరించారని మాజీ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఒక యూ ట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం చెప్పారు. 'సర్వీసు నుంచి వెళ్ళిపోయావు అదే నీకు శిక్ష. మళ్ళీ సర్వీసులోకి వస్తానని డ్రామాలు చేస్తే...తీసుకుంటాం. కానీ ఆ తర్వాత తీవ్రమైన చర్యలుంటాయి' అని కొందరు తనకు బెదిరింపు సందేశాలు పంపినట్లు ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. అయితే వారి పేర్లను ఆయన వెల్లడించలేదు. బెదిరింపులు వచ్చిన తర్వాత కూడా తాను అప్పటి సిఎస్ నీరబ్‌క ఉమార్ ప్రసాద్‌ను కలిసి తన మనసులో మాట చెప్పానని, ఆయన కూడా వద్దని సలహా ఇచ్చారని తెలిపారు. నువ్వు ధరఖాస్తు చేసినా ప్రభుత్వం తిరస్కరిస్తుందని నీరబ్‌కుమార్ తనతో చెప్పినట్లు ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. '2024లో కూటమి అధికారం లోకి వచ్చాక నాకు పోస్టింగ్ ఇవ్వలేదు. 21 రోజుల్లోనే వీఆర్ఎస్‌కి ధరఖాస్తు చేశాను. నా నిర్ణయం మా ఇంట్లో ఎవరికీ ఇష్టం లేదు. నా తల్లిదండ్రులు తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. అది చూడలేక వీఆర్ఎస్ నిర్ణయాన్ని పున :పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరాలనుకున్నాను' అని తెలిపారు.

## పిపికి కేంద్ర సాయం - ఆరోగ్యమంత్రి సత్యకుమార్‌యాదవ్

### కేంద్ర మంత్రి జెపి నడ్డాకు లేఖ

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య కళాశాలలు, ఆరోగ్య సేవల రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానానికి సహకారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది, ఈ విధానాన్ని కేంద్రం ఇప్పటికే అనుసరిస్తుంది. వైద్యరంగంలో పీపీపీ విధానం ప్రాధాన్యాన్ని, కేంద్రం అమలు చేస్తున్న పథకాల్ని వివరిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డా ఒక లేఖ రాశారు. పీపీపీ విధానంలో చేపట్టే ప్రాజెక్టుల్లో కేంద్రం మూలధన వ్యయంలో 30 నుంచి 40 శాతం వరకు , నిర్వహణ వ్యయంలో 25 శాతం వరకు నిధులుగా అందిస్తుందని వెల్లడించారు. ఇప్పటికే ఉన్న వైద్య కళాశాలల ఆధునికీకరణ, కొత్త వాటి నిర్మాణం, సహా ఆరోగ్యరంగ మౌలిక వసతుల అభివృద్ధికి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద ఈ సంవత్సరం అక్టోబరు నుంచి ఇప్పటివరకు రూ.2వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు.
ఈ రంగంలో పీపీపీ విధానాన్ని కేంద్రం ప్రోత్సహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలూ దీన్ని అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. అందులోని ముఖ్యాంశాలను వైద్య, ఆరోగ్యశాఖ మీడియాకు విడుదల చెసింది. దేశంలో ఇప్పటివరకు రూ.2వేల కోట్లతో ప్రాజెక్టులు వీజీఎఫ్ కింద ఆమోదించినట్లు ఆయన వివరించారు. వైద్య కళాశాలల నిర్మాణం, ఆసుపత్రుల అభివృద్ధి, రోగనిర్ధారణ సేవలు, సంచార వైద్యం, డయాలసిస్‌లను పీపీపీ విధానంలో ప్రారంభించామన్నారు. 20 రాష్ట్రాల్లో 919 డయాలసిస్ సెంటర్లు పీపీపీ పద్ధతిలో నడుస్తున్నాయన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా వైద్య కళాశాలల నిర్మాణం, ఆసుపత్రుల ఆధునికీకరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన క్లినికల్, నాన్‌క్లినికల్ సేవలు అందించినట్లు నడ్డా తెలిపారు.

## బాలకళాకారుల నృత్యప్రదర్శనలు అద్భుతం

**తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకృష్ణనటరాజాలయం తిరుపతి నృత్యదర్శకుడు కొండారవి నేతృత్వంలో మహతి కళాక్షేత్రంలో బాకళాకారుల నృత్యప్రదర్శనాలు అద్భుతంగా సాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం మహతి కళాక్షేత్రంలో శాస్త్రీయ జానపద నృత్యాలు ఎంతో ఆహ్లాదంగా జరిగాయి. నృత్యోత్సవాల్లో పాల్గొన్న చిన్నారులందరికీ బాలపురస్కారాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈనాటి బాలకళాకారులే రేపటి ప్రతిభగల కళాకారులుగా ఎదుగుతారని, మన సంస్కృతి సంప్రదాయాలు ఈ నృత్యోత్సవాల ద్వారా ప్రేక్షకులకు తెలియజేస్తున్నారని తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ,కెఎన్ రాజ తదితరులు పాల్గొన్నారు.

## ఆ మూడురోజులు భక్తుల రద్దీనియంత్రణ సాధ్యమేనా?

**- టోకెన్లు లేకున్నా కొండకు రమ్మని పిలుపు! - సౌకర్యాలపై కనిపించని వ్యూహాత్మక అడుగులు**

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** సాధారణరోజుల్లోనే తిరుమలకు లక్షమందివరకు భక్తులు చేరుకొంటున్న తరుణంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు మరింతమంది భక్తులు రెట్టింపుసంఖ్యలోతరలివచ్చే అవకాశం స్పష్టమవుతోంది. భారీగా భక్తులు డిసెంబర్ 30,31,జనవరి 1తేదీల్లో ఆ మూడురోజులు ప్రత్యేక పర్వదినాల్లో తిరుమలపైకి చేరుకుంటే అందరికీ దర్శనం చేయించకపోయినా కనీసం కొండంతా నిరీక్షించే భక్తజనానికి వసతి, అన్నప్రసాదాలు, తాగునీరు సౌకర్యాలు కల్పించడం మాత్రం మాటల్లోచెప్పలేనిదికాదనేది అంచనావేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ మూడురోజులు తిరుపతి అలిపిరిలోనే టోకెన్లు లేని భక్తులను కొంతవరకు నియంత్రించడం తప్పనిసరి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ యేడాధి ఆఖరులో ఆపదమొక్కులవాడు అనాథరక్షకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం భారీగా తరలిరావడంతో ఏడుకొండలు జనసంద్రంగా మారింది. వచ్చిన వారంతా ఎక్కడబడితే అక్కడ నిరీక్షిస్తుండటం, ఆలయం ముందు ప్రత్యేక షెడ్లలో తలదాచుకోవడం, ఆలయం వెలుపల క్యూలైన్లలో పడిగాపులు కాస్తుండటం కనిపిస్తోంది. ఇప్పటికే చాలావరకు వీరికి సేవలందించలేక శ్రీవారి సేవకులు, సిబ్బంది కొంత ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది మరో మూడురోజుల్లో మొదలుకానున్న పవిత్రమైన వైకుంఠ ఏకాదశి(30వతేదీ), ద్వాదశి(31న), త్రయోదశి(జనవరి 1నూతన ఆంగ్ల సంవత్సరం)రోజుల్లో ఆన్‌లైన్‌లో ఇడిప్‌లో జారీచేసిన 1.89లక్షల టోకెన్లు అందుకున్న భక్తులకు మాత్రమే ఆలయంలోనికి అనుమతిఉంటుందని టిటిడి అధికారులు ప్రకటించారు. మరీ టోకెన్లు లేకున్నా తిరుమలకు ఊహించలేనంత మంది భక్తులు తమిళనాడు, కర్నాటక తెలుగురాష్ట్రాల నుండి తరలివస్తే వారికి ఎక్కడ సదుపాయాలు కల్పించగలరనేది కూడా టిటిడి పాలకమండలి, టిటిడి అధికారులు సమాలోచనలు చేస్తున్నా సాధ్యపడదనేది టిటిడి ఉద్యోగుల వాదనలు. మరీ తొలిమూడురోజులు ఎటువంటి టోకెన్ లేని భక్తులను తిరుమలకు రమ్మని పిలవడం శుభపరిణామమే అయినా వారికి దర్శనాలు కల్పించలేమనేది స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం కూడా ఉంది. ఇందుకు తిరుపతి అలిపిరి ప్రవేశద్వారం, కాలినడక మార్గాలు, సప్తగిరి తనిఖీకేంద్రం ప్రాంతాల్లో టిటిడి ఉద్యోగులు, పోలీసులు, విజిలెన్స్‌సిబ్బంది జాగరూకతతో వ్యవహరించి భక్తులకు అవగాహన కల్పించడం ఇప్పుడు ముందున్న ప్రధాన సమస్య. మరీ అలా సామాన్యభక్తులు సంయమనంతో వ్యవహరిస్తారా అనేది కూడా టిటిడి అదికారుల్లో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో తిరుమలకు భారీగా చేరుకుంటే భక్తులు తమను దర్శనాలకు అనుమతించడంలేదని నిరసనలు తెలియజేసిన సందర్భాలు ప్రతి ఏడాది చవిచూస్తున్నవే. అలాంటిది అందరినీ తిరుమలకు రమ్మని పిలిస్తే మరీ టోకెన్ లేని భక్తులకు దర్శనాల మాటమాత్రం దేవుడెరుగని వదిలేస్తారా?లేక వ్యూహాత్మకంగా, ప్రణాళికాబద్ధంగా కదులుతారా అనేది మరో మూడురోజుల్లో తేలిపోనుంది. అయితే టిటిడి అధికారులు, పోలీసు అధికారులు కూడా ఈ ఏడాది జనవరిలో తిరుపతిలో వైకుంఠద్వార దర్శన టోకెన్లు జారీ సమయంలో చోటుచేసుకున్న అవాంఛనీయ ఘటనలతో పూర్తిగా ఆన్‌లైన్‌లోనే దర్శనం.

## బివి ఛానల్, 13 షేర్ ఛానల్ ఆధునీకరణ పనులకు రంగం సిద్ధం

**విజయనగరం , డిసెంబర్ 26 (ప్రభాతవార్త ప్రతినిధి )** గజపతినగరం నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా సాగునీటి తరలింపునకు ఇబ్బందిగా మారిన బివి ఛానల్, 13 షేర్ చానల్ ఆధునీకరణ పనులకు రంగం సిద్ధమైంది. సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కెనాల్ ఆధునీకరణ పనులను ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు పరిష్కరించేందుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి గజపతినగరం మండలం గంగచోళ్లపెంట గ్రామపంచాయతీ పరిధిలోని పట్రువాడ గ్రామం వద్ద సాగునీటిని తరలించే ఇరిగేషన్ ఛానల్ ను శుక్రవారం మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. ఇరిగేషన్ కెనాల్ అలైన్మెంట్ ను మార్చి, కెనాల్ ను ఆధునికరించి బివి ఛానల్ ద్వారా సాగయ్యే 11 వందల ఎకరాలకు, 13 షేర్ ఛానల్ ద్వారా 14 వందల ఎకరాలకు ఆయకట్టును స్థిరీకరించే ప్రయత్నాలను మంత్రి ప్రారంభించారు. ఈ రెండు చానళ్లను ఆధునీకరించడం ద్వారా ఈ ప్రాంతంలో సాగునీటి ఇబ్బందులను రూపుమాపి రెండవ, మూడవ పంటలకు సాగునీరు అందించే అవకాశం కలుగుతుందని, ఈ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి సాధించి త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

## భీమవరం నూతన డీఎస్పీగా రఘువీర్ విష్ణు బాధ్యతల స్వీకరణ

**- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో మర్యాదపూర్వక భేటీ**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సబ్‌డివిజన్ నూతన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా రఘువీర్ విష్ణు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును భీమవరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉండి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణపై రఘురామ దిశా నిర్దేశం చేశారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా, రాజీ పడకుండా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించిన వెంటనే డీఎస్పీ రఘువీర్ విష్ణు, డిప్యూటీ స్పీకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ భద్రతపై వీరి మధ్య చర్చ జరిగింది. నేరాల నియంత్రణ, పర్యవేక్షణ కోసం ఉండి నియోజకవర్గం మొత్తం సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు రఘురామ తెలిపారు. “నియోజకవర్గం మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడొద్దు“ అని డీఎస్పీకి స్పష్టం చేశారు. దీంతో పాటు భీమవరం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపైనా చర్చించారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రఘువీర్ విష్ణు గతంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)లో పనిచేశారు. అంతేకాకుండా ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళంలో భాగంగా కొసావోలో కూడా సేవలు అందించిన అనుభవం ఆయనకుంది. నిన్నటి వరకు పనిచేసిన డీఎస్పీ జయసూర్యను డీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రభుత్వం బదిలీ చేసింది .

# తిరుమల సమాచారం

## మానసిక సంతృప్తే నిజమైన సంతోషం

**- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్**



**తిరుమల, డిసెంబర్ 26ప్రభాత వార ప్రతినిధి:** మనిషికి నిజమైన సంతోషం మానసిక సంతృప్తిలోనే ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌సింగ్ భగవత్ అన్నారు. మనిషికి సుఖ దు:ఖాలు తాత్కాలికమేనని మనసుకు తృప్తిలేకపోతే ఆనందం ఉండదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఉదయం తిరుమలలో ఆలయం వద్దకు చేరుకున్న మోహన్‌భగవత్‌కు టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వాగతం పలికారు. తోలుత ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ సింఘాల్ ,అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుపతిలో జరిగే కార్యక్రమానికి విచ్చేసిన ఆర్ఎస్ఎస్ చీఫ్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని వెళ్ళారు.

## అందరిపై శ్రీవారి ఆశీస్సులుండాలి: ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే నూతన ఆంగ్ల సంవత్సరంలో కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై కలగాలని ,అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రముఖులు కోరుకున్నారు. శుక్రవారం తమిళనాడు గవర్నర్ టి.రవి, ఏపి డిజిపి హరీశ్‌కుమార్‌గుప్త, మాజీక్రికెటర్ వెంకటేశ్‌ప్రసాద్, బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్ల వేర్వేరుగా ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో వెంకన్నను దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## జనసంద్రంగా తిరుమల - సర్వదర్శనానికి 26 గంటలు



**తిరుమల,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం సెలవులు ,ధనుర్మాసంలో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులతో తిరుమల జనసంద్రంగా మారింది. శుక్రవారం ఉదయానికి భక్తులు పోటెత్తుతున్నారు. భారీగా భక్తులు దేశంనలుమూలల నుండి తరలిరావడంతో తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. ఆలయం వెలుపల క్యూలైన్లు మూడుకిలోమీటర్లు శిలాతోరణం వరకు చేరాయి. శ్రీవారి సాధారణ సర్వదర్శనానికి 26గంటలు సమయం పడుతోంది. టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 10గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఏడు గంటలు సమయం కేటాయిస్తున్నారు. పెరిగిన విపరీత రద్దీతో తిరుమలలో శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 43వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

## భారీగా పెరిగిన చికెన్, కోడిగుడ్ల ధరలు

**- డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో పెరిగిన ధరలు**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కోడిగుడ్ల ధరలు భారీగా పెరిగాయి. అదే రీతిలో కోడి మాంసం ధరలు రోజు రోజుకు ప్రియంగా మారుతున్నాయి. మార్కెట్‌లో డిమాండ్ ఒక్కసారిగా పెరగడం, ఫీడ్ ధరలు అధికమవడం, రవాణా ఖర్చులు పెరగడం వంటి కారణాలతో కోడి మాంసం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ ధరల పెరుగుదల సామాన్య ,మధ్యతరగతి ప్రజలపై ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపుతోంది. గతంతో పోలిస్తే కిలో కోడి మాంసం ధరలు గణనీయంగా పెరగగా, కోడిగుడ్ల ధరలు కూడా మరింత భారంగా మారాయి. ధరల పెరుగుదల కారణంగా మధ్యతరగతి కుటుంబాలు చికెన్ కొనేందుకు భయపడుతున్నారు. రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా పండుగలు రావడంతో చికెన్, గుడ్డుకు ఒక్కసారిగా భారీ డిమాండ్ పెరగడంతో పాటు డిమాండ్‌కు తగినంత ఉత్పత్తి లేకపోవడం వల్ల గత నెల రోజులుగా ధరలు విపరీతంగా పెరిగాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. వచ్చే నెలలో సంక్రాంతి పండుగ ఉండటంతో మరో నెల రోజుల పాటు ఈ ధరల పెరుగుదల కొనసాగవచ్చని వ్యాపార నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పవన్ కళ్యాణ్ వ్యక్తిగత హక్కులకు ఢిల్లీ హైకోర్టు రక్షణ

**- ఆయన పేరు, ఫొటో, వాయిస్‌ను వాణిజ్యపరంగా వాడొద్దని ఆదేశం**
**- ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి సంస్థలకు కీలక సూచనలు**
**- ఏఐ, డీప్‌ఫేక్‌ల ద్వారా కంటెంట్ సృష్టిపైనా ఆంక్షలు**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాత వార్తప్రతినిధి:** టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన పేరు, చిత్రం, గొంతు, వ్యక్తిగత గుర్తింపులను ఎలాంటి అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకుండా పలు ఆన్‌లైన్ సంస్థలు, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, వెబ్‌సైట్లపై మధ్యంతర ఉత్తర్వులు (యాడ్ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసింది. తన వ్యక్తిగత, ప్రచార హక్కులకు (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) భంగం కలుగుతోందని ఆరోపిస్తూ పవన్ కళ్యాణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఈ ఎక్స్‌పార్టీ ఆదేశాలు ఇచ్చింది. మూడు దశాబ్దాలుగా సినీ, రాజకీయ రంగాల్లో ఉన్న పవన్ కళ్యాణ్‌కు గణనీయమైన వాణిజ్య బ్రాండ్ విలువ ఉందని, ఆయన వ్యక్తిగత హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. పలు సంస్థలు పవన్ కల్యాణ్ అనుమతి లేకుండా ఆయన ఫొటోలతో టీ షర్టులు, కప్పులు, పోస్టర్లు వంటివి అమ్ముతున్నాయని, ఏఐ టూల్స్ ద్వారా ఆయన గొంతు, ఫొటోలను వాడుతున్నారని, సోషల్ మీడియాలో ఫేక్ పేజీలు నిర్వహిస్తున్నారని పవన్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల పవన్‌కు పూడ్చలేని నష్టం వాటిల్లుతుందని ధర్మాసనం పేర్కొంది.

ఈ నేపథ్యంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో వంటి ఈకామర్స్ వేదికల నుంచి అలాంటి ఉత్పత్తులను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. వాటిని అమ్ముతున్న విక్రయ దారుల కేవైసీ వివరాలను పిటిషనర్‌కు అందించాలని సూచించింది. పవన్ పేరును దుర్వినియోగం చేస్తున్న వెబ్‌సైట్ లింకులను వారం రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. అయితే, ఫ్యాన్ పేజీలకు మాత్రం కొన్ని షరతులతో మినహాయింపు ఇచ్చింది. అవి ఫ్యాన్ పేజీ అని స్పష్టమైన డిస్‌క్లెయిమర్ ఇవ్వాలని, లేనిపక్షంలో వాటిని కూడా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా వేసింది.

## విజయవాడ- హైదారాబాద్ జాతీయ రహదారిపై భారీ రద్దీ

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాత వార్తప్రతినిధి:** క్రిస్మస్ సెలవులు ముగియడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి భారీ ట్రాఫిక్ రద్దీతో నిండిపోయింది. క్రిస్మస్ అనంతరం ఆఫీసులు, కాలేజీలు, పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో ఒకేసారి లక్షలాది మంది హైదరాబాద్ వైపు ప్రయాణం చేయడంతో రహదారిపై వాహనాల ఒత్తిడి విపరీతంగా పెరిగింది. ప్రత్యేకంగా పంతంగి, చౌటుప్పల్, కోర్లపాడు టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. నేషనల్ హైవే 65పై ఔటర్ రింగ్ రోడ్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, చౌటుప్పల్ వరకు ట్రాఫిక్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ సమీపంలో ఫ్లైవోరు దిగువన.

గొల్లపూడి ఎ1 సెంటర్, ఇబ్రహింపట్టణం రింగ్‌సెంటర్, కీసర టోల్‌ప్లాజా, గట్టుభీమవరం టోల్‌ప్లాజా దగ్గర వాహనాలు నిలిచాయి. కొన్ని ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు కదలని పరిస్థితి నెలకొంది.

# తిరుప్పావై

## 12వ పాశురము



కన్నైత్తిళం కత్తెరుమై కన్ఱుక్కిరంగి,
నినైత్తు ములైవళియే నిన్ఱుపాల్ శోర
ననైత్తిల్లమ్ శేఱాక్కుమ్ నచ్చెల్వన్
తంగాయ్!
పనిత్తలై వీళనిన్ వాశల్ కడైపత్తి
శినత్తినాల్ తెన్నిలంగై క్కోమానై చ్చెత్త
మనత్తుక్కినియానై ప్పాడవుమ్
నీవాయ్ తిఱవాయ్
ఇనిత్తానెళున్దిరాయ్ ఈదెన్న
పేరుఱక్కమ్
అనైత్తిల్లత్తారు మఱిన్దేలో
రెమ్బావాయ్

గేదెలు పాలు పితుకువారు లేకపోవుటచేత బేగ. దూడలను తలుచుకొని, దూడలు పాలుతాగుతున్నట్లు ఊహించుకొని, పొదుగులనుండి పాలు కార్చుటచేత, ఇల్లంతా బురద అయినది. అటువంటి గేలు సంపదయున్న ఓ గోపకుడిని చెల్లెలు ఈ రోజు గోపిక, "పైనుంచి మంచు కురుస్తున్నది. మీ ఇంటిద్వారము పట్టుకొని నిలబడి యున్నాము. దక్షణనున్న లంకాధిపతియైన రావణుని చంపిన మనోభిరాముడు శ్రీరాముని గానము చేయుచున్నాను. ఇకనైనవారు మాట్లాడవా? ఏమియు గాఢని? అనుచు వెలు పలి గోపికలు లోపల ఉన్న ఆ గోపికను మేల్కొలుపు తున్నారు.

ఫలం: "అష్టాక్షరి మంత్రం చదివిన ఫలితం లభిస్తుంది"

# మురిపిస్తున్న 'రెట్రో' అందాలు




ేతరం నాయికలు ట్రెండ్ల వెనకాలే పరుగెత్తట్లేదు. ఒకప్పటి కట్టూ, బొట్టుకీ ఓటేస్తున్నారు. అలనాటి తారల చీరకట్టు, కొప్పులను రీక్రియేట్ చేస్తూ రెట్రో లుక్ ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. తాజాగా నటి కీర్తి సురేశ్ తన కొత్త సినిమా ప్రమోషన్‌లో భాగంగా 90లో నటిమణులు ధరించిన పోల్కా డాట్ హెడ్ స్కార్ఫ్‌ను ధరించింది. ఆ వింటేజ్ లుక్ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్లో పంచుకుంది. అవి అమ్మాయిలను తెగ ఆకట్టుకుంటున్నాయి. ఈమె కన్నా ముందే... దీపికా పదుకొన్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో రెట్రో లుక్‌తో తలకు హెడ్బ్యాండ్ ధరించి, రెడ్ కార్పెట్పై హుయలొలికించింది. ఇంకేం ఈ హెడ్ బ్యాండ్లు, స్కార్ఫ్ ల మీద అమ్మాయిలు మనసు పారేసుకుంటున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు, వీడ్కోలు పార్టీలు, ఫ్యాషన్ వాక్ ల్లో వీటిని ధరించి రెట్రో లుక్‌లో మెరిసిపోతున్నారు.

# చీరెకట్టు ఓ కనికట్టు !



అతివల అందాన్ని ఇనుమడింప చేసే చీరల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. సాంప్రదాయ వస్త్ర ధారణలో చీరలకు నిండైన నిర్వచనం ఉంది. నిండుగా చీరకట్టుకుంటే ఎంతో గౌరవప్రదంగా ఉంటుందనే భావన అందరిలోనూ ఉంది. కాగా ఇప్పుడు ఆధునిక యుగంలోకి ప్రవేశించాము. అయినా చీరకున్న విలువ ఏ మాత్రం తగ్గలేదు. చీర కట్టు తెచ్చే అందం జగనేకృతంగా ఉంటుందని శోభాయమానంగా ఉంటుందని ప్రతి ఒక్కరు అనుకోబట్టే అంతర్జాతీయ చీరల దినోత్సవం జరుపుకోవడం కూడా కద్దు. చీర ధారణలో హుందాతనం కనిపిస్తుంది. గౌరవభావాన్ని పెంచుతుంది. పెద్ద పదవుల్లో ఉన్న స్త్రీలు సైతం చీరలు కట్టుకుంటే ఆ పదవికే నిండుదనం వస్తుంది. చీరలు, ఎన్నో రకాలలో, రంగుల్లో, డిజైన్లలో దొరుకుతాయి. అందుకేనేమో! మన జాతీయ ట్రెడిషనల్ వియర్ గా చీరకి ఘనమైన గుర్తింపు లభించింది. స్త్రీల అందాన్ని మరింత పెంచుతుంది ఈ వస్త్రధారణ. సాహిత్యంతోనూ చీరల అందాన్ని సాహిత్య వేదికగా ఎంతో మంది భావ కవులు అభివర్ణించిన పద్యాలు, పల్లె పదాలు, గేయాలు మనకు తెలిసినవే. పట్టుచీరలు సిల్క్ సారీస్ కాటన్ చీరలు నేత చీరలు ఫ్యాన్సీ చీరలు.. ఇలా ఎన్నో.. పండుగలు, వచ్చినప్పుడు ఆధ్యాత్మిక భావం ఉన్నప్పుడు కూడా చీరలో పట్టుచీరలు నిర్వహించడం తెలుగువారి సంప్రదాయం. చీరల ధారణతో 80 ప్రయోజనాలున్నాయని ఒక పరిశీలకుడు తన చీరల పరిశోధనలో తెల్చి చెప్పాడు అందులో కొన్ని ఇంటికి వచ్చిన బంధు ముత్తయిదువకు చీరపెట్టి పంపితే పుణ్యం. అదొక సాంప్రదాయం. పసి పిల్లలు చీరకొంగును నోట్లో పెట్టుకొని పడుకుంటారు. ఉయ్యాల, అడ్డుతెరలకు చీరలు బాగా ఉపయోగ పడతాయి. ఎప్పుడూ తల్లి చీర కొంగును పట్టుకుని ఆడుకునే పసివారిని కొంగుచాటు కృష్ణుడు అని కృష్ణునితో పోలుస్తారు.. చీరల షాపింగ్ మాల్స్ లలో చీరల షాపింగ్ మంచి టైం పాస్.. ధరలలో రెండువందల నుంచి 50 వేలు లక్ష రూపాయల వరకూ చీరలు లభిస్తాయి. ఫేమస్ బ్రాండ్ చీరలు అనేకం. ఇలా ఎంతైనా చెప్పొచ్చు చీరల గొప్పతనం గురించి. నేటి యువతరం నవతరపు ఆడపడుచుల్లో చీర ప్రాముఖ్యత, ప్రాధాన్యత తెలిపేందుకు 2021 నుంచి ఏటా డిసెంబరు నెలలో చీరల దినోత్సవం జరుపుకుంటున్నాను. దీని ప్రేరణ ఎవరైనా మనింటి అమ్మాయిలకి కూడా చీరలోని గొప్పతనం వివరించి చెప్పడం మంచి సంప్రదాయం ◻

# రంగవల్లి



- ఎ.మహాలక్ష్మి
బెంగళూరు

16 చుక్కలు
8వరుసలు ఇటు
అటు వదిలి 8 వరకు



# టమాటా కెచప్



కావాల్సినవి : టమాటాలు–కిలో, చిన్నగా తరిగిన అల్లం వెల్లుల్లి, ఉల్లిపాయ–1, రెడ్ చిల్లీ పౌడర్, యాలకుల పొడి–చెంచా, మిరియాల పొడి–అరచెంచా, చక్కెర–2 చెంచాలు ఉప్పు–చెంచా, వెనిగర్–3 చెంచాలు.

తయారీ : టమాటాలు, అల్లం వెల్లుల్లి, ఉల్లిపాయ చిన్నగా తరిగి మిక్సీ పట్టుకోవాలి. ఆ మిశ్రమాన్ని కడాయిలోకి తీసుకుని పది నిమిషాలు సన్నని ఉడికిస్తూ చక్కెర, ఉప్పు, వెనిగర్, రెడ్‌చిల్లీ పౌడర్, యాలకుల పొడి, మిరియాల పొడి వేసి మరో పది నిమిషాలు ఉడకనివ్వాలి. కాసేపయ్యాక ఈ మిశ్రమాన్ని పడకడితే కెచప్ సిద్ధం.



## ముగ్గులకు ఆహ్వానం

మా చిరునామా ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్–80 Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

ఆరోగ్య భాగ్యం

# బీర ఆకు ప్రయోజనం-2




దీన్ని ట్రెడిషనల్ మెడిసన్‌గా బీరాకుల్ని గాయాలు, వాపులు, పుండ్లపై వేసి కట్టుకట్టడం మంచి ఫలితముంటుంది. ఇది గ్యాస్ట్రయిటిస్, అల్సర్లు, పెద్ద పేగుల్లో వచ్చే వ్యాధులపై పనిచేయడం వల్ల దీన్ని పక్వాశయశోధిని అంటారు. లివర్, స్ప్లీన్ (ప్లీహం) వాపులు, వ్యాధులున్నప్పుడు, కామెర్లు, వచ్చినప్పుడు దీని కషాయం తాగితే త్వగా తగ్గుతుంది. ఇది కడుపుకి బలాన్ని కల్గించే జీర్ణకారి విరేచనకారి ఇది వేడి తగ్గించి చలువ చేస్తుంది. ఆరోగ్యానికి మంచిది. ఆహార పదార్థాల్లో ఉండే విషపదార్థాల్ని తగ్గిస్తుంది. ఇది కఫాన్ని, వేడినీ, వాతాన్ని హరించే గుణం ఈ ఆకులకి ఉంది,. శరీరానికి పట్టు వీరుని, రక్త దోషాల్ని, కడుపులో ఎసిడిటీని తగ్గిస్తుంది. బీరాకులతో పప్పుచేసుకుంటే కమ్మగా ఉంటుంది. బీర వల్ల ఎటువంటి వాసన, చేదు కాని ఉండదు. దీన్ని పులుసు, పచ్చడి, పెరుగుపచ్చడి, తాలింపు చేసుకోవచ్చు. బీరకుల్ని మెత్తగా నూరి నీళ్ళలో వేసి బాగా మరిగించి వడకట్టుకుని తాగితే వేడి తగ్గించి, కడుపులో వచ్చే గడ్డల్ని కరిగించే గుణం దీనికుండి. బీరాకుల్లో శరీరంలో కొలెస్ట్రాల్‌ని తగ్గించే ఆంటి ఆక్సిడెంట్స్, మినరల్స్, విటమిన్స్ ఉండి రక్తపోటుని తగ్గించి కారినడయో వాస్కులాల్ వ్యాధులు రాకుండా కాపాడుతుంది. బీరాకుల్లోపి ఫైటోన్యూట్రియాట్స్ వల్ల దయాబెటీస్ తగ్గుతుంది. బీరాకుల రసంలో తేనె కలిపి త్రాగితే మలబద్ధకం, మొలలు దీనిలో అధిక సెల్యులోజ్ ప్రభావం వల్ల తగ్గుతుంది, ముదురు ఆకు పచ్చరంగులోని ఐరన్, బి6, మినరల్స్ వల్ల రక హీనతకు, కంటిచూపుకు (బీటాకెరోటిన్) మంచిది బీర ఆకుల్ని మెత్తగా నూరి రసం తీసి కళ్ళలో వేస్తే కంటిలో మంటలు, కండ్లకలక, తగ్గుతుంది. బీటాకెరోటిన్ వల్ల కంటిచూపు మెరుగవుతుంది. చల్లని వాతావరణంలో వర్షాకాలంలో ఎక్కువగా పండే బీరాకుల్ని పుదీనాలో కలిపి నీళ్ళలో వేసి మరిగించి ఆవిరి పడితే దగ్గు, జలుబు, లింఫ్‌గ్రంధుల వాపు తగ్గి, గొంతు మృదువుగా మారుతుంది. లేతబీరాకు, బీరపొట్టు జ్వరం పడి లేచిన వారికి హితవుగా ఉంటుంది. బీరాకుల్ని మజ్జిగలో, సుగంధద్రవ్యాలు కలిపి వంటలు చేసుకోవడం మంచిది. ◻




డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# 'నేను రెడీ' సాంగ్ షూట్ పూర్తి



'నువ్విలా', 'జీనియస్' 'రామ్ లీల', 'సెవెన్' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో హవిష్, దర్శకుడు త్రినాధ రావు నక్కినతో జతకట్టారు. 'సినిమా చూపిస్తా మామ', 'నేను లోకల్', 'ధమాకా, 'మజాకా' వంటి విజయవంత మైన చిత్రాలను అందించిన త్రినాధ రావు నక్కిన 'నేను రెడీఖి చిత్రాన్ని పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కిస్తున్నారు. హార్నిక్స్ ఇండియా లిలిశ బ్యానర్‌పై నిఖిల కొనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కావ్య థాపర్ కథానాయిక గా నటిస్తోంది. చిత్ర బృందం క్రిస్మస్ సందర్భంగా ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో హవిష్ చాలా హుందాగా, అదే సమయంలో ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్నారు. చక్కగా దువ్విన జుట్టు, ట్రిమ్ చేసిన గడ్డం, నల్లటి అద్దాల కళ్ళజోడు అతనికి ఒక సీరియస్ లుక్ ఇచ్చాయి. ముదురు రంగు ప్యాంటులో ఇన్ చేసిన చెక్ షర్ట్, ఐడీ కార్డు, భుజంపై వేలాడుతున్న బ్రౌన్ కలర్ ఆఫీస్ బ్యాగ్‌తో అతని లుక్ మిడిల్ క్లాస్ మ్యాన్ లా వుంది. అతని నిలబడిన తీరు యాక్షన్ కి సిద్ధంగా ఉన్నట్లు వుంది. నవ్వులు పూయించే వినోదాత్మక చిత్రాలను అందించడంలో పేరుగాంచిన దర్శకుడు త్రినాధ రావు నక్కిన, హవిష్‌ను మల్టీ లేయర్స్ వున్న హ్యూమర్ రోల్ లో చూపిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శర వేగంగా జరుగుతోంది. హైదరాబాద్‌లో సుదీర్ఘ షెడ్యూల్ పూర్తి చేసుకున్న తర్వాత, చిత్ర బృందం నిన్న పాండిచ్చేరిలో హీరో హీరోయిన్ల పై చిత్రీకరించిన సాంగ్ షూట్ పూర్తి చేసింది, ఈ పాటకు విజయ్ పోలాకి మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. సాంగ్ అద్భుతంగా వచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.

# 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' స్పెషల్ పోస్టర్



మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నువ్విలా', 'జీనియస్' 'రామ్ లీల', 'సెవెన్' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో హవిష్, దర్శకుడు త్రినాధ రావు నక్కినతో జతకట్టారు. 'సినిమా చూపిస్తా మామ', 'నేను లోకల్', 'ధమాకా, 'మజాకా' వంటి విజయవంత మైన చిత్రాలను అందించిన త్రినాధ రావు నక్కిన 'నేను రెడీఖి చిత్రాన్ని పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కిస్తున్నారు. హార్నిక్స్ ఇండియా LLP బ్యానర్‌పై నిఖిల కొనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. చిత్ర బృందం క్రిస్మస్ సందర్భంగా ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో హవిష్ చాలా హుందాగా, అదే సమయంలో ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్నారు. చక్కగా దువ్విన జుట్టు, ట్రిమ్ చేసిన గడ్డం, నల్లటి అద్దాల కళ్ళజోడు అతనికి ఒక సీరియస్ లుక్ ఇచ్చాయి. ముదురు రంగు ప్యాంటులో ఇన్ చేసిన చెక్ షర్ట్, ఐడీ కార్డు, భుజంపై వేలాడుతున్న బ్రౌన్ కలర్ ఆఫీస్ బ్యాగ్‌తో అతని లుక్ మిడిల్ క్లాస్ మ్యాన్ లా వుంది. అతని నిలబడిన తీరు యాక్షన్ కి సిద్ధంగా ఉన్నట్లు వుంది. నవ్వులు పూయించే వినోదాత్మక చిత్రాలను అందించడంలో పేరుగాంచిన దర్శకుడు త్రినాధ రావు నక్కిన, హవిష్‌ను మల్టీ లేయర్స్ వున్న హ్యూమర్ రోల్‌లో చూపిస్తున్నారు.


తెర

# 'రాజా సాబ్' రాజే యువరాజే సాంగ్ రిలీజ్



రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్ లో రూపొందుతున్న క్రేజీ మూవీ "రాజా సాబ్" టీమ్ ప్రేక్షకులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసింది. క్రిస్మస్ పండుగ సందర్భంగా ఈ చిత్రం నుంచి ఖిరాజే యువరాజే..' పాట ప్రోమోను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ ప్రోమోలో ప్రభాస్ క్రిస్మస్ పండుగ సెలబ్రేషన్స్ కోసం ఏర్పాట్లు చేయడం, చర్చికి వెళ్లి నిధి అగర్వాల్ తో ప్రేయర్ చేయించుకోవడం చూపించారు. ఈ సాంగ్ ప్రోమో ద్వారా క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ విశెస్ చెప్పడం యాప్ట్ గా ఉంది. త్వరలోనే ఈ సాంగ్ ఫుల్ వెర్షన్ రిలీజ్ చేయబోతున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న "రాజా సాబ్" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా "రాజా సాబ్"ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. ఈ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో అన్ కాంప్రమైజ్డ్ గా నిర్మిస్తున్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. "రాజా సాబ్" రిలీజ్ కోసం రెబల్ ఫ్యాన్స్ తో పాటు వరల్డ్ వైడ్ ఆడియెన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'గత వైభవం' తెలుగులో రిలీజ్



గ్రాండ్ ఫాంటసీ విజువల్ వండర్ 'గత వైభవం' గత నెలలో కర్ణాటక వ్యాప్తంగా థియేటర్లలో విడుదలై భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఎస్ఎస్ దుష్యంత్, ఆషిక రంగనాథ్ నటించిన ఈ చిత్రానికి సునీ దర్శకత్వం వహించడమే కాకుండా, దీపక్ తిమ్మప్పతో కలిసి ఈ ప్రాజెక్ట్‌కు సహ నిర్మాతగా కూడా వ్యవహరించారు. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్‌తో కలిసి సునీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం ఇప్పుడు గ్రాండ్‌గా తెలుగులో విడుదల కావడానికి సిద్ధమవుతోంది. కె. నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి నేతృత్వంలోని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని జనవరి 1న తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేయనుంది. ఇది న్యూ ఇయర్ కి స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలవనుంది. ఈ అనౌన్స్మెంట్ ని ఒక అద్భుతమైన పోస్టర్ ద్వారా రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో చూపించినట్లుగా కథ నాలుగు విభిన్న కాలాలలో సాగుతుంది.

# 'జెట్లీ' వెన్నెల కిషోర్ ఫస్ట్ లుక్



టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా ఖిజెట్లీఖితో అలరించబోతున్నారు. మేకర్స్ ముందుగా రిలీజ్ చేసిన పోస్టర్స్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. క్లాప్ ఎంటర్టైన్మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్న జెట్లీని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు. మేకర్స్ క్రిస్మస్ విషెస్ అందిస్తూ ఈ సినిమా నుంచి వెన్నెల కిషోర్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. విమానం విండో సీట్ దగ్గర వెన్నెల కిషోర్ కూర్చుని స్టైలిష్ హెయిర్‌స్టైల్‌తో కాన్ఫిడెంట్‌గా చూస్తున్న లుక్ ఆకట్టుకుంది. వెన్నెల కిషోర్ చేతిలో వున్న సినిమా సుదోకు బుక్ రితేష్ రానా మార్క్ ఫన్ తో అలరించింది. రితేష్ రానా అద్భుతమైన నేరేషన్, క్లాప్‌ఎంటర్‌టైన్‌మెంట్ విజన్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యాకింగ్.. అన్నీ కలిసి ˇజెట్లీ అద్భుతమైన ఎంటర్‌టైనర్ కానుంది. జెట్లీ తో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. రితేష్ రానా గత హిట్లకు పని చేసిన కోర్ టెక్నికల్ టీం ఈ సినిమాకి వర్క్ చేస్తుంది. సంగీతం కాల భైరవ, సినిమాటోగ్రఫీ సురేష్ సరంగం, ఎడిటింగ్ కార్తిక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైన్ నార్ని శ్రీనివాస్.

# రికార్డులు క్రియేట్ చేసిన 'శంబాల'



ఆది సాయి కుమార్ కెరీర్‌లోనే ది బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగాˇశంబాల్థ నిలిచింది. పాజిటివ్ మౌత్ టాక్‌తో షోలు, స్క్రీన్‌లు పెరుగుతూనే ఉన్నాయి. ఈ క్రిస్మస్ సీజన్‌ను ˇశంబాల్థ అద్భుతంగా వాడుకుంటోంది. ప్రీమియర్ల నుంచి మొదలైన పాజిటివ్ టాక్ డే వన్‌కి రెండు తెలుగు రాష్ట్రాల్లోకి వ్యాపించింది. ప్రస్తుతం ఈ మూవీ బ్లాక్ బస్టర్ దిశగా దూసుకుపోతోంది. ఈ చిత్రం ఆరంభం, కలెక్షన్లలో వస్తున్న పెరుగుదల చూసి ట్రేడ్ వర్గాలు ఆశ్చర్యపోతోన్నాయి. లిమిటెడ్ స్క్రీన్లలో రిలీజ్ చేసిన ఈ చిత్రం ఇప్పుడు ఫుల్ డిమాండ్‌తో దూసుకుపోతోంది. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ చిత్రం మంచి అంచనాలతోనే ఆడియెన్స్ ముందుకు వచ్చింది. కంటెంట్ మీదున్న నమ్మకంతో రిలీజ్‌కు రెండ్రోజుల ముందు నుంచీ ప్రీమియర్లు వేస్తూ వచ్చారు. అలా వేసిన ప్రీమియర్ల నుంచి పాజిటివ్ టాక్ రావడం, డే వన్‌కి అది మరింతగా పెరగడంతో అన్ని చోట్లా షోలు హౌస్ ఫుల్స్ అయ్యాయి. పైగా సినిమాకు డిమాండ్ పెరగడంతో అన్ని ఏరియాల్లోనూ షోలు, స్క్రీన్‌లను పెంచేశారు. నగరాల్లోని మల్టీప్లెక్స్‌లు మాత్రమే కాకుండా చిన్న చిన్న సెంటర్లలోని సింగిల్ స్క్రీన్లలో సైతం హౌస్ ఫుల్ బోర్డులు పడ్డాయి. మంచి ఆక్యుపెన్సీతో దూసుకుపోతోన్న ఈ మూవీ డే వన్ ప్రపంచవ్యాప్తంగా 3.5 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసింది. ఇక రెండో రోజు నుంచి అన్ని చోట్లా స్క్రీన్లను పెంచేసిన సంగతి తెలిసిందే. ఇది కేవలం ఆరంభం మాత్రమే అని, రానున్న రోజుల్లోˇశంబాల్థ మరిన్ని రికార్డులు క్రియేట్ చేస్తుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద ఈ మూవీని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు సంయుక్తంగా నిర్మించారు. ఈ మూవీకి ప్రవీణ్ కె బంగారి విజువల్స్, శ్రీ చరణ్ పాకాల ఆర్ఆర్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

# విజయ్ హజారే ట్రోఫీలో.. అత్యధిక పరుగుల హీరోలు


అంకిత్ బావ్నే


దినేష్ కార్తిక్


మనీష్ పాండే


మయాంక్ అగర్వాల్


ప్రియాంక్ పంచల్

## అసాధారణ ప్రదర్శనలో బ్యాట్స్‌మన్

**న్యూఢిల్లీ:** ఈ మధ్య విజయ్ హజారే ట్రోఫీ వార్తల్లో నిలుస్తోంది. టీమిండియాకు చెందిన ఇద్దరు స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఈ టోర్నమెంట్‌లో ఆడుతున్నారు. ఇద్దరూ తమ తొలి మ్యాచ్‌లలో సెంచరీలు సాధించి, టోర్నమెంట్ ఉత్సాహాన్ని పెంచారు. కానీ ఈ టోర్నమెంట్ చరిత్రలో టాప్ ఐదుగురు అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు ఉన్నారు. ఈ జాబితాలో మహారాష్ట్ర బ్యాట్స్‌మన్ అంకిత్ బావ్నే అగ్రస్థానంలో ఉన్నాడు. అతను 95 మ్యాచ్‌ల్లో 56 సగటుతో 4,055 పరుగులు చేశాడు. అయితే అంకిత్ భారత సీనియర్ జట్టు తరపున ఏ ఫార్మాట్‌లోనూ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. లిస్ట్ ఎ క్రికెట్‌లో, అతను 127 మ్యాచ్‌ల్లో 4,695 పరుగులు చేశాడు. భారత మాజీ వికెట్ కీపర్ బ్యాట్స్ మాన్ దినేష్ కార్తీక్ రెండవ స్థానంలో ఉన్నాడు. అతను 79 ఈ ట్రోఫీ మ్యాచ్‌ల్లో 56 సగటుతో 3,433 పరుగులు చేశాడు. దినేష్ 260 మ్యాచ్‌లు ఆడి 7,603 పరుగులు చేసిన విస్తృతమైన లిస్ట్ ఎ క్రికెట్ అనుభవాన్ని కూడా కలిగి ఉన్నాడు. ఇక టీమిండియా మాజీ ఆటగాడు మనీష్ పాండే మూడో స్థానంలో ఉన్నాడు. అతను 103 హజారే ట్రోఫీ మ్యాచ్‌ల్లో 3,403 పరుగులు చేశాడు. సగటున 45. లిస్ట్ ఎ క్రికెట్‌లో అతను 192 మ్యాచ్‌ల్లో 6,310 పరుగులు చేశాడు. సగటున 45 కంటే కొంచెం ఎక్కువ. గుజరాత్‌కు చెందిన ప్రియాంక్ పంచల్ ఈ జాబితాలో నాల్గవ స్థానంలో ఉన్నాడు. ఈ ట్రోఫీలో అతను 83 మ్యాచ్‌ల్లో 3,395 పరుగులు చేశాడు, సగటున 43. లిస్ట్ ఎ క్రికెట్‌లో, అతను 97 మ్యాచ్‌లు ఆడి 3,672 పరుగులు చేశాడు. సగటున 41. ఆసక్తికరంగా, అంకిత్ లా ప్రియాంక్ కూడా భారతదేశం తరపున ఏ ఫార్మాట్‌లోనూ ఆడలేదు. చివరిగా మయాంక్ అగర్వాల్ ఐదో స్థానంలో ఉన్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో 72 మ్యాచ్‌ల్లో 3,390 పరుగులు చేశాడు. సగటున 52. మయాంక్ ఐదు వన్డేలతో సహా మొత్తం 124 లిస్ట్ ఎ మ్యాచ్‌లు ఆడాడు. లిస్ట్ ఎ క్రికెట్‌లో దాదాపు 50 సగటుతో 5,670 పరుగులు చేశాడు మరియు 18 సెంచరీలు కూడా చేశాడు.



## న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు..
# కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

**న్యూఢిల్లీ:** స్వదేశంలో న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత్ జట్టును జనవరి మొదటి వారంలో భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రకటించనుంది. అజిత్ ఆగార్కర్, గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ జనవరి 3 లేదా 4న వర్చువల్‌గా సమావేశం కానుంది. ఇందులో కివీస్‌తో వన్డేల కోసం భారత్ జట్టును ఖరారు చేయనుంది. కాగా గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తిరిగి రీ ఎంట్రీ ఇవ్వడం దాదాపు ఖాయమైంది. కివీస్‌తో వన్డే సిరీస్‌లో జట్టును నడిపించేందుకు గిల్ సిద్ధమైనట్లు సమాచారం. సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ మధ్యలో గాయం కారణంగా వైదొలగిన గిల్ వన్డేలకు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానంలో కేఎల్ రాహుల్ జట్టు పగ్గాలను చేపట్టాడు. అనంతరం గిల్ తిరిగి టి20 సిరీస్‌కు అందుబాటులో వచ్చాడు. అయితే నాలుగో టి20కి ముందు గిల్ మరోసారి గాయం బారిన పడ్డాడు. దీంతో చివరి రెండు టి20లకు కూడా అతడు దూరమయ్యాడు. అనంతరం టి20 వరల్డ్ కప్ 2026 జట్టులో గిల్ చోటు దక్కించుకోలేకపోయాడు. కానీ గిల్ మాత్రం ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. ఇప్పుడు విజయ్ హజారే ట్రోఫీ కోసం మొహాలీలో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. అయితే వన్డే జట్టు పగ్గాలను చేపట్టాక గిల్ పెద్దగా రాణించలేకపోయాడు. ఆసిస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ విఫలమయ్యాడు. దీంతో తన రీ ఎంట్రీలో న్యూజిలాండ్‌పై సత్తా చాటాలని శుభ్‌మన్ ఉవ్విళ్లూరుతున్నాడు. న్యూజిలాండ్‌తో వన్డేలకు భారత్ జట్టులో శుభమన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, రిషబ్ పంత్, నితీష్ కుమార్‌రెడ్డి, అక్షర్‌పటేల్, తిలక్ వర్మ ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

## ఇంగ్లండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లో..
# నిప్పులు చెరిగిన బౌలర్లు
### ఒకే రోజు 20 వికెట్లు



**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో బౌలర్లు నిప్పులు చెరిగారు. శుక్రవారం ప్రారంభమైన ఈ బాక్సింగ్ డే టెస్ట్‌లో ఇరు జట్ల పేసర్లు చెలరేగడంతో తొలి రోజే 20 వికెట్లు నేలకూలాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 45.2 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. మైఖెల్ నెసర్(35), ఉస్మాన్ ఖవాజా(29), అలెక్స్ క్యారీ(20) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్(5/45) 5 వికెట్లతో చెలరేగగా, గస్ అట్కిన్సన్(2/20) 2 వికెట్లు పడగొట్టాడు. బెన్ స్టోక్స్, బ్రైడన్ కార్స్‌కు చెరో వికెట్ దక్కింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 29.5 ఓవర్లలో 110 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్(41), బెన్ స్టోక్స్(16), గస్ అట్కిన్సన్(28) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. జాక్ క్రాలీ(5), బెన్ డకెట్(2), జాకోబ్ బెతెల్(1), జో రూట్(0), జేమీ స్మిత్(2), విల్ జాక్స్(5), బ్రైడన్ కార్స్(4) తీవ్రంగా నిరాశపర్చారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మైఖెల్ నెసర్(4/45) 4 వికెట్లు తీయగా, మిచెల్ స్టార్క్(2/23) 2 వికెట్లు పడగొట్టాడు. స్కాట్ బోలాండ్(3/30) 3 వికెట్లు తీయగా, కామెరూన్ గ్రీన్ ఒక వికెట్ పడగొట్టాడు. 42 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక ఓవర్‌లో వికెట్ నష్టపోకుండా 4 పరుగులు చేసింది. కాగా ఇప్పటికే ఈ సిరీస్‌ను ఆసీస్ 3-0తో కైవసం చేసుకుంది. చివరి రెండు టెస్ట్‌లను కూడా గెలిచి క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో ఉంది.




## గుజరాత్‌పై కోహ్లీ 77, రోహిత్ గోల్డెన్ డక్

**న్యూఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ ఎలైట్ గ్రూప్ సి మ్యాచ్‌లో ఉత్తరాఖండ్‌తో జరిగిన ముంబై ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గోల్డెన్ డక్‌గా అవుటయ్యాడు. శుక్రవారం జరిగిన మ్యాచ్ మొదటి ఓవర్ చివరి బంతికి కుడిచేతి వాటం మీడియం పేసర్ ఆకాష్ మధ్వాల్ బోరా బౌలింగ్‌లో రోహిత్ డీప్ ఫైన్ లెగ్ వద్ద క్యాచ్ పొందాడు. జగ్మోహన్ నాగర్కోటి తన తొలి ప్రయత్నాన్ని విఫలమైన తర్వాత రెండోసారి క్యాచ్‌ను పట్టుకున్నాడు. ఇంతకు ముందు ముంబై తరఫున ఏడు సంవత్సరాల తర్వాత ఆడిన తొలి విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో రోహిత్ సిక్కింపై 62 బంతుల్లో సెంచరీ సాధించి, దేశీయ క్రికెట్‌లోకి సంచలనాత్మక పునరాగమనం చేశాడు. ముంబై జట్టు విజయవంతమైన ఛేజింగ్‌లో అతను 98 బంతుల్లో 155 పరుగులు చేశాడు. అయితే ఈ సారి విఫలం చెందాడు.
మరోవైపు, విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరపున తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించిన విరాట్ కోహ్లీ బెంగళూరులో గుజరాత్ ఎలైట్ గ్రూప్ డి మ్యాచ్‌లో 77 పరుగులు చేశాడు. కోహ్లీ ఇన్నింగ్స్ 14 బౌండరీలతో నిండి ఉంది. అర్పిత్ రాణాతో కలిసి రెండో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యాన్ని, నితీష్ రాణాతో కలిసి 24 పరుగుల భాగస్వామ్యాన్ని, ఆ తర్వాత రిషబ్ పంత్‌తో కలిసి 10 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆ తర్వాత 22వ ఓవర్‌లో విశాల్ జైస్వాల్‌కు బలయ్యాడు. ఇంతకు ముందు మ్యాచ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆంధ్రప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ తరపున ఆడుతున్న కోహ్లీ, జట్టు 299 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తన మొదటి పరుగుతో 16 వేల లిస్ట్ ఎ పరుగుల మైలురాయిని చేరుకున్నాడు.

## వరల్డ్ టెన్నిస్ లీగ్‌లో..
# విజయానికి చేరువలో ఆస్ట్రేలియన్



**న్యూఢిల్లీ:** దక్షిణేశ్వర్ సురేష్ నాయకత్వంలో ఆస్ట్రేలియన్ మావెరిక్స్ కైట్స్ జట్టు వరల్డ్ టెన్నిస్ లీగ్ విజయానికి చేరుకుంది. అలాగే తెలంగాణ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. శుక్రవారం జరిగిన వరల్డ్ టెన్నిస్ లీగ్ యొక్క నాల్గవ ఎడిషన్‌ను ఎఇఎస్ ఈగల్స్‌ను 22-19 తేడాతో ఓడించి గెలుచుకున్న ఆస్ట్రేలియన్ మావెరిక్స్ కైట్స్ తరపున దక్షిణేశ్వర్ కీలకమయ్యాడు. ముందు ఆస్ట్రేలియన్ మావెరిక్స్‌కు చెందిన భారత ఆటగాడు దక్షిణేశ్వర్ తన స్వదేశీయుడు సుమిత్ నాగల్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లోకి అడుగుపెట్టాడు. దక్షిణేశ్వర్ తన జట్టుకు 15-13 ఆధిక్యానికి చేర్చే బాధ్యతను తీసుకున్నాడు. 25 ఏళ్ల ఈ యువకుడు చక్కటి సెట్‌ను ఆడటంతో టైబ్రేక్‌తో నాలుగు పాయింట్లకు గెలిచింది. కాగా దక్షిణేశ్వర్ ఆడిన మూడు మ్యాచ్‌లలో రెండింటిలో గెలిచాడు. మొదటి రెండు రౌండ్ రాబిన్ మ్యాచ్‌లలో ఓడిపోయిన తర్వాత తక్కువ తేడాతో ఫైనల్‌లోకి ప్రవేశించిన జట్టును తన ఆధిక్యంలో ఉంచుకున్నాడు. కాగా మహిళల విభాగంలో మరో భారత్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి ఈగల్స్ తరఫున ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. మార్తా కోస్ట్యుక్‌తో జరిగిన ఆమె సింగిల్స్ పోటీలోను, డబుల్స్‌లోను ఫ్రెంచ్‌కు చెందిన గేల్ మోన్‌ఫిల్స్‌తో కలిసి కోస్ట్యుక్ మరియు దక్షిణేశ్వర్‌లతో జరిగిన పోటీలో ఆమె ఆకట్టుకుంది.

# ఐటి, ఆటో రంగాల్లో భారీ అమ్మకాలు
## వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలు




**ముంబయి డిసెంబరు 26:** ఐటీ, ఆటో రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడికారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో నష్టాల్లోనే ముగిసాయి. సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 367.25 పాయింట్లు నష్టపోయి 85,041.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 99.80 పాయింట్లు క్షీణించి 26,042.30 వద్ద ముగిసింది. సెలవుల కారణంగా ఈ వారం ట్రేడింగ్ సెషన్లు తక్కువగా ఉండటం, మార్కెట్‌ను నడిపించే బలమైన సానుకూల సంకేతాలు లేకపోవడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో పాటు సెన్సెక్స్ డెరివేటివ్‌ల గడువు ముగియడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీన పరిచింది. బీఎస్ఈలో టైటన్, ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు లాభపడగా, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వంటి షేర్లు నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో టైటన్, హిందాల్కో, నెస్లే ఇండియా లాభపడిన వాటిలో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ నష్టాలను చవిచూశాయి. స్మాల్, మిడ్ క్యాప్ మార్కెట్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.23 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.08 శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.03 శాతం, ఆటో ఇండెక్స్ 0.52 శాతం పతనమయ్యాయి. అయితే, దీనికి భిన్నంగా మెటల్ షేర్లు రాణించడంతో నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 0.59 శాతం లాభపడింది.




# నెదర్లాండ్స్ టాటాస్టీల్‌పై పోరాటం
## రూ.14,370 కోట్లు చెల్లించాలంటూ పిటిషన్


**ఆమ్‌స్టర్‌డామ్, డిసెంబరు 46:** టాటా గ్రూప్‌కు చెందిన టాటా స్టీల్ నెదర్లాండ్ యూనిట్‌పై అక్కడి స్వచ్ఛంద సంస్థ న్యాయపోరాటానికి దిగింది. కంపెనీ కార్యకలాపాల వల్ల స్థానిక ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆరోపిస్తూ నెదర్లాండ్స్‌లోని నార్త్ హాలెండ్ డిస్ట్రిక్ట్ కోర్టులో దావా దాఖలు చేసింది. పరిహారంగా 1.6 బిలియన్ డాలర్లు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ.14,370 కోట్లను చెల్లించాలని డిమాండ్ చేసింది. టాటా స్టీల్ అధికారికంగా ఈసమాచారం వెల్లడించింది. నెదర్లాండ్స్‌లోని వెల్సన్‌నూర్డ్ ప్రాంతంలో ఉన్న ఐజ్మొయిడన్ బీవీ ప్లాంట్ నుంచి వెలువడే కాలుష్యకారకాలు స్థానికుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆ స్వచ్ఛంద సంస్థ ఆరోపిస్తోంది. కాలుష్య ప్రభావంతో ప్రజలు నిరంతర భయాందోళనల్లో జీవించాల్సి వస్తోందని, ఇంట్లో ప్రశాంతంగా గడపలేకపోతున్నారని, ఆ ప్రాంతంలోని ఆస్తుల విలువ కూడా పడిపోయిందనేది ఎన్‌జీవో వాదనగా ఉంది. ఈ ఆరోపణలను టాటా స్టీల్ తీవ్రంగా ఖండించింది. ఎన్‌జీవో చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. తమ కార్యకలాపాలు నిబంధనలకు అనుగుణంగానే సాగుతున్నాయని, పర్యావరణ పరిరక్షణ విషయంలో తమకు అనుకూలంగా బలమైన ఆధారాలు ఉన్నాయని టాటా స్టీల్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ కేసు విచారణ రెండు దశల్లో కొనసాగుతుందని, ఒక్కో దశ పూర్తయ్యేందుకు కనీసం రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు సమయం పట్టే అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల ఇప్పట్లో పరిహారం చెల్లించే అంశం తలెత్తే అవకాశమే లేదని టాటా స్టీల్ స్పష్టం చేసింది. మరోవైపు, నెదర్లాండ్స్ ప్రభుత్వంతో కలిసి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టామని, ఉద్గారాలను నియంత్రించే దిశగా పెట్టుబడులు పెట్టి ఆధునిక సాంకేతికతను అమలు చేస్తున్నామని టాటా స్టీల్ పేర్కొంది.

## ఉద్యోగుల సంక్షేమంపై సిఇఒ ఉదారత
# రూ.2155 కోట్లు సిబ్బందికి పంపిణీ



**లూసియానా, డిసెంబరు 26:** ఉద్యోగుల సంక్షేమానికి తన విశాల హృదయం చాటుకున్న సిఇఒపై ప్రపంచస్థాయిలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఫైబర్‌బాండ్ సిఇఒ గ్రాహం వాకర్ తాను స్థాపించిన కంపెనీని అమ్మిన తర్వాత వచ్చిన లాభాల్లో ఏకంగా 240 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 2,155 కోట్లు తన ఉద్యోగులకు పంచిపెట్టి ఆయన తన ఉదారతను చాటుకున్నారు. లూసియానాకు చెందిన గ్రహం వాకర్, ఎలక్ట్రికల్ పరికరాల కోసం ఎన్‌క్లోజర్‌లను తయారుచేసే ఫైబర్‌బాండ్ అనే తన కుటుంబ వ్యాపారాన్ని ఈటన్ కార్పొరేషన్‌కు 1.7 బిలియన్ డాలర్లకు అంటే సుమారు రూ. 15,265 కోట్లకు విక్రయించారు. ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందే ఆయన ఒక ముఖ్యమైన షరతు పెట్టారు. కంపెనీ అమ్మకం ద్వారా వచ్చే మొత్తంలో 15 శాతాన్ని తన 540 మంది ఉద్యోగులకు చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ షరతుకు కొనుగోలుదారులు అంగీకరించడంతో ఒప్పందం ఖరారైంది. ఈ ఏడాది జూన్ నుంచి ఉద్యోగులకు చెల్లింపులు ప్రారంభమయ్యాయి. దీని ప్రకారం, ఒక్కో ఉద్యోగికి సగటున 4.43 లక్షల డాలర్లు మన కరెన్సీలో సుమారు రూ. 3.70 కోట్లు అందనున్నాయి. ఈ మొత్తాన్ని ఐదేళ్ల పాటు, వారు కంపెనీలో కొనసాగే ప్రాతిపదికన చెల్లిస్తారు. కష్టకాలంలో, ముఖ్యంగా 1998లో ఫ్యాక్టరీ కాలిపోయినప్పుడు, డాట్‌కామ్ సంక్షోభం సమయంలోనూ ఉద్యోగులు కంపెనీకి అండగా నిలిచారని, వారి విధేయతకు కృతజ్ఞతగా ఈ నిర్ణయం తీసుకున్నానని వాకర్ తెలిపారు. అనూహ్య బోనస్‌తో ఉద్యోగుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. చాలామంది ఈ డబ్బుతో తమ అప్పులు, ఇంటి లోన్లు తీర్చుకున్నారు. మరికొందరు కార్లు కొనుగోలు చేయగా, తమ పిల్లల ఉన్నత విద్య కోసం, రిటైర్మెంట్ కోసం పొదుపు చేసుకుంటున్నారు. వాకర్ తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## అమ్మకాలు పెరిగినా 'జెప్టో'కు తప్పని నష్టాలు..
# ఐపిఒతో ఆర్థికపరిపుష్టికి కంపెనీ నిర్ణయం



**ముంబయి, డిసెంబరు 26:** క్విక్ కామర్స్ సంస్థ జెప్టో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల్లో అద్భుతమైన వృద్ధిని సాధించినప్పటికీ, నష్టాలు భారీ స్థాయిలో పెరిగాయి. కంపెనీ నివేదికల ప్రకారం అమ్మకాలు రెట్టింపు కాగా, నష్టాలు అంతకుమించి పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జెప్టో మొత్తం అమ్మకాలు రూ. 9,668.8 కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ. 4,223.9 కోట్లుగా ఉండగా, ఏకంగా 129 శాతం వృద్ధి కనిపించింది. అదే సమయంలో కంపెనీ నికర నష్టం 177 % పెరిగి రూ. 3,367.3 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ నష్టం రూ. 1,214.7 కోట్లు మాత్రమే. మార్కెట్లో పోటీ తీవ్రతరం కావడంతో కార్యకలాపాల విస్తరణ, కొత్త డార్క్ స్టోర్ల ఏర్పాటు, కస్టమర్లను ఆకర్షించడం కోసం భారీగా ఖర్చు చేయాల్సి రావడమే ఈ నష్టాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. టర్నోవర్‌తో పోలిస్తే నష్టాల వాటా 2024లో 29 శాతంగా ఉండగా, 2025 నాటికి అది 35 శాతానికి పెరిగింది. ఇలాంటి ఆర్థిక ఫలితాల నేపథ్యంలోనే జెప్టో పబ్లిక్ మార్కెట్లలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈరోజు ఐపీఓ కోసం రహస్యంగా ముసాయిదా పత్రాలను దాఖలు చేయనుందని సమాచారం. ఈ నెల 23న జరిగిన వాటాదారుల సమావేశంలో కంపెనీ వ్యవస్థాపకులు ఆదిత్య పాలిచా, కైవల్య వోహ్రా, సీఎఫ్ఓ రమేశ్ బఫ్నాలను పూర్తికాల డైరెక్టర్లుగా నియమిస్తూ బోర్డులో కీలక మార్పులు చేశారు.

# జీవనకాల గరిష్టానికి వెండి, బంగారం ధరలు
## తులం బంగారం రూ.1.40 లక్షలు
### కిలో వెండి రూ.2.40 లక్షలు



**ముంబయి, డిసెంబరు 26:** భారత బులియన్ మార్కెట్‌లో శుక్రవారం బంగారం, వెండి ధరలు సరికొత్త చరిత్ర సృష్టించాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోయాయి. హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర తొలిసారిగా రూ.1,40,000 వద్ద ఆల్ టైమ్ గరిష్ఠాన్ని తాకింది. మరోవైపు, వెండి ధర కూడా ఊహించని రీతిలో పెరిగి కిలోకు రూ.2.40లక్షల వద్ద జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ధరల పెరుగుదల వెనుక పలు అంతర్జాతీయ పరిణామాలు ఉన్నాయి. ముఖ్యంగా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ 2026లో వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న బలమైన అంచనాలు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గితే, బంగారం వంటి వడ్డీరహిత ఆస్తులపై పెట్టుబడిపెట్టేందుకు చేసేందుకు ఇన్వెస్టర్లు మొగ్గుచూపుతారు. దీనికి తోడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికావెనిజులా మధ్య ఉద్రిక్తతలు, నైజీరియాలో అమెరికా సైనిక చర్యలు వంటి భౌగోళిక రాజకీయ అనిశ్చితి వల్ల సురక్షితమైన పెట్టుబడిగా బంగారం వైపు డిమాండ్ భారీగా పెరిగింది. డాలర్ బలహీనపడటం కూడా పసిడి, వెండి ధరల పెరుగుదలకు దోహదపడింది. రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ జిగర్ త్రివేది మాట్లాడుతూ పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత అంచనాల నేపథ్యంలో సురక్షితమైన పెట్టుబడి సాధనంగా బంగారానికి డిమాండ్ పెరిగింది. దీంతో శుక్రవారం ప్రపంచ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 4,500 డాలర్ల స్థాయిని చేరిందని వివరించారు. ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో దేశీయంగా రిటైల్ మార్కెట్‌లో అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. గత 15 రోజుల్లో అమ్మకాలు 50 శాతానికి పైగా తగ్గాయని జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జెఅండ్‌జె) మాజీ ఛైర్మన్ అనంత పద్మనాభన్ తెలిపారు. క్రిస్మస్, నూతన సంవత్సర సెలవులు, ఎన్నారైల రాక ఉన్నప్పటికీ మార్కెట్‌లో పెద్దగా కదలిక లేదని ఆయన పేర్కొన్నారు. అహ్మదాబాద్ జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిగర్ సోనీ మాట్లాడుతూ, ప్రస్తుత ధరల వద్ద వినియోగదారులు చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. పెళ్లిళ్ల కోసం కూడా 22 క్యారెట్ల బంగారానికి బదులుగా 14 లేదా 18 క్యారెట్ల ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు. చాలా మంది కొత్త బంగారం కొనడానికి బదులుగా తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని మార్చుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. బంగారంతో పోలిస్తే వెండి ధర మరింత వేగంగా పెరిగింది. దీనికి పారిశ్రామిక డిమాండ్ ఒక ముఖ్య కారణం. ఎలక్ట్రిక్ వాహనాలు , సోలార్ ప్యానెళ్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హార్డ్‌వేర్ రంగాల్లో వెండి వినియోగం విపరీతంగా పెరిగింది. సరఫరా కంటే డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వరుసగా నాలుగో ఏడాది కూడా వెండి లోటును ఎదుర్కొంటోంది. ఈ కారణంగానే ఈ ఏడాది వెండి ధర ప్రపంచవ్యాప్తంగా దాదాపు 158 శాతం పెరిగింది. మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం, ఈ బులియన్ ర్యాలీ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. 2026 ప్రథమార్థంలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్లకు, వెండి 90 డాలర్లకు చేరే అవకాశం ఉందని ఒవాండా సీనియర్ మార్కెట్ అనలిస్ట్ కెల్విన్ వాంగ్ అంచనా వేశారు. దేశీయంగా తులం బంగారం రూ.1,50,000, కిలో వెండి రూ.2,50,000 స్థాయిలను తాకే అవకాశం ఉందని అంచనా.

## అగర్‌బత్తీలకు బిఐఎస్ బార్‌కోడ్ తప్పనిసరి: రసాయన వినియోగాలపై ఆంక్షలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అగర్‌బత్తీలకు కేంద్రం కొత్తప్రమాణాలు జారీచేసింది. హానికర రసాయనాల వినియోగంపై నిషేధం ప్రకటించింది. వినియోగదారుల భద్రత, ఇండోర్ గాలి నాణ్యత పర్యావరణంపై ప్రభావంతోపాటు సువాసన సమ్మేళనాలు రసాయనాలపై అంతర్జాతీయంగా ఉన్న ఆంక్షలను దృష్టిలో పెట్టుకుని అగర్‌బత్తీలకోసం ఐఎస్ 19412ః 2025 ప్రమాణాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ బిఐఎస్ హాల్‌మార్క్ తప్పనిసరి చేసింది. దీనితో కొనుగోలుదారులు నమ్మకంతో కొంటారని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ వెల్లడించింది. అలెత్రిన్, పెర్మెత్రిన్, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి రసాయనాలు వినియోగించడాన్ని కేంద్రం నిషేధించింది. బెంజైల్ సైనేడ్; ఇథైల్ అక్రిలేట్, డైఫి నైలమైన్ వంటి సింథటిక్ సుగంధ పదార్థాల వినియోగంపైనా ఆంక్షలు విధించింది. ప్రస్తుతం ఏటా రూ.8వేలకోట్ల అగర్‌బత్తీలవ్యాపారంజరుగుతోంది. అమెరికా, మలేసియా, నైజీరియా, బ్రెజిల్,మెక్సికోవంటి దేశాలకు రూ.1200 కోట్లకుపైగానే మన అగర్‌బత్తీ ఎగుమతులు జరుగుతున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.